శనివారం
04-10-2025
సంపుటి : 22 సంచిక : 14
పేజీలు : 12 + 24
వెల : రూ. 6/-

# Crime News ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## బ్రహ్మోస్‌ను మించి ధ్వని క్షిపణి

**తయారీకి డిఆర్‌డిఎ రంగం సిద్ధం**




**న్యూఢిల్లీ,** బ్రహ్మోస్ ను మించి ధ్వనిక్షిపణి తయారీకి డిఆర్‌డిఎ రంగం సిద్ధం అవుతున్నట్లు సమాచారం. రక్షణ రంగంలో స్వయంసమృద్ధి సాధిస్తున్న భారత్.. మరింతగా అభివృద్ధిపైదృష్టి సారించింది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్ తరవాత తమ దృష్టిని పెంచింది. స్వదేశీ అధునా తన ఆయుధాల ఉత్పత్తికి పెద్దపీట వేస్తోంది. 2


## వివిధ పనులకు ఏపీ కేబినెట్...

# గ్రీన్ సిగ్నల్

- ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15 వేలు
- అమరావతి నిర్మాణంలో మరో ముందడుగు
- ఎమ్మెల్యేల పని తీరుపై సీఎం అసంతృప్తి
- రిజర్వాయర్‌లకు మరమ్మతులు: మంత్రి కొలుసు
- వజ్రకరూరుకి కొత్త లిఫ్ట్ స్కీంకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

**క్యారవాన్ టూరిజం..**

'అనంతపురం ఉరవకొండ – వజ్రకరూరుకి కొత్త లిఫ్ట్ స్కీంకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్. దీని ద్వారా 10వేల 500 ఎకరాలకు సాగునీరు, తాగునీరు వస్తుంది. ఈ పనులకు మంత్రి మండలి ఆమోదం. ఏపీ టూరిజం పాలసీలో క్యారవాన్ టూరిజం, హోమ్‌స్టే ప్రోత్సాహకాలు చేర్చాం.



మిగతా 2వ పేజిలో..



**అమరావతి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం ఏపీ సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై కేబి నెట్‌తో చర్చించారు సీఎం చంద్ర బాబు. ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ హబ్స్‌కు కేబినెట్ ఆమోదించింది. జల వనరుల శాఖ పనుల కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15 వేలు చొప్పున ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. కారవాన్ పర్యాటకంపై నిర్ణయం తీసు కుంది. అమృత్ పథకం 2.0 పనులను ఆమోదిం చింది ఏపీ కేబినెట్. అలాగే, రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. అమరావతి నిర్మా ణం కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా సీఆర్డీఏకు ఇవ్వని భూములను భూసేకరణ ద్వారా తీసుకునేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అయితే. రాజధాని అమరావతి కోసం ల్యాండ్ పూలింగ్ కోసం కొందరూ రైతులు భూములు ఇవ్వలేదు. వారి నుంచి భూసేకరణ చట్టం 2013 ద్వారా భూములు తీసుకోవాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చి.... పూలిం గ్‌కు భూములు ఇవ్వని రైతుల భూముల్లో ప్లాట్‌లు వచ్చిన వారికి ఊరట లభించింది. అటూ ప్రభుత్వ భవన సముదాయాల పక్క న ఉండి ల్యాండ్ పూలింగ్‌కు ఇవ్వని భూములను కూడా సేకరణ ద్వారా తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది మంత్రి మండలి. ఈ నిర్ణయంతో 2వ పేజిలో..

## భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి

కొలంబియా పర్యటనలో రాహుల్ వ్యాఖ్యలు




2

## ఇక వెంటనే చెక్ క్లియరెన్స్

ఆర్‌బిఐ సూచనలతో బ్యాంకుల అమలు

నేటి నుంచే అమల్లోకి కొత్త విధానం




2

## విదేశీ విద్యార్థులపై ట్రంప్ కొరడా

పరిమిత సంఖ్యలోనే విద్యార్థులకు అడ్మిషన్లు

యూనివర్సిటీలకు హుకూం జారీచేసిన వైట్‌హౌజ్



**వాషింగ్టన్:**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో హుకూం జారీచేశారు. విదేశీ విద్యార్థుల రాకపై ఆంక్షలు లాంటి కత్తి పెట్టారు. పరిమిత సంఖ్య లోనే వారిని అనుమతించాలని యూనివర్సీటీలను ఆదేశించారు. అమెరికా ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యా ర్థుల అడ్మిషన్లను పరిమితం చేయాలని వైట్ హౌజ్ విశ్వవిద్యాలయాలకు తేల్చిచె ప్పింది. ఈమేరకు ప్రతిపాదించిన నిబంధనలను మెమో రూపంలో దేశంలోని ప్రధాన యూనివర్శిటీలకు పంపింది. ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి, జాతి, లింగ ఆధారిత నియామకాలు నిలిపివేయడం, విద్యార్థుల అడ్మిషన్ సమయంలో కచ్చితంగా ప్రామాణిక పరీక్ష నిర్వహించడం వంటివి చేపడితేనే ప్రభుత్వ నిధుల కేటాయింపులో ప్రాధాన్యం లభిస్తుందని వెల్లడించింది. ఈ నిబంధ నలను అంగీకరించిన విశ్వవిద్యాలయాలు ప్రభుత్వం నుంచి వచ్చే లబ్దిని పొందవచ్చుని 2వ పేజిలో..

## అలెర్ట్‌గా ఉండాలి

వరద పరిస్థితులపై హోంమంత్రి అనిత



**అమరావతి** భారీ వర్షాలతోనాగావళి, వంశధార నదులు ఉప్పొంగిన నేపథ్యంలో శ్రీకాకుళం, మన్యం, విజయనగరం కలెక్టర్లు, ఎస్పీలతో హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత వరద పరిస్థితులపై ఆరా తీశారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ 24/7 అలెర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. 2వ పేజిలో..

## అందరం కలిసి ఉండాలన్నదే అలయ్ బలయ్

- కులమతాలతో విడదీసి పబ్బం గడుపుకోవాలనుకుంటే కుదరదు
- ఎక్కడో ఏదో జరిగిందని ..ఇక్కడా జరుగుతుందటే పొరపాటు
- భిన్నత్వంలో ఏకత్వం మన బలం అన్న వెంకయ్య
- దత్తాత్రేయ, బండారు విజయలక్ష్మిలకు అభినందన

**హైదరాబాద్,** వేషభాషలు వేరయినా అందరం భారతీయులమనే భావనతో కలిసి ముందుకెళ్తున్నామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారుదత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మిఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో నిర్వహించిన 'అలయ్‌బలయ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2వ పేజిలో..




## విండోస్ 10కు కాలం చెల్లినట్లే

14 నుంచి అందుబాటులోకి విండోస్ 11 వర్షన్

కొనసాగించాలనుకునే వారికి సెక్యూరిటీ కోడ్ ఉండదని హెచ్చరిక


2



## రష్యా వాణిజ్య మిత్రులపై ట్రంప్ పెత్తనం

భారత్ తమకు మంచి మిత్రదేశమన్న పుతిన్

అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గదద్దని హితవు



2

# తెలంగాణలో ఆర్థిక విధ్వంసం



- జిఎస్టీ వసూళ్లే ఇందుకు నిదర్శనం
- కాంగ్రెస్ పాలనపై కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్, (నినాదం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాజాగా, సెప్టెంబర్ నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే అట్టడుగున ఉండటం దారుణమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి సంబంధించిన మరో స్పష్టమైన సూచిక ఇదేనని ఆయన పేర్కొన్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం, కేసీఆర్ సమర్థ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తుచేశారు. జీఎస్టీ వృద్ధిలో ఈ పతనం, రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎంత విధ్వంసం పాలయ్యిందో చెప్పే ఒక నిదర్శనమని కేటీఆర్ ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం నుండి ఐటీ వరకూ అన్ని రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి దన్ను ఇవ్వడంతో ఆర్థికవ్యవస్థ పరుగులు తీసి, రికార్డులు తిరగరాసిందని కేటీఆర్ తెలిపారు. కానీ, నేడు కాంగ్రెస్ పాలనలో, పండుగ వచ్చినా, పబ్బం వచ్చినా 2వ పేజిలో..

## కెనడాలో భారతీయ సినిమాల నిలిపివేత

థియేటర్లపై వరుస దాడులతో నిర్ణయం



**టోరంటో:**వరుస దాడులు జరుగుతోన్న నేపథ్యంలో కెనడాలోని ఓ థియేటర్‌లో భారతీయ సినిమాల ప్రదర్శనను నిలిపివేశారు. భారతీయ సినిమాలు ప్రదర్శితమవుతోన్న సమయంలోనే ఈ దాడులు జరుగుతున్నాయని అందుకే వాటి ప్రదర్శనను రద్దు చేస్తున్నామని థియేటర్ యాజమాన్యం తెలిపింది. కెనడాలోని ఓక్‌విల్లే ప్రాంతంలో ఫిల్మ్.కా థియేటర్‌లో 2వ పేజిలో..

## కేంద్ర ప్రభుత్వానికి వచ్చే మూడేళ్లు కీలకం

ప్రతి శాఖ అనేక రిఫార్మ్స్ తీసుకువస్తోంది : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, (నినాదం):** కేంద్ర ప్రభుత్వానికి వచ్చే మూడేళ్లు చాలా కీలకమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతి శాఖ అనేక రిఫార్మ్స్ తీసుకువస్తోందని చెప్పుకొచ్చారు. కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉందని... 2వ పేజిలో..



## మద్యం విక్రయాలకు దసరా కిక్కు

పండగతో భారీగా అమ్మకాలు

**హైదరాబాద్, (నినాదం):** తెలంగాణలో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. దసరా కిక్కు ఇచ్చింది. అక్టోబర్ 2న దసరా రావడంతో ముందస్తుగానే 30, 1 తేదీల్లో భారగా మద్యం విక్రాయలు జరిగాయి. ఈ ఏడాది సెప్టెంబరులోనే రూ.3,046 కోట్ల మేర 2వ పేజిలో..



Crime News క్రైమ్ న్యూస్ తెలుగు దినపత్రిక

ninadam.in

## తెలంగాణలో ఆర్థిక విధ్వంసం

కూడా అన్ని రంగాలూ నేలచూపులే చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం నుండి రియల్ ఎస్టేట్ వరకూ అన్ని రంగాల్లోనూ దైన్యమే తాండవిస్తోందని మండిపడ్డారు. అరాచకత్వం, అవినీతి, అనుభవలేమి కలగలసిన రేవంత్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి గురవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపడానికి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు.

## బ్రహ్మోస్‌ను మించి ధ్వని క్షిపణి

అధునాతన క్షిపణి వ్యవస్థలు, ఫైటర్ జెట్లు, డ్రోన్ల ప్రాజెక్టులపై దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలో హైపర్‌సోనిక్ క్షిపణి ప్రయోగాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ 'ధ్వని' పరీక్షలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని డీఆర్‌డీఓ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో దడ పుట్టించిన బ్రహ్మోస్ కంటే ఈ క్షిపణులు భీకరంగా పనిచేస్తాయని అంచనా. అత్యంత వేగంగా ప్రయాణిస్తూ సుదూర లక్ష్యాలను నిమిషాల్లో ఛేదించగల సామర్థ్యం హెచ్‌జీవీల సొంతం. శబ్ద వేగానికి ఐదారు రెట్ల కంటే అధిక వేగంతో ఈ క్షిపణులు ప్రయాణించగలవు. డీఆర్‌డీఓ సిద్ధం చేస్తోన్న హెచ్‌జీవీ (ఆరలజీనితి) సుమారు గంటకు 7వేలకుపైగా కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. 1500 నుంచి 2వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదని అంచనా. వేగంతో పాటు దిశను మార్చుకునే సామర్థ్యం ఉండడంతో శత్రుదేశాల గగనతల రక్షణ వ్యవస్థలకు స్పందించే సమయం కూడా ఇవ్వదని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. హైపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణులకు భిన్నంగా ఈ నూతన గ్లైడ్ వెహికల్ ఉంటుంది. రాకెట్ సాయంతో అత్యంత ఎత్తుకు వెళ్లి.. అక్కడ నుంచి విడిపోయి హైపర్‌సోనిక్ వేగంతో లక్ష్యంవైపు దూసుకెళ్తుంది. శత్రువుల గగనతల నిరోధక వ్యవస్థలకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించే సామర్థ్యమున్న ఈ హెచ్‌జీవీ పరీక్షలను డీఆర్‌డీఓ ముమ్మరం చేసింది. ఇప్పటికే ఎయిర్‌ఫ్రేమ్ ఏరోడైనమిక్స్, థర్మల్ మేనేజిమెంట్, స్క్రామ్‌జెట్ ఇంజిన్ పనితీరు, గైడెన్స్ వ్యవస్థకు సంబంధించి క్షేత్రస్థాయి, వైమానిక పరీక్షలు చేసింది. ఈ ఏడాది చివరి నాటికి 'ధ్వని' పూర్తి స్థాయి పరీక్షలు జరిపేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## రష్యా వాణిజ్య మిత్రులపై ట్రంప్ పెత్తనం

మాస్కో:రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందున భారత్‌పై ట్రంప్ భారీ సుంకాలతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. దీనిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందిస్తూ ట్రంప్ విధానాలను తీవ్రంగా ఖండించారు. బయటి దేశాల ఒత్తిడికి భారత్ తలొగ్గకూడదని చెప్పారు. గురువారం దక్షిణ సోచిలోని మీడియాతో పుతిన్ మాట్లాడారు. మాస్కోతో ఇంధన వాణిజ్యాన్ని తగ్గించుకోవాలని ఇతర దేశాలపై ట్రంప్ చేస్తున్న ఒత్తిడిని పుతిన్ తప్పుబట్టారు. ఈ చర్య వల్ల వాషింగ్టన్‌కే ఎదురుదెబ్బ తగులు తుందని హెచ్చరించారు. రష్యా వాణిజ్య భాగస్వాములపై అధిక సుంకాలు విధిస్తే.. అది ప్రపంచంలోని ఇంధన ధరలపై ప్రభావం పడుతుందన్నారు. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఎక్కువగా పెంచేలా చేస్తుందని.. దాంతో అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తుందని హెచ్చరించారు. ఈసందర్భంగా డిసెంబరులో భారత్ లో పర్యటించనున్న విషయాన్ని పుతిన్ వెల్లడించారు. ప్రధాని మోదీతో తనకు మంచి స్నేహబంధం ఉందని చెప్పారు. ఇక, అమెరికా విధించిన శిక్షాత్మక సుంకాల నేపథ్యంలో భారత్ ఎదుర్కొంటున్న నష్టాలను రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు సమతుల్యం చేస్తాయన్నారు. వాణిజ్య ఇబ్బందులను తొలగించేందుకు తాము చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. భారత్‌తో ఏఐ భాగస్వామ్యానికి మద్దతిస్తున్నట్లు తెలిపారు. ఆ దేశం నుంచి మరిన్ని వ్యవసాయ, ఔషధ ఉత్పత్తులు కొనుగోలు చేస్తామన్నారు. ఈసందర్భంగా అమెరికన్ మార్కెట్‌కు తాము పెద్ద మొత్తంలో యురేనియంను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాను ఓ పేపర్ టైగర్ అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై కూడా పుతిన్ స్పందించారు. 'యూరప్‌లో పెరుగుతున్న రక్షణాత్మక చర్యలను తాము నిశితంగా గమనిస్తున్నామన్నారు. రష్యా ఉక్రెయిన్‌తోనే కాకుండా మొత్తం నాటో కూటమితోనే యుద్ధం చేస్తోందన్నారు. అయినా తమను కొందరు కాగితపు పులిగా పేర్కొంటున్నారు. మరి నాటో ఏంటని ట్రంప్‌నకు కౌంటర్ ఇచ్చారు.

### కేంద్ర ప్రభుత్వానికి వచ్చే

## మూడేళ్లు కీలకం

వాటిని సమర్థవంతంగా ఎదుర్కొవాలని సూచించారు. బ్రిటిష్ చట్టాలు ఇప్పటికీ అమలు అవుతున్నాయని తెలిపారు. వర్తమాన ప్రజల ఆలోచనలకు అనుగుణంగా చట్టాలు తేవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆలోచిస్తున్నారని చెప్పుకొచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో ఆ పార్టీ స్టేట్ లీగల్ సెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు, ఎంపీలు కే.లక్ష్మణ్, రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అర్జున్ రామ్ మేఘువాల్ ఐఏఎస్‌గా ఉన్నప్పటికీ రాజీనామా చేసి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారని ప్రశంసించారు. బీజేపీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం పాలసీలకు అనుగుణంగా కోర్టుల్లో మనం వాదిస్తామనేది చాలా కీలకమని తెలిపారు. రానున్న మూడేళ్లు మోదీ ప్రభుత్వానికి చాలా కీలకమని ఉద్ఘాటించారు. అందుకు ప్రత్యేకమైన శిక్షణ తరగతులు నిర్వహించాలని మార్గనిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వ స్టాండ్ బలంగా వినిపించేందుకు ఎఫర్ట్ పెట్టాలని సూచించారు. తెలంగాణలో అధికారంలోకి బీజేపీ రావాలి అంటే అందరం కలసి కట్టుగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు కిషన్‌రెడ్డి.

**కాలం చెల్లిన చట్టాలను ప్రధాని మోదీ రద్దు చేశారు: ఎంపీ లక్ష్మణ్**

కాలం చెల్లిన చట్టాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ రద్దు చేశారని బీజేపీ ఎంపీ కే.లక్ష్మణ్ తెలిపారు. దేశాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేసేందుకు ఇతర దేశాలు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. ప్రధాని మోదీ విజనరీ లీడర్ కాబట్టి వేగంగా స్పందిస్తున్నారని చెప్పుకొచ్చారు. జీఎస్టీ తగ్గింపుతో మోదీ దీపావళి వెలుగులను పేదల ఇళ్లల్లో నిపుతున్నారని వివరించారు. అగ్రదేశాలు అడ్డగోలు టారిఫ్‌లతో భారతదేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇండియా ఎదుగుదలను చాలా దేశాలు జీర్ణించుకోలేక పోతున్నాయని ఫైర్ అయ్యారు. స్వదేశీ వస్తువుల వినియోగించడం ద్వారా.. భారతదేశ ఆదాయం ఇతర దేశాలకు వెళ్లకుండా ఉంటుందని వెల్లడించారు. దీని ద్వారా పెట్టుబడులు పెరుగుతాయని... ఇతరులకు ఉపాధి కలుగుతోందని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

**న్యాయవాదులకు భద్రత కల్పించే చట్టాలు రావాలి: రాంచందర్ రావు**

ప్రజలకు త్వరితగతిన న్యాయం దక్కాలని గత చట్టాలను రద్దు చేసి.. భారత న్యాయ సంహిత చట్టాలను మోదీ సర్కార్ తెచ్చిందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. హైదరాబాద్ నడి రోడ్డుపై గతంలో ఓ న్యాయవాది దంపతులను నరికి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు వేసిన వాళ్లను వెనక్కి తీసుకోకపోతే హత్య చేశారని చెప్పుకొచ్చారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు ప్రస్తుతం జరుగుతోందని వివరించారు. న్యాయవాదులకు భద్రత కల్పించే చట్టాలు దేశంలో రావాలని రాంచందర్ రావు ఆకాంక్షించారు.

## విదేశీ విద్యార్థులపై ట్రంప్ కొరడా

ఆ లేఖలో వెల్లడించారు. వీటిల్లో విద్యార్థులకు ప్రభుత్వ రుణాలు, గ్రాంట్లు, కాంట్రాక్టులు, రీసెర్చి నిధులు, విదేశీ స్కాలర్స్‌కు వీసా అనుమతులు, ట్యాక్స్ కోడ్‌లో ప్రాధాన్యం వంటివి పొందవచ్చని పేర్కొంది. అమెరికాలో ఉన్నతవిద్యను పునర్ వ్యవస్థీకరించి తమ భావజాలానికి అనుకూలంగా మార్చుకోవడానికి ట్రంప్ కార్యవర్గం చేస్తున్న మరో యత్నంగా దీనిని భావిస్తున్నారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం ప్రభుత్వంతో 500 మిలియన్ డాలర్ల డీల్ చాలా దగ్గరగా ఉందని పేర్కొన్నారు. వైట్‌హౌస్ నుంచి లేఖలు అందుకొన్న వాటిలో అమెరికాలోని ఎంఐటీ సహా ప్రముఖ విశ్వ విద్యాలయాలు మొత్తం ఉన్నాయి. ఈ క్రమంలో విదేశీ వీసాలపై వచ్చే విద్యార్థుల సంఖ్య 15 శాతానికి మించి ఉండకూడదు. ఒకే దేశం నుంచి వచ్చిన విద్యార్థుల సంఖ్య 5 శాతానికి మించకూడదు. విదేశాల నుంచి అందే నిధుల వివరాలను బహిర్గతం చేయాలి. విద్యార్థుల అడ్మిషన్, ÷నాన్షియల్ ఎయిడ్ సమయంలో లింగ, జాతి, జాతీయత, రాజకీయ భావజాలం, జెండర్ ఐడెంటిటీ, లైంగిక ఆకర్షణ, మతపరమైన అంశాలు పరిగణనలోకి తీసుకోకూడదు. అండర్ గ్రాడ్యుయేట్ దరఖాస్తు దారులు కచ్చితంగా ప్రామాణిక పరీక్షను పూర్తిచేయాల్సిందే. విద్యా స్వేచ్ఛను కాపాడే విధానాలు అమలుచేయాలి. సంప్రదాయవాద ఆలోచన సరళిని ఇబ్బందిపెట్టే, దాడులకు పాల్పడే యూనిట్స్‌ను తొలగించడం వంటివి ఉన్నాయి. విద్యాలయాలను ఇబ్బందిపెట్టేలా రాజకీయ ప్రదర్శనలు, విద్యార్థులను లేదా గ్రూపులను వేధించకుండా చర్యలు చేపట్టాలి. ఉద్యోగులు అధికారిక విధుల సమయంలో రాజకీయ ప్రసంగాలు, చర్యలకు దూరంగా ఉండాలి. బాత్‌రూమ్‌లు, లాకర్ రూమ్‌లు లింగ ఆధారంగా వేర్వేరుగా ఉండాలి. హార్డ్‌సైన్స్ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉచిత ట్యూషన్ ఫీజ్, ప్రోత్సాహకం కింద 2 మిలియన్ డాలర్లు మించి ఇవ్వాలని ప్రతిపాదించారు. ఈ నిబంధనలు ఏమేరకు అమలు చేస్తున్నారనే అంశాన్ని జస్టిస్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్స్‌ను సమీక్షించి తెలుసుకొంటుంది. వీటిని ఉల్లంఘిస్తే ప్రభుత్వ లబ్దిని రెండేళ్లపాటు ఆపేస్తారు.

## ఇక వెంటనే చెక్ క్లియరెన్స్

**ముంబై:** చెక్కు వినియోగదారుకలు ఆర్‌బిఐ శుభవార్త చెప్పింది. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక బ్యాంకింగ్ వ్యవస్థలో ఎన్నో మార్పులొచ్చాయి. ఈ క్రమంలో చెక్‌ల క్లియరెన్స్‌ను కూడా గంటల్లో పరిష్కరించే వ్యవస్థ ఆందుబాటులోకి వచ్చింది. శనివారం నుంచి ఇక చెక్ క్లియరెన్సులు వెంటలనే అమలవుతాయి. ఏదైనా చెక్కు క్లియర్ అవ్వాలంటే ప్రస్తుతం రెండ్రోజుల సమయం పడుతోంది. ఇకపై ఈ సమయం గణనీయంగా తగ్గనుంది. అక్టోబర్ 4 నుంచి కొన్ని గంటల్లోనే చెక్కు క్లియర్ కానుంది. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బ్యాంకులు శనివారం నుంచి దీన్ని అమలు చేయనున్నాయి. చెక్కులు క్లియర్ చేయడానికి అయ్యే సమయాన్ని గంటల వ్యవధిలోకి తగ్గించేందుకు ఆర్‌బీఐ కంటిన్యూస్ క్లియరింగ్ వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో చెక్కు సమర్పించిన గంటల వ్యవధిలోనే క్లియర్ అవుతుంది. ఈ విధానంలో వ్యాపార వేళల్లో చెక్కుల స్కానింగ్, సమర్పణ, క్లియరింగ్ అనేవి నిరంతరాయంగా సాగుతాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు చెక్కులు సమర్పించవచ్చు. సాయంత్రం 7 గంటల్లోపు క్లియర్ అవుతాయి. అంటే చెక్కు ఉదయం డిపాజిట్ చేస్తే అదే రోజు సాయంత్రానికల్లా నగదు మీ బ్యాంకు ఖాతాలో జమ అయిపోతుంది. సంబంధిత చెక్కును ఆమోదించడమో, తిరస్కరించడమో ఏదైనా సరే సాయంత్రం ఏడుకల్లా జరిగిపోవాలని బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించింది. మొత్తం రెండు దశల్లో ఈ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఫేజ్-1లో భాగంగా సాయంత్రం 7 గంటల్లోపు గడువు నిర్దేశిరచగా.. ఫేజ్-2లో కేవలం మూడు గంటల్లోనే చెక్కు క్లియర్ చేయాల్సి ఉంటుంది. 2026 జనవరి 3 నుంచి రెండో దశ ప్రారంభమవుతుంది. అంటే బ్యాంకు పనివేళల్లో ఎప్పుడు చెక్కు సమర్పించినా మూడు గంటల వ్యవధిలోనే బ్యాంకు ఖాతాలో నగదు జమవుతుంది. అంటే ఉదయం 10 గంటలకు చెక్కు సమర్పిస్తే మధ్యాహ్నం ఒంటిగంటకల్లా దాన్ని బ్యాంకులు క్లియర్ చేయాల్సి ఉంటుందన్నమాట. దీనికోసం మునుపటిలా రోజులతరబడి వేచి చూడాల్సిన అవసరం తప్పుతుంది.

## వివిధ పనులకు ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్

అమరావతి భూముల విషయంలో పూర్తిస్థాయిలో అడ్డంకులు తొలగిపోయాయి. ఏపీలో అన్ని చెరువులు పూర్తి స్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ అధికారులను అభినందించారు సీఎం చంద్రబాబు. పూర్ణోదయ పథకంలో ఆంధ్రప్రదేశ్‌ను చేర్చాలని సూచించారు. విజయవాడ ఉత్సవాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులను సీఎం అభినందించారు. ఇలాంటి ఉత్సవాలు ప్రతి జిల్లాలో జరిగే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కడప స్టీల్ ప్లాంట్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపీ అసెంబ్లీలో నూతన ఎమ్మెల్యేల పని తీరుపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృత్తం కాకుండా ఆయా జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులే బాధ్యత తీసుకోవాలని హుకుం జారీ చేశారు. ఈ నెల 16వ తేదీన జరిగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమావేశాన్ని విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలకు వివరించాలని సూచించారు సీఎం చంద్రబాబు.

రిజర్వాయర్‌లకు మరమ్మతులు: మంత్రి కొలుసు పార్థసారథి హంద్రీ - నీవా ప్రాజెక్ట్‌లో అమిద్యాల లిఫ్ట్ స్కీంని కేబినెట్ ఆమోదించిందని పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రకాశం బ్యారేజ్- దివిసీమ ప్రాంతాల్లో వరద నష్టం పనులకు అనుమతులను గత సంవత్సరమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని.. ఇందుకోసం రూ.107 కోట్లను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తుచేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద, దివిసీమ వద్ద వీక్ అయిన బండ్స్‌ను రూ.4.49 కోట్లకు పనులు చేయడానికి మంత్రిమండలి ఆమోదం తెలిపిందని అన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో మైలవరం రిజర్వాయర్‌ని 1981-1982లో నిర్మాణం చేశారని తెలిపారు. 2021లో వచ్చిన భారీ ఫ్లడ్‌ను పట్టించుకోకపోవడంతో రూ. 3 కోట్లతో రిపేర్లు చేయించడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పుకొచ్చారు. లక్ష 15వేల ఎకరాలకు నీరు అందించడం , తిరుపతి, తిరుమలకు తాగునీరు అందించేందుకు 2017-2018లో టెండర్‌లని ఎన్సీసీకి ఇచ్చారని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టును గత జగన్ ప్రభుత్వం మూలన పడేసిందని విమర్శించారు. తిరుపతిలో ప్రతి సంవత్సరం ఫ్లోటింగ్ పాపులేషన్ పెరుగుతూనే ఉందని తెలిపారు. ఈ అవసరాలను దృష్టిలో పెట్టుకొని అవసరమైన పనులు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు మంత్రి కొలుసు పార్థ సారధి.

**క్యారవాన్ టూరిజం..**

'అనంతపురం ఉరవకొండ - వజ్రకరూరుకి కొత్త లిఫ్ట్ స్కీంకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్. దీని ద్వారా 10వేల 500 ఎకరాలకు సాగునీరు, తాగునీరు వస్తుంది. ఈ పనులకు మంత్రి మండలి ఆమోదం. ఏపీ టూరిజం పాలసీలో క్యారవాన్ టూరిజం, హోమ్‌స్టే ప్రోత్సాహకాలు చేర్చాం. పెన్నా నదిపై మిడ్ పెన్నా రిజర్వాయర్‌ని 1962లో నిర్మించారు. గత ఐదేళ్లు నిర్వహణ చేయకపోవడంతో చాలా ఇబ్బందులు వచ్చాయి. స్త్రీ శక్తి పథకాన్ని 10 కోట్ల మంది మహిళలు ఉపయోగించుకున్నారు. రూ.15వేల చొప్పున ఆటోడ్రైవర్‌లకు ప్రతి జిల్లాల్లో ఆటోడ్రైవర్‌ల సేవలో పథకం అమలు చేస్తున్నాం. పథకం ద్వారా 2 లక్షల 90వేల 669 మందికి లబ్ధి చేకూరనుంది. ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం 2024 - 2029కి క్యారవాన్ పార్కులు, క్యారవాన్‌లకి కేబినెట్ ఆమోదం. క్యారవాన్లు పెట్టేవారికి లైఫ్ ట్యాక్స్ , పార్కులు ఏర్పాటు చేసేవారికి స్టాంప్ డ్యూటీ మినహాయింపు. బదిలీల్లో 100శాతం ఇన్సెంటివ్ ఉంటుంది. మొదటిగా వచ్చిన 25 క్యారవాన్‌లకు 100శాతం లైఫ్ టాక్స్ మాఫీ. తర్వాత వచ్చే వాటికి ఇన్సెంటివ్‌లు ఉంటాయి. హోంస్టేలకు సంబంధించి టూరిజం పాలసీకి ఆమోదం. 1 నుంచి 6 రూములు హోంస్టేల కిందకు వస్తాయని.. అంతకు మించితే హోటల్‌గా పరిగణిస్తాం. ఈ హోంస్టేలలో ఓనర్‌లు కూడా అందులో నివాసం ఉండాలి అనే నిబంధన తప్పనిసరి' అని మంత్రి కొలుసు పార్థ సారధి తెలిపారు.

## వాయుగుండ ప్రభావంతో వంశధారాకు భారీగా వరద

### మూడో ప్రమాద హెచ్చరిక జారీచేసినట్లు కలెక్టర్ వెల్లడి



**శ్రీకాకుళం :** తీవ్ర వాయుగుండం కారణంగా కురుస్తున్న వర్షాలతో వంశధార నదిలోకి వరదనీరు భారీగా చేరుతోంది. శ్రీకాకుళం జిల్లా హిరమండలంలోని గొట్టా బ్యారేజీ వద్ద వంశధార ఉధృతంగా ప్రవహిస్తోంది. ఒడిశాలోని అరబంగి, బడనాలా రిజర్వాయర్ల నుంచి నీరు విడుదల చేయడంతో నదిలోకి వరద భారీగా వస్తోంది. గొట్టా బ్యారేజీ నుంచి 1.04లక్షల క్యూసెక్కుల వరదనీరు దిగువకు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. నదీపరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని అధికారులు తెలియజేయాలని ఆయన ఆదేశించారు. మరోవైపు జిల్లాలోని పాతపట్నం వద్ద మహేంద్రతనయ నదిలో నీటి ప్రవాహం పెరుగుతోంది. దీంతో పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ శివారు మహేంద్రనగర్ వీధిలోకి వరదనీరు చేరింది. పాతపట్నంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వంశధార నదిలో పెరిగిన వరద కారణంగా భామిని మండలం కీసరలో 300ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. బూర్జ మండలంలో నారాయణపురం, చిన్నలంకాం పరిధిలో చాలా చోట్ల పంటపొలాలు ముంపులో ఉన్నాయి.

## విండోస్ 10కు కాలం చెల్లినట్లే

**న్యూఢిల్లీ:**కంప్యూటర్‌లో విండోస్ 10 వాడుతున్న వారికి ఇదో హెచ్చరిక. విండోస్ 10 వాడుతున్న వారికి త్వరలో మైక్రోసాఫ్ట్ సపోర్ట్ నిలిపివేయనుంది. అక్టోబర్ 14 నుంచి ఎలాంటి సెక్యూరిటీ అప్‌డేట్స్ విడుదల చేయబోమని స్పష్టంచేసింది. ఒకవేళ ఇప్పటికీ ఈ ఆపరేటింగ్ సిస్టమ్‌నే వాడుతుంటే 11కు అప్‌డేట్ అవ్వాల్సిందే. విండోస్ 10కు సపోర్ట్ నిలిపివేయనున్నట్లు దాదాపు రెండేళ్ల క్రితమే మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ఆ గడువు మరికొన్ని రోజుల్లో ముగియనుంది. విండోస్ 10కు మైక్రోసాఫ్ట్ సపోర్ట్ నిలిపివేసినా ఎప్పటిలానే ఓఎస్ పని చేస్తుందని మైక్రోసాఫ్ ప్రతినిధి తెలిపారు. అయితే, సెక్యూరిటీ అప్‌డేట్స్ మాత్రం రావని స్పష్టంచేశారు. దీనివల్ల భద్రతా పరమైన రిస్కులు, మాల్‌వేర్, కంపాటబిలిటీ వంటి సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో బ్రౌజింగ్ చేసే వారికి రిస్క్ పొంచి ఉంటుందని పేర్కొన్నారు. అయితే, సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ అప్‌డేట్స్ మాత్రం 2028 అక్టోబర్ వరకు కొనసాగుతాయని మైక్రోసాఫ్ట్ స్పష్టంచేసింది. ఇది ప్రాథమిక స్థాయిలో భద్రతను మాత్రమే అందించగలదు.

అలాగే, ఆపరేటింగ్ సిస్టమ్ సెక్యూరిటీ అప్‌డేట్స్‌తో పోలిస్తే యాంటీ వైరస్‌లు ఇచ్చే భద్రత అంతంతమాత్రమేనని పేర్కొంది. ఒకవేళ పూర్తి స్థాయిలో భద్రత కోరుకునేవారైతే ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ ప్రోగ్రామ్‌ను ఎంపిక చేసుకోవచ్చని మైక్రోసాఫ్ట్ సూచించింది. దీనికి కొంతమొత్తం చెల్లించాల్సి ఉంటుంది. అక్టోబర్ 15 నుంచి డివైజ్ సెట్టింగ్స్‌లో సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్‌ను అందుబాటులో ఉంటుంది. మైక్రోసాఫ్ట్ విండోస్ 10ను లక్షలాది మంది వినియోగిస్తున్నారు. వారంతా 11కు అప్‌గ్రేడ్ అయ్యేలా చూడాలన్నది మైక్రోసాఫ్ట్ భావిస్తోంది. అందుకే విండోస్ 11కు అప్‌గ్రేడ్ అవ్వకపోతే సెక్యూరిటీ అప్‌డేట్స్ నిలిపివేస్తామంటోంది. ఏదైనా కారణం చేత విండోస్ 10లోనే కొనసాగాల్సి వస్తే.. డబ్బులు పెట్టి ఎక్సటెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ ప్రోగ్రామ్ కింద సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు ఈ ఈఎస్‌యూ ప్రోగ్రామ్‌లో కేవలం సెక్యూరిటీ అప్‌డేట్స్ మాత్రమే లభిస్తాయి. కొత్త ఫీచర్లు గానీ, డిజైన్ మార్పిడి రిక్వెస్టులు గానీ, నాన్ సెక్యూరిటీ రిక్వెస్టులు గానీ అందించదు.

## భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ పాలనలోని భారత్‌లో ప్రజాస్వామ్య దాడులు జరుగుతున్నా యంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. దేశానికి అత్యంత ప్రమాదకరమైనది ఏదైనా ఉందంటే అది దేశంలో ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడేనంటూ మండిపడ్డారు. కొలంబియా పర్యటనలో ఉన్న ఆయన ఈఐఏ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భారత్‌లో ఎన్నో మతాలు, కులాలు, సంప్రదాయాలు ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రతిఒక్కరికీ చోటుకల్పిస్తుంది. కానీ ప్రస్తుతం ఈ వ్యవస్థ ముప్పేటదాడిని ఎదుర్కొంటోందన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. ఇంధన వినియోగంలో వచ్చిన మార్పులతో అనేక సామ్రాజ్యాల సృష్టి జరుగుతూవస్తోంది. బ్రిటిష్‌వారు ఆవిరి యంత్రం, బొగ్గుపై నియంత్రణ సాధించారు. తర్వాత వారు సూపర్‌పవర్‌గా మారారు. ఆ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి 1947లో మేం స్వాతంత్ర్యం సాధించుకున్నాం. పెట్రోల్ వినియోగం పెరిగింది. ఆ క్రమంలో అమెరికన్ల పట్టుపెరిగింది. ప్రపంచం ఇప్పుడు ఎలక్ట్రిక్ మోటార్ వైపు మళ్లుతోంది. ఇప్పుడు పోటీ అమెరికా, చైనా మధ్య నెలకొని ఉంది. ఈ విషయంలో చైనానే ముందుంది. చైనాకు భారత్ పొరుగుదేశం. అమెరికాకు మిత్రదేశం. ఈ రెండు దేశాలు పోటీపడుతుంటే మధ్యలో మేం ఉన్నాం. చైనాకంటే భారత్ జనాభా ఎక్కువ. ఆ దేశంలో కేంద్రీకృత వ్యవస్థ ఉంది. ఇండియాలో వికేంద్రీకృత, వైవిధ్య వ్యవస్థ ఉంది. అది సంక్లిష్టంగా ఉంటుంది. చైనాతో పోల్చుకుంటే భారత్‌కున్న సామర్థ్యాలు భిన్నమైనవి. మా దేశం అధ్యాత్మిక, సైద్ధాంతిక సంప్రదాయాలను కలిగిఉంది. అవి ఈనాటికీ ఆచరణీయమైనవి. చైనాలాగా భారత్ తన ప్రజలను అణచి వేయదని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఆర్థిక వృద్ధి ఉంది. అయితే మాది సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థ. కానీ ఉత్పత్తి భారీ స్థాయిలో లేకపోవడంతో ఉద్యోగాల కల్పన ఆశించినస్థాయిలో లేదు. చైనా అప్రజాస్వామిక వాతావరణంలో ఉత్పత్తి చేస్తోంది. కానీ మాకు ప్రజాస్వామ్య వ్యవస్థే ఉండాలి. అలాంటి వ్యవస్థను అభివృద్ధి చేయడమే సవాలని పేర్కొన్నారు.

### కెనడాలో భారతీయ

## సినిమాల నిలిపివేత

వారం రోజుల వ్యవధిలోనే రెండుసార్లు దాడులు జరిగాయి. దీంతో భారతీయ సినిమాల ప్రదర్శనను నిలిపివేసింది. ఆ సినిమాల్లో 'కాంతార చాప్టర్ 1', 'ఓజీ' కూడా ఉండడంతో వాటిని కూడా ప్రదర్శించడం లేదని యాజమాన్యం తెలిపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 25న మొదటిసారి దాడి జరిగింది. ఇద్దరు అనుమానితులు హాలుకు నిప్పు అంటించే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే మంటలను ఆర్పారు. దీంతో పెద్దగా నష్టం జరగకపోవడంఠ ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా అక్టోబర్ 2న మరో దాడి జరిగింది. తెల్లవారుజాము ప్రాంతంలో ఒక అనుమానితుడు థియేటర్ ప్రవేశ ద్వారం వద్ద కాల్పులు జరిపాడు. దీంతో యాజమాన్యం సినిమాలను నిలిపివేసింది. ఈ దాడుల వెనక ఖలిస్థానీ ఉగ్రవాదుల హస్తం ఉన్నట్లు థియేటర్ యాజమాన్యం అనుమానిస్తోంది. అయితే పోలీసులు మాత్రం ఈ విషయాన్ని నిర్ధరించలేదు. కెనడాలోని ఖలిస్థానీ ఉగ్రవాదులు (ఐరజ్జీ÷తిబబిజీనితి ఉసనీబూబ) వాంకోవర్‌లోని భారత్ (ఎనిటతిజీ) కాన్సులేట్‌ను సీజ్ చేస్తామంటూ ఇటీవల బెదిరింపులకు పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో ఈ థియేటర్ దాడుల వెనక కూడా వారి హస్తం ఉండి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

## అలెర్ట్‌గా ఉండాలి

ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని... ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వరద సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది వెంటనే స్పందించాలన్నారు. వంశధార, నాగావళి నది లోతట్టు ప్రాంత ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక మెసేజ్లు పంపాలని ఆదేశించారు. విపత్తుల సమాచారం, సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలన్నారు. విపత్తుల సంస్థ హెచ్చరిక సందేశం వచ్చినప్పుడు ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఉండాలని హోమ్, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత సూచనలు చేశారు. మరోవైపు వంశధార నది పరివాహక ప్రాంతంలో దిగువన ఉన్న గ్రామ ప్రజలకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రకటించారు. వంశధార నదికి గొట్ట బ్యారేజ్ వద్ద దిగువకు 1,04,891 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం తెలియజేయాలని కలెక్టర్ స్వప్నిల్ ఆదేశించారు.

### అందరం కలసి ఉండాలన్నదే

## అలయ్ బలయ్

ప్రముఖులను దత్తాత్రేయ సత్కరించారు. అనంతరం పలువురు ప్రముఖులు మాట్లాడారు. తొలుత వెంకయ్యనాయుడు మాట్లాడుతూ అందరం కలిసి ఉండాలనేది అలయ్ బలయ్ ఉద్దేశమన్నారు. 20 ఏళ్లుగా బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని కొనియాడారు. కొందరు కులం, మతం, వర్ణం, వర్గం, జాతి పేరుతో ప్రజల్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మన దేశంలో అలాంటి ఆశలు పెట్టుకున్నవారు నిరాశ చెందక తప్పదని చెప్పారు. చిన్నచిన్న విభేదాలు వచ్చినా భారతీయులం అనే భావనతో అందరూ కలిసి వెళ్తుంటారన్నారు. ఈ కార్యక్రమంతో ఐక్యతా సందేశాన్ని అందించడం ముదావహమని పేర్కొంటూ దత్తాత్రేయ, విజయలక్ష్మిలకు వెంకయ్యనాయుడు అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రజలకు తెలుస్తాయని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. అందర్నీ ఒక్కచోట చేర్చి ఐక్యత తెచ్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. సంప్రదాయాలకు అనుగుణంగా అలయ్ బలయ్ నిర్వహిస్తున్న దత్తాత్రేయ, విజయలక్ష్మిలకు ఆయన అభినందనలు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దత్తాత్రేయ అజాత శత్రువని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ప్రేమిస్తారని.. అందుకే పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ఇక్కడికి వచ్చారని చెప్పారు. ప్రముఖ సినీనటుడు నాగార్జున మాట్లాడుతూ ఇలాంటి సత్కారం తనకు మొదటిసారి అని.. చాలా కొత్తగా ఉందని చెప్పారు. దత్తాత్రేయకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. మనమంతా కలసి ఉన్నామని చెప్పడంతో పాటు ఒకరికి ఒకరమన్న ధైర్యం కల్పించిందన్నారు. 2005 నుంచి ఇప్పటి వరకు 20 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న ఈ కార్యక్రమం తమకెంతో కాన్ఫిడెన్స్ ఇస్తుందన్నారు. దత్తాత్రేయతో తనకు ఎప్పటినుంచో పరిచయం ఉందని.. దీనికి ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉందని నాగార్జున చెప్పారు. ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ అలయ్ బలయ్ అంటే హృదయపూర్వకంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ప్రేమను పంచుకోవడమని చెప్పారు. శాంతి, ప్రేమ కరవైపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి పరస్పరం గౌరవించుకోవడం అవసరమన్నారు. శ్రీరాముడి కాలం నుంచి నేటి వరకు ఇది కొనసాగుతోందన్నారు.


## మద్యం విక్రయాలకు దసరా కిక్కు

మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు 29న రూ.278 కోట్లు, 30న రూ.333 కోట్లు, అక్టోబర్ 1న రూ.86.23 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ 3 రోజుల్లోనే 60 నుంచి 80శాతం వరకు అమ్మకాలు పెరిగాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు.. రాష్ట్ర వ్యాప్తంగా 29.92 లక్షల కేసుల లిక్కర్, 36.46 లక్షల కేసుల బీర్లు విక్రయించారు. గతేడాదితో పోలిస్తే 7శాతానికిపైగా మద్యం విక్రయాలు పెరిగాయి. మద్యం సేల్స్ పెరగడంతో ఎక్సైజ్ శాఖకు రాబడి పెరిగింది.

# కాంతివంతమైన చర్మం కోసం...

# క్యారెట్ ప్యాక్స్ వేసేయండి

క్యారెట్‌లోని పోషకాలు ఆరోగ్యానికే కాదు.. అందాన్ని రెట్టింపు చేయడానికి సహాయపడతాయని నిపు ణులు అంటున్నారు. క్యారెట్ మన ఆహారం తీసుకున్నా, ఎక్స్‌టర్నల్‌గా అప్లై చేసినా.. అనేక సౌందర్య ప్రయోజనాలు పొందవచ్చు. క్యారెట్ ఫ్యాక్స్‌తో ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో తెలుసుకో వాలంటే ఈ స్టోరీ చదివేయండి.



క్యారెట్ పోషకాల గని. ఇది మన డైట్‌లో తరచుగా తీసు కుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. క్యారె ట్‌లో ఎ, కె, బి6 విటమిన్లు, బయోటిన్, మినరల్స్, బీటా కెరొటిన్ గుణాలెక్కువ. క్యారెట్ తీసుకుంటే.. డయాబెటిస్ ముప్పు తగ్గుతుంది. దీనిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. క్యారెట్‌లో ఉండే యాంటీ ఆక్సిడెం ట్లు, పొటాషియం గుండె, మెదడు, మూత్రపిండాల ఆరోగ్యానికి చాలా మంచివి. రక్తపోటును అదుపులో ఉంచుతాయి. క్యారెట్‌లోని పోషకాలు ఆరోగ్యానికే కాదు.. అందాన్ని రెట్టింపు చేయడానికి సహాయపడతాయని నిపు ణులు అంటున్నారు. క్యారెట్ మన ఆహారం తీసుకున్నా, ఎక్స్‌టర్నల్‌గా అప్లై చేసినా.. అనేక సౌందర్య ప్రయో జనాలు పొందవచ్చు. క్యారెట్ ఫ్యాక్స్‌తో ఎలాంటి ప్రయోజ నాలు ఉంటాయో తెలుసుకో వాలంటే ఈ స్టోరీ చదివే యండి. మీరు ప్రకాశవంతమైన, స్పష్టమైన చర్మాన్ని పొందడానికి క్యారెట్ ప్యాక్ సహాయపడు తుంది. క్యారెట్‌లో బీటా కెరోటిన్, విటమిన్ సి, విటమిన్ కె, డైటరీ ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలన్నీ మీ చర్మాన్ని కాంతివంతంగా మార్చుతాయి. ఈ ప్యాక్ తరచూ వేసుకుంటే.. చర్మ సమస్యలు తొలగుతాయి.

**ఆయిల్స్‌ను మెయింటేన్ చేస్తుంది..**

క్యారెట్ ఫేస్ మాస్క్ మెరిసే మచ్చలేని చర్మాన్ని అందిస్తుంది. ఇది డెడ్ సెల్స్‌ను తొలగించి.. చర్మానికి కాంతిని ఇస్తుంది. క్యారెట్‌లోని విటమిన్ ఎ చర్మంలోని అధిక నూనెను బయటకు పంపి.. తాజాగా, టాక్సిన్స్ లేకుండా ఉంచుతుంది. జిడ్డు చర్మం ఉన్నవారికి క్యారెట్ బెస్ట్ ఆప్షన్. క్యారెట్ చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది, ఛాయను మెరుగు పరుస్తుంది. స్కిన్ ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే బ్యాక్టీరియా నుంచి కూడా రక్షిస్తుంది.

**తేమను అందిస్తుంది..** క్యారెట్‌లో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది మన చర్మం పొరల్లోకి వెళ్లి పొడిబారకుండా కాపాడుతుంది. క్యారెట్ మాస్క్.. చర్మానికి లోతుగా తేమను అందించి, మెరిసేలా చేస్తుంది.

**యూవీ కిరణాల నుంచి రక్షిస్తుంది...** క్యారెట్‌లో ఉండే బీటా కెరో టిన్, కెరోటినాయిడ్స్ కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తాయి, సన్ టాన్ ను కూడా తొలగిస్తాయి. క్యారెట్లలోని విటమిన్లు, మినరల్స్.. కంటి కింద తేమను రక్షిస్తాయి. చర్మం రంగును మెరుగుపరుస్తాయి. క్యారె ట్ ప్యాక్.. వృద్ధాప్య ఛాయలు త్వరగా రాకుండా కాపాడుతుంది.

**చర్మ సమస్యలు మాయం..**


క్యారెట్‌లోని బీటా-కెరోటిన్ చర్మం ఇన్ఫ్లమేషన్‌ను తగ్గించడంలో సహా యపడుతుంది. ఇది రోసేసియా, తామర, సోరి యాసిస్, దద్దుర్లు, మొటిమల సమస్యలు ఉన్న వారికి గొప్పగా పనిచేస్తుంది.

**వృద్ధాప్య ఛాయలు త్వరగా రావు..** దీనిలో ఉండే కెరొటినాయిడ్స్, బయోయాక్టివ్ ఫ్లైవనాయిడ్లు కణాల ఆరోగ్యానికి చాలామంచిది. విటమిన్ ఎ.... కణాలు, కొలాజెన్ ఉత్పత్తికీ సాయపడుతుంది. మన చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించడానికి.. క్యారెట్‌లోని విటమిన్ సీ, యాంటీఆక్సిడెంట్లు సహాయపడతాయి. ఇది దెబ్బతిన్న చర్మ కణాలను రిపేర్ చేయడంలోనూ తోడ్పడుతుంది.

**క్యారెట్ పాలు ప్యాక్..** క్యారట్- 1, పచ్చిపాలు- 1 టేబుల్ స్పూన్, తేనె- 1 టేబుల్ స్పూన్, క్యారట్‌ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి ఉడికించుకోవాలి. అవి చల్లారక పేస్ట్‌లా చేయాలి. దీనిలో పచ్చిపాలు, తేనె వేసి.. కలిపాలి. దీన్ని ముఖానికి ప్యాక్‌లా వేసుకుని అరిన తర్వాత శుభ్రం చేసుకోండి. ఇలా చేయడం వల్ల ముఖ చర్మానికి తేమ అందడంతో పాటు, పాలు చర్మంలో పేరుకుపోయిన మురికిని తొలగించి మచ్చలు లేకుండా చేస్తాయి.

**క్యారెట్, నిమ్మ..** క్యారట్‌ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి ఉడికించుకోవాలి. అవి చల్లారక పేస్ట్‌లా చేయాలి. దానిలో ఒక టీస్పూన్ తేనె, సగం నిమ్మచెక్క రసం కలిపి పేస్ట్‌లా చేయండి. ఈ పేస్ట్‌ను మీ ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయండి. ఆరిన తర్వాత.. శుభ్రం చేసుకుని, మాయిశ్చరైజర్ అప్లై చేయండి.

**క్యారెట్, అరటిపండు..** రెండు టీ స్పూన్ల క్యారెట్ రసంలో, కొంచెం అరటి పండు గుజ్జు, గుడ్డులోని తెల్లసొన, నాలుగు చుక్కల నిమ్మరసం వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖంపై రాసుకుని 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగితే ముఖం మీద మడతలు మాయమవుతాయి.





గమనిక: ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

# అవని

## కరివేపాకు చెక్కలు



**కావలసిన పదార్థాలు....** గోధుమపిండి: ఒక కప్పు, తరిగిన కరివేపాకు: అర కప్పు, కారం: రెండు టీస్పూన్లు, పసుపు: పావు టీస్పూన్, ధనియాల పొడి: అర టీస్పూన్, ఉప్పు: సరిపడినంత, నూనె: వేయించడానికి సరిపడా.

**తయారీ విధానం...** ఒక గిన్నెలో గోధుమపిండి, ఉప్పు, కారం, ధనియాల పొడి, పసుపు, ఒక టేబుల్ స్పూన్ గోరువెచ్చని నూనె, తరిగిన కరివేపాకు వేసి బాగా కలపాలి. కొద్దికొద్దిగా నీళ్లు చల్లి కాస్త గట్టిగా ముద్ద చేసుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోసి వేడి చెయ్యాలి. పిండి ముద్దను చపాతీలా ఒత్తి చాకుతో కావాల్సిన పరిమాణంలో ముక్కలు చేసి పెట్టుకోవాలి. వీటిని కాగిన నూనెలో దోరగా కాల్చుకుంటే కరకరలాడే కరివేపాకు చెక్కలు సిద్ధం.

## హెల్దీ కిచిడీ



మనదేశంలో ప్రధాన ఆహారం అన్నమే! మనం తినే అన్నంలో కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా ఉంటాయన్న సంగతి అందరికి తెలిసిందే. వాటితో పాటు తగినంత ఫైబర్, ప్రొటీన్ కూడా తీసుకోవడం అవసరం. అప్పుడే మనం సంపూర్ణ ఆహారాన్ని తిన్నట్టు అవుతుంది. దీనికోసం సోల్ ఫుడ్‌గా పిలుచుకునే కిచిడీని సరైన ఆహారంగా చెప్పుకోవచ్చు. అన్నంతో తయారు చేసుకునే కిచిడీలో 40 గ్రాముల ప్రొటీన్, 30 గ్రాముల ఫైబర్ మనకు లభిస్తుంది. కిచిడీలో వేసుకునే కాయగూరలు మంచి ఫైబర్‌ను అందిస్తాయి. ఇది పెద్దపేగులో లోతైన కిణ్వ ప్రక్రియకు సాయపడుతుంది. గట్ బ్యాక్టీరియాకు మేలు చేసే పదార్థాలను కిచిడీకి జోడిస్తే మరింత మేలు పొందవచ్చు. పాలకూర, అల్లం, వెల్లుల్లి కూడా ఉపయోగిస్తే మంచిది. ఇవి పాలీఫెనాల్స్, బయోయాక్టివ్ కాంపౌండ్‌లతో నిండి గట్ బ్యాక్టీరియా ఆరోగ్యానికి సాయపడతాయి. కిచిడీలో నెయ్యి వేయడం వల్ల కొవ్వులో కరిగే విటమిన్లను గ్రహించడానికి వీలవుతుంది. మొత్తంగా రుచికరమైన కిచిడీ ఆరోగ్యకరమైనది కూడా!

## రోజూ నెయ్యి తింటే బరువు పెరుగుతారా.. ఎంతవరకు నిజం..?

నెయ్యి అనేక పోషక విలువలు కలిగిన పదార్థం. కానీ, నెయ్యిలో కొవ్వు ఉంటుందని, దీన్ని ఆహారంగా తీసుకోవడంవల్ల బరువు పెరుగుతారని చెబుతుంటారు. దాంతో చాలామంది ఊబకాయం వస్తుందనే భయంతో నెయ్యి మానేస్తున్నారు. నిజంగానే నెయ్యి తినడంవల్ల బరువు పెరుగుతారా..? అందుకు శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయా..? అంటే లేవని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. అదంతా వట్టి అపోహేనని కొట్టిపారేస్తున్నారు. అయితే, అతిగా కాకుండా రోజూ మితంగా నెయ్యి తీసుకోవడంవల్ల బరువు తగ్గవచ్చంటున్నారు. రోజుకు 1 నుంచి 2 టీ స్పూన్లకు మించకుండా నెయ్యి తీసుకుంటే బరువు తగ్గే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

**శక్తిని ఉత్పత్తి చేసే పవర్ హౌస్..** రోజువారీ ఆహారంలో నెయ్యిని చేర్చుకోవడం ద్వారా రోజంతా చురుకుగా, శక్తి వంతంగా ఉండవచ్చు. నెయ్యి శక్తిని ఉత్పత్తిచేసే ఒక పవర్ హౌస్ లాంటిది. అందుకే మహిళలకు గర్భధారణ సమయంలో నెయ్యి తినాల్సిందిగా సూచిస్తారు.

**చర్మానికి నిగారింపు..**

నెయ్యిలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి చర్మం లోని మాయిశ్చరైజర్‌ను లాక్ చేయడం ద్వారా ఇది చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ముఖంలో నిగారింపు, ఆరోగ్యకరమైన చర్మం పొందాలంటే ఆహారంలో రోజూ నెయ్యిని కలుపుకోవాల్సిందే.



**పీరియడ్స్ సమస్యకు చెక్...** శరీరంలోని హార్మోన్లను బ్యాలెన్స్ చేయడంలో నెయ్యి సహాయపడుతుంది. పీరియడ్స్ రెగ్యులర్‌గా రాక బాధపడే మహిళలు ఆహారంలో నెయ్యిని చేర్చుకోవడం ద్వారా సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.

**ఎముకలకు బలం...** నెయ్యిలో విటమిన్ పుష్కలంగా ఉంటుంది. అది కాల్షియం శోషణలో సహాయపడుతుంది. తద్వారా దంత క్షయాన్ని నివారించడానికి, అథెరోస్క్లెరోసిస్ రాకుండా ఎముకలను బలంగా ఉంచడానికి తోడ్పడుతుంది.

# మార్కెట్

## ఆధార్ అప్‌డేట్ చేసుకునే వాళ్లకు పెరిగిన సర్వీస్ ఛార్జెస్



నేటి సమాజంలో ఆధార్ కార్డు వినియోగం ఎంత కీలకంగా మారిందో ప్రతి ఒక్కరికీ తెలుసు. సిమ్ కార్డు కొనుగోలు మొదలు బ్యాంకు ఖాతాలు తెరవడం, వాహనాలు, ఇండ్లు, భూముల క్రయ విక్రయాలు.. ప్రభుత్వ పథకాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్ వంటి వాటికి అధార్ తప్పనిసరి అయ్యింది. అయితే.. వయసు పెరుగుతున్న కొద్దీ వ్యక్తుల ముఖాల్లో తేడాలు వస్తుండడం సర్వసాధారణం. దీంతోపాటు ఇంటి చిరునామాలు మారుతుండడంతో అటు అధికారులు, ఇటు ఆధార్ కార్డుదారులు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మనం ఎప్పటికప్పుడు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్‌లో మార్పులు, చేర్పులకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఎప్పటికప్పుడు అవకాశం కల్పిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆధార్ అప్‌డేట్ సర్వీసు ఛార్జీలను ఉడాయ్ తాజాగా సవరించింది. పెరిగిన ఛార్జీలు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఇవి సెప్టెంబర్ 30, 2028 వరకు చెల్లుబాటు అవుతాయి. సర్వీసును బట్టి ఛార్జెస్‌లో మార్పులు ఉంటాయి. ఉడాయ్ సవరించిన ఆ సర్వీసు ఛార్జీలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

డెమోగ్రాఫిక్ అప్‌డేట్స్.. పేరు, చిరునామా, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్ లేదా ఇమెయిల్ వివరాల అప్‌డేట్‌కు రూ. 75 ఖర్చవుతుంది. గతంలో ఇది రూ. 50గా ఉండేది.

బయోమెట్రిక్ అప్‌డేట్.. ఫింగర్ ప్రింట్, ఐరిస్, ఫోటో వంటివి అప్‌డేట్ చేసుకోవాలంటే ఇకపై రూ.125 చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ ఇది రూ.100గా ఉండేది. ఇది 2028 అక్టోబర్ 1 తర్వాత రూ.150కి పెరగనుంది.

మై ఆధార్ పోర్టల్ ద్వారా డాక్యుమెంట్ అప్‌డేట్ జూన్ 14, 2026 వరకు ఉచితంగా చేసుకోవచ్చు. అదే నమోదు కేంద్రాల్లో అయితే రూ.75 ఖర్చవుతుంది. గతంలో ఇది రూ.50 గా ఉండేది. అలాగే ఆధార్ ప్రింటవుట్ పొందడానికి రూ. 40 ఖర్చవుతుంది.

5 నుంచి 7 ఏళ్ల పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్‌ను ఉచితంగా చేసుకోవచ్చు. ఆ పైన 15 నుంచి 17 ఏళ్ల పిల్లలకు ఒకసారి ఫ్రీ. 7 నుంచి15 సంవత్సరాల వయస్సు పిల్లలకు సాధారణంగా రూ. 125 వసూలు చేస్తారు. కానీ, ఈ ఛార్జీని సెప్టెంబర్ 30, 2026 వరకు మాఫీ చేశారు.

హోమ్ సర్వీస్.. ఆధార్ సెంటర్లకు వెళ్లలేని వారు ఇంటి వద్దే ఆ సేవలు పొందొచ్చు. అయితే, హోమ్ సర్వీస్‌కు రూ. 700 చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఛార్జీ కేవలం ఇంటికొచ్చి సర్వీస్ అందిస్తున్నందుకు మాత్రమే. డెమోగ్రాఫిక్, బయోమెట్రిక్ అప్‌డేట్స్‌కు సెపరేట్‌గా ఛార్జెస్ ఉంటాయి.

## చరిత్ర సృష్టించిన ఎలాన్ మస్క్

### 500 బిలియన్ డాలర్ల సంపద కలిగిన తొలి వ్యక్తిగా ఘనత..!

టెస్లా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎలాన్ మస్క్ చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో 500 బిలియన్ డాలర్ల నికర విలువ కలిగిన మొదటి వ్యక్తిగా నిలిచారు. టెస్లా షేర్లలో పెరుగుదల, ఇతర టెక్ కంపెనీల విలువల పెరుగుతున్న వేగంగా కారణంగా ఆయన ఈ ఘనతను సాధించాడు. ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా ప్రకారం.. బుధవారం సాయంత్రం 4.15 నాటికి మస్క్ సంపద 500.1 బిలియన్లకు చేరింది. మస్క్ సంపదలో ఎక్కువ భాగం టెస్లాదే. సెప్టెంబర్ 15 నాటికి టెస్లా షేర్లలో 12.4 శాతానికి పైగా వాటా మస్క్‌కి ఉన్నది. ఈ సంవత్సరం ఇప్పటివరకు టెస్లా షేర్లు 14 శాతానికిపైగా పెరిగాయి. బుధవారం మరో 3.3 శాతం పెరగడంతో ఒకేరోజు మస్క్ సంపదకు 6 బిలియన్లకుపైగా వృద్ధి చెందింది. వాస్తవానికి ఈ ఏడాది ప్రారంభంలో టెస్లా షేర్లు దారుణంగా పడిపోయాయి. కానీ, ప్రస్తుతం పుంజుకుంటున్నాయి. మస్క్ వ్యాపారంపై మళ్లీ దృష్టి పెట్టడం ప్రారంభించడంతో పెట్టుబడిదారుల విశ్వాసం మరింత పెరిగింది. టెస్లా డైరెక్టర్ల బోర్డు చైర్మన్ రాబిన్ డెన్‌హోమ్ గత నెలలో మస్క్ ఇప్పుడు కంపెనీ వ్యవహారాల్లో చురుగ్గా ఉన్నట్లు తెలిపారు. కొన్ని నెలలు వైట్ హౌస్ సంబంధిత పనుల్లో బిజీగా గడిపిన విషయం తెలిసిందే. మస్క్ దాదాపు బిలియన్ డాలర్ల విలువైన టెస్లా షేర్లను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇది టెస్లా భవిష్యత్తుపై బలమైన విశ్వాసాన్ని చూపించింది. కంపెనీ సాంప్రదాయ కార్ల తయారీదారుని దాటి ముందుకు సాగడానికి ఏఐ, రోబోటిక్స్ ప్రపంచంలో ప్రధాన శక్తిగా మారడానికి కృషి



చేస్తోంది. ఫోర్బ్స్ లెక్కల ప్రకారం రెండో బిలియనీర్‌గా ఒరాకిల్ కోఫౌండర్ లార్రీ ఎలిసన్ నిలిచారు. ఆయన నికర విలువ 351.5 బిలియన్ డాలర్లు.


## రష్యా నిషేధంతో పెరిగిన భారత ఇంధన ఎగుమతులు..!




రష్యా రిఫైనరీలపై దాడులు తీవ్రం కావడంతో ప్రపంచ ఇంధన మార్కెట్‌లో తీవ్ర ఇబ్బందులు మొదలయ్యాయి. దీంతో ఆ కొరతను భర్తీ చేయడానికి భారత్ తన ఇంధన ఉత్పత్తుల ఎగుమతులను వేగవంతం చేసింది. ప్రైవేటు రంగంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ సంస్థలు బ్రెజిల్, తుర్కియే, యూఏఈ, పలు ఆఫ్రికా దేశాలకు భారీగా ఎగుమతి చేస్తున్నాయి. ఇప్పటి వరకు ఆయా దేశాలు రష్యాలో శుద్ధి చేసిన ఇంధనంపై ఇన్నాళ్లూ ఆధారపడ్డాయని ఎకనామిక్ టైమ్స్ కథనంలో పేర్కొంది. చమురు శుద్ధి సామర్థ్యం దెబ్బతినడంతో రష్యా దేశీయ అవసరాలపైనే ఎక్కువ దృష్టి సారించింది. శీతాకాలం సమీపిస్తుండటంతో.. రష్యాలో చమురు అవసరాలు భారీగా పెరగనున్నాయి. దీంతో సెప్టెంబర్ నెలలో రోజుకు రెండు లక్షల బ్యారెళ్ల ఇంధన ఎగుమతులను తగ్గించిందని క్లెప్లర్ నివేదికలో వెల్లడించింది. రిఫైనరీలు దెబ్బతినడం, పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై నిషేధం వంటివి ప్రభావం చూపాయని ఆ సంస్థ నిపుణులు వెల్లడించారు. భారత్ నుంచి బ్రెజిల్‌కు శుద్ధి చేసిన ఇంధన ఎగుమతులు పెరిగి రోజుకు 97 వేల బ్యారెళ్లకు చేరాయి. ఆగస్టులో ఇవి కేవలం 40వేల బ్యారెళ్లు మాత్రమే ఉన్నాయి. ఇక మన దేశం నుంచి తుర్కియేకు కూడా ఎగుమతులు అంతకు ముందు నెలతో పోలిస్తే 20 బ్యారెళ్ల నుంచి 56 వేల బ్యారెళ్లకు చేరాయి. గతేడాది అసలు మన దేశం నుంచి తుర్కియేకు చమురు ఎగుమతి చేయలేదు. పై రెండు దేశాలకు అధికంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి ఎగుమతులు అవుతున్నాయి. ఇక యూఏఈకి భారత్ నుంచి శుద్ధి చేసిన ఇంధన ఎగుమతి పెరిగింది. ఆగస్టులో 1.4లక్షల బ్యారెళ్లు కొనుగోలు చేయగా.. సెప్టెంబర్‌లో 2.01 లక్షల బ్యారెళ్లకు చేరడం గమనార్హం. మొత్తంగా భారత్ నుంచి శుద్ధి చేసిన ఇంధన ఎగుమతులు గత నెల ఏకంగా 14శాతం పెరిగి రోజుకు 1.59 మిలియన్ పీపాలుగా నమోదయ్యాయి.

## ఆఖర్లో కొనుగోళ్లు.. లాభాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీలు.. ఆఖరి గంటలో కొనుగోళ్ల మద్దతుతో వరుసగా రెండో ట్రేడింగ్ సెషన్‌లోనూ రాణించా యి. అంతర్జాతీయ మార్కెట్‌ల సానుకూల ధోరణి, తాజా ఎంపీసీ భేటీలో వడ్డీ రేట్లు స్థిరంగా ఉంచినప్పటికీ.. మున్ముందు తగ్గిస్తామని ఆర్‌బీఐ సంకేతాలు ఇవ్వడం కలిసొచ్చింది. దీంతో నిఫ్టీ మరోసారి 24,900 స్థాయికి చేరువైంది. సెన్సెక్స్ ఉదయం 80,684.14 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,983.31) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,649.57- 81,251.99 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 223.86 పాయింట్ల లాభంతో 81,207.17 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 57.95 పాయింట్ల లాభంతో 24,894.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.79గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎల్అండ్‌టీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, అల్ట్రాటెక్ సిమెంట్, సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.49 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 3,863.37 వద్ద ట్రేడవుతోంది.



## బయటి షాక్‌లను తట్టుకోవడంలో భారత్ సామర్థ్యం బలమైనది

### ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



ప్రపంచ ఆర్థికవ్యవస్థ నిర్మాణాత్మక మార్పును చూస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇలాంటి తరుణంలో బయటి నుంచి ఆక స్మికంగా తగిలే షాక్‌లను తట్టుకోవడంతో భారత్ సామర్థ్యం బలంగా ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్-2025లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలాసీతారామన్ మాట్లాడుతూ.. ఆర్థిక, ఇంధన అసమతుల్యతను ఎదుర్కోవడం కూడా దేశాల ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. భౌగోళిక రాజకీయ సంఘర్షణలు తీవ్రమవుతున్నాయని, ఆంక్షలు, సుంకాలు, విభేదాలు ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. ఇవి భారత్‌కు కూడా దెబ్బేనని, వీటన్నింటినీ బలంగా ఎదుర్కొనే సామర్థ్యం భారత్‌కు ఉందని అన్నారు. దేశ ఆర్థిక పరపతి కూడా అభివృద్ధి చెందుతోందని నిర్మలాసీతారామన్ చెప్పారు. యుద్ధాలు, వ్యూహాత్మక పోటీలు, సంఘర్షణ సరిహద్దులను తిరగ రాస్తున్నాయని అన్నారు. గతంలో బలంగా ఉన్న సంబంధాలు ఇప్పుడు పరీక్షలు ఎదుర్కొంటున్నాయి, కొత్త సంకీర్ణాలు ఉద్భవిస్తున్నాయని చెప్పారు. అయితే భారత ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉందని, స్థిరంగా వృద్ధి చెందుతూనే ఉందని తెలిపారు. యాదృచ్ఛికంగా భారత్ ఈ స్థాయికి రాలేదని, అనేక శక్తిమంతమైన సంస్కరణల ద్వారా వచ్చిందని చెప్పారు.

## టీసీఎస్‌లో లేఆఫ్‌లు.. వారికి 2 ఏళ్ల జీతం!




ప్రఖ్యాత ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లేఆఫ్‌ల ప్రక్రియను ప్రారంభిం చింది. ప్రస్తుత ఆటోమేషన్ యుగంలో కంపెనీ అవసరాలను తీర్చలేని ఉద్యోగులను ఇంటికి పంపిస్తోంది. అయితే, దీర్ఘకాలం కంపెనీతో అనుబంధం కలిగిన ఉద్యోగులకు మాత్రం దాదాపు రెండేళ్ల వేతనం పరిహారంగా చెల్లించనుంది. ఈ ఏడాది జులైలో ప్రకటించిన 12 వేల మందికి లేఆఫ్‌ల ప్రకటనలో భాగంగా ఈ ప్రక్రియను చేపట్టింది. క్లయింట్ అవసరాలు తీర్చలేని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను లేని ఉద్యోగులను టీసీఎస్ తొలగిస్తోంది. ఇందులో భాగంగా మూడు నెలల నోటీసు పీరియడ్ ఇస్తోంది. అంటే ఆ మూడు నెలలకు కంపెనీ వేతనంగా చెల్లిస్తుంది. దీనికి అదనంగా ఆరు నెలల నుంచి 2 ఏళ్ల వరకు వేతనాన్ని పరిహార ప్యాకేజీ కింద చెల్లించనుంది. అయితే, ఎవరైతే 8 నెలలకు మించి బెంచ్ పై ఉంటారో వారికి 'సింప్లర్ ప్యాకేజీ' మాత్రమే చెల్లిస్తారు. అంటే నోటీసు పీరియడ్ వేతనాన్ని మాత్రమే చెల్లిస్తారు.

# సంపాదకీయం

## రాహుల్ అజ్ఞానానికి పరాకాష్ట !

విదేశాలకు వెళ్లడం..అక్కడ భారత్ పాలకులపై దుమ్మెత్తి పోయడం,ప్రజాస్వామ్యం అపహాస్యం అవు తోందని గగ్గోలు పెట్టడం కాంగ్రెస్ ఎంపి, విపక్షనేత రాహుల్ గాంధీకి బాగా అలవాటయిన కార్యక్రమం. విదేశీ గడ్డపై నుంచి దేశంపై దుమ్మెత్తి పోయడం అలవాటు చేసుకున్న నేతగా బహుళ ప్రచారం పొందు తున్నారు. విదేశీయతను పుణికి పుచ్చుకున్న అపరమేధావిగా నిరూపించుకుంటున్నారు. బిజెపిని విమర్శించినప్పుడల్లా ఆర్ఎస్ఎస్ భావజాలం అంటూ విమర్శలు చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలం గురించి తెలిసి ఉంటే రాహుల్ ఇలా మాట్లాడరు. ఇకపోతే తమ పాలనలోనే భారతదేశం బాగా పరిఢ విల్లిందని, ఇతరుల అంటే బిజెపి పాలనలో దేశం సర్వనాశనం అవుతోందని, ఆర్ఎస్ఎస్, బిజెపిలు కలిసి దేశాన్ని నాశనం చేస్తున్నాయని ఆయన చేస్తున్న విమర్శలు అజ్ఞానానికి పరాకాష్టగా చూడాలి. నిజానికి ఈ దేశంలో రాహుల్‌కు ఉన్న అర్హత ఏమిటి. కేవలం రాజీవ్ గాంధీ తనయుడుగానే ఆయనకు స్థానం ఉంది. అంతకు మించిన రాజకీయ ప్రస్థానం ఆయనకు లేదు. వారసత్వ రాజకీయాల్లో పార్టీ అధ్యక్షుడిగా, ఎంపిగా వెలగబెడుతున్న రాహుల్ భారత్ ఔన్నత్యం, గొప్పతనం గురించి తెలియని అజ్ఞానిగా భావించాలి. అధికారం కల్ల అని తెలుసుకోవడంతో ఏదేదో మాట్లాడుతున్నారు. అడ్డగోలు విమర్శలు చేస్తున్నారు. బంగ్లాదేశ్, నేపాల్ లాంటి ఆందోళనలు మనదేశంలోనూ రావాలని కోరుకుంటున్నారా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. వసుధైక కుటుంబ, సర్వేజనా సుఖినో భవంతు అన్న ఆర్యోక్తి మన మట్టిలో పుట్టిన అత్యున్నత మానవాతా వాద విలువలకు అద్దంపట్టేవి.. కానీ ఇవేవీ తెలియకుంటా ఏదోఒక చిన్న దేశానికి వెళ్లడం అక్కడ భారత్‌లో పాలన సరిగా లేదని, ఇక్కడ ప్రజాస్వామ్యం భ్రష్టుపట్టి పోతోందని గొంతు చించుకుంటున్నారు. ఈ దేశంలో ప్రజలు ఎంతో ఉన్నతంగా ఆలోచించి కాంగ్రెస్‌ను ఆదరించారు. అది ఎన్ని దేశద్రోహ పనులు చేసినా వెనకేసు కొచ్చారు. ఎమర్జెన్సీతో భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. అలాంటి పార్టీలో ఉంటూ ప్రజా స్వామ్యం గురించి, ఓట్ చోరీ గురించి గొంతు చించుకుంటున్నారు. అంతకు మించి ఆర్ఎస్ఎస్ గురించి అవాకులు చవాకులు పేలుతన్నారు. నిజానికి రాహుల్ భారతీయత కలిగిన నేత అయితే ఆర్ఎస్ఎస్ గరించి తెలుసుకుని ఉండేవారు. ఈదేశం కోసం, దేశ పటిష్టత కోసం, దేశం సర్వతో ముఖోన్నతి కోసం అహరహరం శ్రమిస్తున్న ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్. దాని గురించి తక్కువ మాట్లాడే వారు చరిత్ర హీనులు కాకతప్పదు. హిందూ సంస్కృతి నశిస్తే హిందూ సమాజమే ఉండదు. ప్రపంచానికి నాగరిక తను నేర్పిన దేశం కేవలం హిందూమతం, భారతదేశం మాత్రమే. ఎన్నోదాడులను, మత దురాచారా లను, మతమార్పిడులను తట్టుకుని కూడా భారత్ ఇవాళ ప్రపంచానికి వెలుగుదివిటీగా సాగుతోంది. ఆర్ఎస్ఎస్ శతవసంతాల వేళ విదేశీ గడ్డపై నుంచి ఆర్ఎస్ఎస్ గురించి చేసిన ప్రేలాపనలు ఎంతమాత్రం సహించ రానివి. ఎన్నో దాడులు, బలిదానాలు, మతమార్పిళ్ల నేపథ్యంలో హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం ప్రతి హిందువు కర్తవ్యం అంటూ డాక్టర్ కేశవ బలిరాం హెడ్గేవార్ వంద సంవత్సరాల క్రితం స్థాపించిన 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్' నేడు భారతదేశ చరిత్రను పునర్లిఖించే క్రమంలో ఉన్నది. 1925 విజయదశమి రోజున నాగపూర్‌లో హెడ్గేవార్ స్థాపించిన ఈ సంస్థ దినదిన ప్రవర్ధమానమై దేశ ఐక్యతకు, ప్రపంచ శాంతికి పాటుపడుతోంది. 'నమస్తే సదా వత్సలే మాతృ భూమే' ఇది ఆ సంఘ్ ప్రాణగీతం. తల్లి భరతమాతను ఈ ప్రపంచానికే విశ్వగురువుగా నిలబెట్టాలన్నది ఆరెస్సెస్ ఏకైక లక్ష్యం. అందుకోసం ప్రతి భారతీయుడినీ, ముఖ్యంగా యువతను దేశ నిర్మాణంలో పాలు పంచుకునేలా చేయాలన్నదే తపనతో పనిచేస్తున్న ఏకైక సంస్థ అనడంలో ఎలాంటి అనుమానాలు లేవు. స్వాతంత్ర్య పోరాటంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాలుపంచుకోలేదనేది చరిత్ర తెలియని దేశ వ్యతిరేకుల ఆరోపణ. స్వాతంత్ర్యం కోసమే దేశ భక్తులను సంఘ్ తయారు చేసింది. హెడ్గేవార్ 1921, 1931లో జైలు నిర్బంధానికి గురయ్యారు. వార్ధాలో హెడ్గేవార్‌ను కలుసుకున్న గాంధీజీ సంఘ్ క్రమశిక్షణను ప్రశంసించిన విషయం తెలుసుకుంటే మంచింది. దేశం పెను ప్రమాదాలు, విపత్తులు ఎదుర్కొన్నప్పుడు స్వయం సేవకులు తమ ప్రాణాలు కూడా లెక్క చేయకుండా ప్రజలకు సేవలందిస్తోంది. పాక్, చైనాలతో భారత్ యుద్ధం చేసిన సమయంలో భారత సైన్యానికి అండగా నిలబడ్డ సంస్థ కూడా ఆర్ఎస్ఎస్ అని రాహుల్ తెలుసుకుంటే మంచిది. దేశ విభజన, పంజాబ్, బెంగాల్ ప్రాంతాల్లోని హింస, దోపిడీ, అత్యాచారాలను నిలువరించడం, వలస వచ్చిన శరణార్థు లకు శిబిరాల ఏర్పాటు, కరువు సమయం లో నిత్యావసర వస్తువులను అందించడం వంటి చర్యల ద్వారా సంఘ్ చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. 1977 నాటి దివిసీమ ఉప్పెనకు బలైన 20వేల మంది మృతదేహాల ను, పశువుల కళేబరాలనూ ఖననం చేసిన ఘనత సంఘ కరసేవకులదే. 1975 నాటి ఎమర్జెన్సీ సమయం లో జైలుకు వెళ్లిన వారిలో అనేకులు స్వయం సేవకులు ఉన్నారు. అవివేకంతో కూడిన అభ్యాసం కంటే జ్ఞానం మేలు. జ్ఞానం కంటే ధ్యానం ఉత్తమం. ధ్యానం కంటే కర్మఫల త్యాగం మంచిది. ఆ త్యాగం వల్ల మనశ్శాంతి కలుగుతుంది.' అని భగవద్గీత శ్లోకం భావం. ప్రపంచవ్యాప్తంగా వివిధ ఆశయాలతో కూడిన అనేక సంస్థలు ఉన్నాయి. అయితే వందేళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ త్యాగాలకు సాటిరాగల మరో సంస్థ లేదనే చెప్పాలి. ఎందుకంటే ఆయా సంస్థలకు స్వలాభాపేక్ష ఉంది. కానీ ఆర్ఎస్ఎస్‌కు మాత్రం దేశ హితమే స్వార్థంగా ఉంది. వేల సంవత్సరాల భారతీయ సామాజిక విలువలే ఆలంబనగా, సామాజిక జీవనంలో ఏర్పడిన లోటుపాట్లను అధిగమిస్తూ, జీవన విధానంలో దృఢత్వం, సమాజం కోసం అంకితమైన వ్యక్తిత్వం తో ఓ విలక్షణమైన కార్యదీక్ష కలిగిన క్రమశిక్షణాయుత సమూహం ఆరెస్సెస్ సొంతం. అందుకే, కాలగమ నంలో అవరోధాలను, అణచివేతలను అధిగమిస్తూ... ప్రతికూల పరిస్థితుల్లో సైతం తన ప్రాబల్యాన్ని విస్తరిస్తూ, భారతీయ సంస్కృతిలోని సనాతన మూలాల నుంచి జాతీయవాద భావనతో ఆవిర్భవించి, మానవతా వాదాన్ని ఆవిష్కరిస్తోంది. దేశభక్తి అంటే జెండా ఎగరేయడం, దేశభక్తి గీతాలు పాడడం, ఐక్యత ప్రతిజ్ఞ చేయడం కాదని, ఈ స్ఫూర్తి మన ప్రవర్తనలో ప్రతిబింబించి, సమాజంలో పరివర్తనకు బీజాలు వేయాలన్నది ఆరెస్సెస్ లక్ష్యం. సమాజంలో అన్ని వర్గాల ప్రజలతో అరమరికలు లేకుండా కలిసి పనిచేసే అలవాట్లను ఆర్ఎసెస్ నేతలు ప్రేరేపించారు. ఈ స్ఫూర్తి కారణంగానే వందలాది సంఘ్ ప్రేరేపిత సంస్థలు భారతదేశ మంతటా పనిచేస్తున్నా ఎక్కడా అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు చెలరేగడం కనిపించదు. పైగా, వాటి పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా కనిపిస్తుంది. కులం, వర్గం, మతం, ప్రాంతాలకు అతీతంగా ప్రజలు సమైక్యంగా ఉండాలని మాటలు చెప్పడం కాకుండా, ఆచరణలో ఆ విధంగా జీవించే వాతావరణం ఏర్పాటు చేయడంలో ఆరెస్సెస్‌ను మించిన మరో సంస్థ లేదని చెప్పవచ్చు. అందుకే రాజకీయాల పరిధిని మించి చూడలేని రాహుల్ లాంటి వారికి ఆరెస్సెస్ కార్యపద్ధతి అర్థం కాదు. దేశ ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని చూస్తేనే ఈ సంస్థ సిద్దాంతం అవగతమవుతుంది. ఆవిర్భావం నుంచి రాజకీయ అధికారం కోసం కాకుండా 'వ్యక్తి నిర్మాణం' కేంద్రంగా, ప్రజలందరి శ్రేయస్సు కోసం ఆరెస్సెస్ పనిచేస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు సహాయం చేయడానికి, సహాయ కార్యక్రమాలను నిర్వహించడానికి, పేద పిల్లలకు విద్య, వైద్య సదుపాయాలు అందించడానికి, వృద్ధులకు సేవ చేయడానికి స్వయం సేవక్‌లు అందించే సేవలలో వివక్ష మచ్చుకైనా కనిపించదు. ఇంతటి ఉదాత్త ఆశయంతో పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్ పట్ల ఏహ్య భావంతో రాహుల్ నోరు పారేసుకుంటున్నారు. బిజెపితో కలిసి అని నిందిస్తున్నారు. ఇలాంటి నిందలతో అధికారంలోకి రావాలనుకోవడం కాంగ్రెస్‌కు అసాధ్యం అని తెలుసుకోవాలి.

# విదేశీ విద్యార్థులపై ట్రంప్ కొరడా

◆ పరిమిత సంఖ్యలోనే విద్యార్థులకు అడ్మిషన్లు ◆ యూనివర్సిటీలకు హుకూం జారీచేసిన వైట్‌హౌజ్



వాషింగ్టన్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో హుకూం జారీచేశారు. విదేశీ విద్యార్థుల రాకపై ఆంక్షలు లాంటి కత్తి పెట్టారు. పరిమిత సంఖ్యలోనే వారిని అనుమతించాలని యూనివర్సిటీలను ఆదేశించారు. అమెరికా ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యార్థుల అడ్మిషన్లను పరిమితం చేయాలని వైట్ హౌజ్ విశ్వవిద్యాలయాలకు తేల్చిచెప్పింది. ఈమేరకు ప్రతిపాదించిన నిబంధనలను మెమో రూపంలో దేశంలోని ప్రధాన యూనివర్శిటీలకు పంపింది. ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి, జాతి, లింగ ఆధారిత నియామకాలు నిలిపివేయడం, విద్యార్థుల అడ్మిషన్ సమయంలో కచ్చితంగా ప్రామాణిక పరీక్ష నిర్వహించడం వంటివి చేపడితేనే ప్రభుత్వ నిధుల కేటాయింపులో ప్రాధాన్యం లభిస్తుందని వెల్లడించింది. ఈ నిబంధనలను అంగీకరించిన విశ్వవిద్యాలయాలు ప్రభుత్వం నుంచి వచ్చే లబ్దిని పొందవచ్చని ఆ లేఖలో వెల్లడించారు. వీటిల్లో విద్యార్థులకు ప్రభుత్వ రుణాలు, గ్రాంట్లు, కాంట్రాక్టులు, రీసెర్చి నిధులు, విదేశీ స్కాలర్స్‌కు వీసా అనుమతులు, ట్యాక్స్ కోడ్‌లో ప్రాధాన్యం వంటివి పొందవచ్చని పేర్కొంది. అమెరికాలో ఉన్నతవిద్యను పునర్ వ్యవస్థీకరించి తమ భావజాలానికి అనుకూలం గా మార్చుకోవడానికి ట్రంప్ కార్యవర్గం చేస్తున్న మరో యత్నంగా దీనిని భావిస్తున్నారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం ప్రభుత్వంతో 500 మిలియన్ డాలర్ల డీల్ చాలా దగ్గరగా ఉందని పేర్కొన్నారు. వైట్‌హౌస్ నుంచి లేఖలు అందుకొన్న వాటిలో అమెరికాలోని ఎంఐటీ సహా ప్రముఖ విశ్వవిద్యాలయాలు మొత్తం ఉన్నాయి. ఈ క్రమంలో విదేశీ వీసాలపై వచ్చే విద్యార్థుల సంఖ్య 15 శాతానికి మించి ఉండకూడదు. ఒకే దేశం నుంచి వచ్చిన విద్యార్థుల సంఖ్య 5 శాతానికి మించకూడదు. విదేశాల నుంచి అందే నిధుల వివరాలను బహిర్గతం చేయాలి. విద్యార్థుల అడ్మిషన్, ఫైనాన్షియల్ ఎయిడ్ సమయంలో లింగ, జాతి, జాతీయత, రాజకీయ భావజాలం, జెండర్ ఐడెంటిటీ, లైంగిక ఆకర్షణ, మతపరమైన అంశాలు పరిగణనలోకి తీసుకోకూడదు. అండర్ గ్రాడ్యుయేట్ దరఖాస్తుదారులు కచ్చితంగా ప్రామాణిక పరీక్షను పూర్తిచేయాల్సిందే. విద్యా స్వేచ్ఛను కాపాడే విధానాలు అమలుచేయాలి. సంప్రదాయవాద ఆలోచన సరళిని ఇబ్బందిపెట్టే, దాడులకు పాల్పడే యూనిట్స్‌ను తొలగించడం వంటివి ఉన్నాయి. విద్యాలయాలను ఇబ్బందిపెట్టేలా రాజకీయ ప్రదర్శనలు, విద్యార్థులను లేదా గ్రూపులను వేధించకుండా చర్యలు చేపట్టాలి. ఉద్యోగులు అధికారిక విధుల సమయంలో రాజకీయ ప్రసంగాలు, చర్యలకు దూరంగా ఉండాలి. బాత్‌రూమ్‌లు, లాకర్ రూమ్‌లు లింగ ఆధారంగా వేర్వేరుగా ఉండాలి. హార్డ్‌సైన్స్ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉచిత ట్యూషన్ ఫీజ్, ప్రోత్సాహకం కింద 2 మిలియన్ డాలర్లు మించి ఇవ్వాలని ప్రతిపాదించారు. ఈ నిబంధనలు ఏమేరకు అమలుచేస్తున్నారనే అంశాన్ని జస్టిస్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్స్‌ను సమీక్షించి తెలుసుకొంటుంది. వీటిని ఉల్లంఘిస్తే ప్రభుత్వ లబ్దిని రెండేళ్లపాటు ఆపేస్తారు.

## దేశ ఔన్నత్యం నిలబెడుతున్న మోడీ

- విదేశాల్లో భారత్ పరువు తీస్తున్న రాహుల్
- రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి ఎంపి కంగనా



న్యూఢిల్లీ,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): ప్రజాస్వామ్యంపై జరుగుతోన్న దాడి భారత్‌కు పొంచిఉన్న ముప్పు అని కొలంబియా పర్యటనలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ ఘాటుగా స్పందించింది. ఇతర దేశాల్లో భారత్‌ను అవమానించడమే రాహుల్ పనని..దేశ ప్రజలను నిజాయితీ లేనివారిగా ఆయన చిత్రీకరిస్తున్నారని బాలీవుడ్ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడూ భారత్‌ను విమర్శించే కాంగ్రెస్ నేతను చూసి.. దేశ ప్రజలు అవమానకరంగా భావిస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ విదేశాల్లో దేశ ఖ్యాతిని పెంచుతుంటే..దానిని ఎలా తగ్గించాలా అని రాహుల్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఇటువంట పనులు చేయడం వల్ల ప్రజలకు వారిపై ఉన్న నమ్మకం పోయిందన్నారు. భాజపా నేత ప్రదీప్ భండారీ సైతం రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. భారతదేశాన్ని, దాని పురోగతిని ద్వేషించే వ్యక్తి మాత్రమే విదేశాలకు వెళ్లి దేశాన్ని అవమానిస్తాడని అన్నారు. ఇదే మనస్తత్వంతో గత 70 ఏళ్లుగా కాంగ్రెస్ పాలకులు దేశ అభివృద్ధిని అడ్డుకున్నారని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం చూసి..అసూయతో రాహుల్ ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన ఎప్పటికీ భారత్‌ను వ్యతిరేకించే నేతగానే మిగిలిపోతారన్నారు. ప్రస్తుతం కొలంబియా పర్యటనలో ఉన్న రాహుల్ ఈఐఏ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

## భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి

### కొలింబియా పర్యటనలో రాహుల్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,అక్టోబర్2:** నరేంద్ర మోడీ పాలనలోని భారత్‌లో ప్రజాస్వామ్య దాడులు జరుగుతున్నాయంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. దేశానికి అత్యంత ప్రమాదకరమైనది ఏదైనా ఉందంటే అది దేశంలో ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడేనంటూ మండిపడ్డారు. కొలంబియా పర్యటనలో ఉన్న ఆయన ఈఐఏ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భారత్‌లో ఎన్నో మతాలు, కులాలు, సంప్రదాయాలు ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రతిఒక్కరికీ చోటుకల్పిస్తుంది. కానీ ప్రస్తుతం ఈ వ్యవస్థ ముప్పేటదాడిని ఎదుర్కొంటోందన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. ఇంధన వినియోగంలో వచ్చిన మార్పులతో అనేక సామ్రాజ్యాల సృష్టి జరుగుతూవస్తోంది. బ్రిటిష్‌వారు ఆవిరి యంత్రం, బొగ్గుపై నియంత్రణ సాధించారు. తర్వాత వారు సూపర్‌పవర్‌గా మారారు. ఆ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి 1947లో మేం స్వాతంత్ర్యం సాధించుకున్నాం. పెట్రోల్ వినియోగం పెరిగింది. ఆ క్రమంలో అమెరికన్ల పట్టుపెరిగింది. ప్రపంచం ఇప్పుడు ఎలక్ట్రిక్ మోటార్ వైపు మళ్లుతోంది. ఇప్పుడు పోటీ అమెరికా, చైనా మధ్య నెలకొని ఉంది. ఈ విషయంలో చైనానే ముందుంది. చైనాకు భారత్ పొరుగుదేశం. అమెరికాకు మిత్రదేశం. ఈ రెండు దేశాలు పోటీపడుతుంటే మధ్యలో మేం ఉన్నాం. చైనాకంటే భారత్ జనాభా ఎక్కువ. ఆ దేశంలో కేంద్రీకృత వ్యవస్థ ఉంది. ఇండియాలో వికేంద్రీకృత, వైవిధ్య వ్యవస్థ ఉంది. అది సంక్లిష్టంగా ఉంటుంది. చైనాతో పోల్చుకుంటే భారత్‌కున్న సామర్థ్యాలు భిన్నమైనవి. మా దేశం అధ్యాత్మిక, సైద్ధాంతిక సంప్రదాయాలను కలిగిఉంది. అవి ఈనాటికీ ఆచరణీయమైనవి. చైనాలాగా భారత్ తన ప్రజలను అణచి వేయదని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఆర్థిక వృద్ధి ఉంది. అయితే మాది సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థ. కానీ ఉత్పత్తి భారీ స్థాయిలో లేకపోవడంతో ఉద్యోగాల కల్పన ఆశించినస్థాయిలో లేదు. చైనా అప్రజాస్వామిక వాతావరణంలో ఉత్పత్తి చేస్తోంది. కానీ మాకు ప్రజాస్వామ్య వ్యవస్థే ఉండాలి. అలాంటి వ్యవస్థను అభివృద్ధి చేయడమే సవాలని పేర్కొన్నారు.



## నిష్కామక కర్మ !



**తిరుమల, సెప్టెంబర్26:** యవ్వనంలో ఉంటే ముసలితనం వచ్చేస్తుందని భయపడతాం. ధనవంతులమైతే అనుకోకుండా పేదవాళ్లమై పోతామేమో అని భయపడతాం. ఏ స్థితిలోనూ భయం కలిగించనిది ఒకే ఒక్కటి. అదే వైరాగ్యం. 'నాకు అక్కర్లేదు!' అనుకునే వాడు ఉన్నంత నిర్భయంగా మరెవ్వడూ ఉండడు. 'నాకిది కావాలి!' అనుకుంటే వంద రకాల తాపత్రయాలు పడాల్సిందే. శివుడు మన్మథుని గర్వాన్ని నిర్మూలనం చేశాడు. మనం కూడా శివ భక్తులమై సంసారంలో ఉంటూనే కామవాంఛలను జయించాలి. అది గ్రహిస్తే యాభై ఏళ్లు దాటే సరికి కాస్త నెమ్మదిగా వైరాగ్య మార్గంలో పడతాం. అప్పుడు నిర్భయంగా ఉండగలుగుతాం. జీవితంలో ఏదైనా భయం కలిగించేదే. పాండిత్యం సంపాదిస్తే, అంతకన్నా ఎక్కువ పాండిత్యం ఉన్న వాడు వస్తాడని భయపడతాం. అందంగా ఉంటే ఈ అందం దెబ్బతింటుందేమోనని భయపడతాం. ఆ గర్వాన్ని జయించాలంటే పార్వతీ పరమేశ్వరులిద్దరినీ మనం ఆశ్రయించాలి. నారదుడు మొదలుకుని ముఖ్యమైన మునులందరూ నిరంతరం భగవంతుని ధ్యానంలో గడిపారు. వారి మనః పద్మాలలో శివుడు తుమ్మెదలా విహరిస్తున్నాడు. మనమూ అలా నిరంతరం భగవంతుని ధ్యానంలో గడుపుదాం. మనస్సులో భక్తి తప్ప మరేమీ ఉండకూడదు. 'అంతా నువ్వే!' అని భగవంతుణ్ణి వేడుకోవాలి. దేశం బాగుపడటానికి, జీవితం బాగుపడటానికి ఆధ్యాత్మికతను మించిన మార్గం లేదు. శంకరాచార్యుల నుంచి వివేకానందుల వరకు ఇదే ఆచరించి చూపారు. కావాలను కుంటేనే సమస్యలు వచ్చి పడతాయి. అందువల్ల తాహతుకు మంచి కోరికలను కోరుకుంటే సమస్యలు చుట్టుముడతాయి.

# ఎన్టీపీసీ కార్మిక సంఘం ఎన్నికల్లో బీఎమ్మెస్ ఘన విజయం

- విజేతలను అభినందించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఇటీవలే జరిగిన ఎన్టీపీసీ కార్మిక సంఘం ఎన్నికల్లో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎమ్మెస్) విజయకేతనం ఎగురవేసింది. ఈ విజయాన్ని పురస్కరించుకొని, బీఎమ్మెస్ యూనియన్ నాయకుల బృందం బిజేపి రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి తో కలిసి కరీంనగర్ మహాశక్తి ఆలయంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని మర్యాదపూర్వకంగాకలిసితమఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ యూనియన్ నాయకులకి శుభాకాంక్షలు తెలుపుతూ, "కార్మికుల హక్కుల పరిరక్షణలో, అభివృద్ధి కార్యక్రమాల సాధనలో బీఎమ్మెస్ ముందుండాలి అన్నారు. మీ విజయం కార్మికుల విశ్వాసానికి నిదర్శనం" అని అన్నారు. కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం యూనియన్ నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రధాన కార్యదర్శి సాగర్ రాజు అధ్యక్షులు కేతిరెడ్డి భాస్కర్ రెడ్డి కోశాధికారి చల్లా సత్యనారాయణ రెడ్డి, పొగుల స్వామి,బుర్ర శ్రీనివాస్, శ్రీకాంత్, వేముల రాములు, కందుల సత్తయ్య బిజెపి కార్పొరేటర్ అభ్యర్థి చల్ల శోభా రెడ్డి పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే విజయం సాధించవచ్చు

- గ్రూప్ వన్‌లో డిఎస్పీ ఉద్యోగం సాధించిన లతీఫా ఆశ



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కష్టపడి చదువుతే విజయం వరిస్తుందని గ్రూప్ వన్ లో డీఎస్పీ ఉద్యోగం సాధించిన లతీఫా ఆశ అన్నారు. విజయదశమి నాడు మార్కండేయ కాలనీలోని బస్తీ వాసులు గ్రూప్ వన్ లో డిఎస్పీగా ఉద్యోగం సాధించిన లతీఫా ఆశాను శాలువాతో పూల ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లతీఫా ఆశా మాట్లాడుతూ నేటి యువత కష్టపడి చదివితే విజయం సాధించవచ్చు అని తమ లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యం కోసం విజయం సాధించే వరకు పోరాటం చేయాలని అన్నారు. నేటి యువత సామాజిక మాధ్యమాలను మంచి వాటిపై దృష్టి సాధించాలని, ఓడిపోయామని బాధపడకుండా గెలుపు కొరకు నిరంతరము పోటీపడినప్పుడే విజయము చేకూరుతుందని . అలాగే లతీఫా ఆశ తండ్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి దాదాసాలం మాట్లాడుతూ నా కూతురు గ్రూప్ వన్ లో డిఎస్పీగా ఉద్యోగం సాధించినందుకు చాలా సంతోషంగా ఉందని చిన్న వయసులోనే ఉద్యోగం సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ కాలనీ బస్తీ వాసులు చెరుకుపల్లి రాజిరెడ్డి గీతారెడ్డి, బండారి నరేందర్ మాధవి, బొల్లవేణి మల్లయ్య కేతమ్మ, ఆడెపు రవి సంధ్య,వడ్లూరి శశి కుమార్ సరిత, ఆకుల సంజీవ్ మానస, రాములు మాధవి, రవి షబానా, జెట్టి రాము లక్ష్మి, కోటగిరి శ్రీకాంత్ సరిత, సదయ్యా రజిత, గోపి స్వప్న, రాంబాబు అన్నపూర్ణ, కోటేశ్వర్, వైద్య శ్రీనివాస్, సుధాకర్, మార్కండేయ కాలనీ యువకులు బండారి రేవంత్, జెట్టి శ్రీ వర్షిత్, కోటగిరి శ్రీమాన్, సాయి ప్రణవ్, బండారి నర్మద, తదితరులు పాల్గొన్నారు, అనంతరం గోవర్ధన్ పూజారి విజయ దశమి సందర్భంగా జమ్మి పూజ చేశారు.

## మేడ రాజయ్య సేవలు మరువలేనివి...

- ప్రజా సేవలో ఆదర్శంగా నిలిచిన నాయకుడు
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**రామగిరి, అక్టోబర్ 03(ది క్రైమ్ న్యూస్):-** స్వర్గీయ మాజీ సర్పంచ్ మేడ రాజయ్య సేవలు మరువలేనివని మంథని మాజీఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంథని మండలం గోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ మేడ రాజయ్య వర్ధంతి సందర్భంగా గ్రామంలోని రాజయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ రాజయ్య నిస్వార్థ రాజకీయ నాయకుడని, తనకు అవకాశం కల్పించిన ప్రజలకు సేవ చేయాలనే తపనతో ముందుకు సాగిన గొప్ప నాయకుడి అన్నారు. ఐదుసార్లు సర్పంచ్‌గా ఎన్నికైన ఆయన ఉన్న ఊరికి మేలు చేయాలని ఎంతో తపన పడ్డాడని ఆయన సేవలను కొనియాడారు. గ్రామాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశాడని అలాంటి నాయకుడు లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజా సేవలో మేడ రాజయ్య ఆదర్శమని, ఆయన సేవలు చిరస్మరణీ యమని అన్నారు.

## సెంటినరీ కాలనీలో దుర్గాదేవి నిమజ్జన వేడుకలు




**రామగిరి, అక్టోబర్ 03(ది క్రైమ్ న్యూస్):-** సెంటినరీ కాలనీ సీ-టు క్వార్టర్ లలో శుక్రవారం దుర్గాదేవి నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు గత తొమ్మిది రోజులుగా ఇక్కడ నిర్వహించారు. దసరా పండుగ తెల్లవారు రోజున దుర్గాదేవి విగ్రహాన్ని నిమజ్జనం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ట్రాక్టర్ పై దుర్గాదేవి విగ్రహాన్ని ఉంచి క్వార్టర్ లలో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు కోలాట నృత్యాలు చేశారు. గోదావరి నదిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో రత్నాపూర్ మాజీ సర్పంచ్ పల్లె.ప్రతిమ పీవీరావు, మాజీ ఉప సర్పంచ్ దుబ్బాక సత్య రెడ్డి-జ్యోతి రెడ్డి, సంతోష్ యాదవ్, వీరన్న,కొప్పుల రవీందర్ రావు, జక్కుల మనోహర్ రావు, బీముని సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

◆ భోజన్న పేట, చికురాయి గ్రామాలలోని దుర్గామాత మండపాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** దేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పెద్దపల్లి మండలంలోని భోజన్నపేట చికురాయి గ్రామాలలోని దుర్గామాత మండపాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే దాసరికి ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ దేవీ శరన్నవరాత్రులు అత్యంత పవిత్ర మైనవని, ఈ ఉత్సవాలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.సకల శుభాలు కలగాలని, తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ జగన్మాతను ప్రార్థించినట్లు తెలిపారు.అమ్మవారి ఆశీస్సులతో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని, లోకకళ్యాణాన్ని కాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షుడు కొయ్యడ సతీష్ గౌడ్, జక్కుల శ్రీకాంత్, పెంచాల శ్రావణ్, త్రినేష్, గుర్రాల అనిల్, శంకర్ శ్రీకాంత్, ఈర్ల తిరుపతి, తనుగుల రాజు, శంకరి రాయమల్లు, బాలసాని నరేష్, ఆవుల సంతోష్, చొప్పరి శ్రీకాంత్, బి ఆర్ ఎస్ కార్యకర్తలు ఉన్నారు.



# వీరోచిత పోరాటాలతో అకాడ ప్రదర్శన

◆ విజయదశమి వేడుకల్లో ఆకర్షణగా నిలిచిన రామగుండం బిజెపి ఇంచార్జీ కందుల సంధ్యారాణి కర్రసాము

**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** విజయదశమి పండుగ సందర్భంగా స్థానిక హనుమాన్ నగర్, గోదావరిఖనిలో జై భారత్ హనుమాన్ అకాడ ఆధ్వర్యంలో నిర్వహించిన అకాడ ప్రదర్శన విశేషంగా జరిగింది. గత 40 సంవత్సరాలుగా వస్తాద్ మచ్చ శంకర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ అకాడ సంప్రదాయ పోరాట కళలను పరిరక్షిస్తూ, కొత్త తరానికి నేర్పిస్తూ వస్తోంది. ప్రదర్శనలో బిజెపి రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి పాల్గొని కర్రసాము చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ, "ప్రాచీన యుద్ధ కళలు కేవలం సంప్రదాయంగా కాకుండా, మహిళల ఆత్మరక్షణకు, సమాజంలో ధైర్యం పెంపొందించడానికి ఎంతో ఉపయోగపడతాయి. యువత ఈ కళలను నేర్చుకోవడం సమయానుకూలం" అని అన్నారు. ఈ అకాడలో ప్రదర్శనతో పాటు, ఆసక్తి ఉన్నవారికి యుద్ధకళల శిక్షణ కూడా అందిస్తున్నారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడుల దృష్ట్యా, వారి ఆత్మరక్షణకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయుక్తమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో అకాడ కెప్టెన్లు శ్రీనివాస్, విశ్వాస్, దామోదర్, జనగామ శ్రీనివాస్, సమ్మయ్యలతో పాటు సుమారు 70 మంది మహిళలు, చిన్నపిల్లలు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రధాన చౌరస్తా వద్ద ఊరేగింపుగా నిర్వహించిన ఈ ప్రదర్శనకు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ప్రోత్సహించారు.



# మంత్రి సహకారంతోనే మంథని అభివృద్ధి సుసాధ్యం

◆ మాజీ సర్పంచ్ కొత్త రమాదేవి

**రామగిరి,అక్టోబర్ 03(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతోనే మంథని అభివృద్ధి సాధ్యమని మాజీ సర్పంచ్ కొత్త రమాదేవి- శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే ప్రజా సేవలో ముందుంటానని మంథని మండలం పుట్టపాక మాజీ సర్పంచ్ కొత్త రమాదేవి అన్నారు. అక్కేపల్లి ఎంపీటిసి మహిళా జనరల్ రిజర్వ్ కావడం తో ఈసారి ఎన్నికల్లో బరిలో నిలిచి గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను సర్పంచిగా పని చేసిన అనుభవం ఉందని, మంత్రి శ్రీధర్ బాబు ఆశీస్సులతో 2015 ఎన్నికల్లో జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన అనుభవం ఉందని తెలిపారు. అంతేగాకుండా గ్రామాభివృద్ధికి ఎంతోపాటుపడ్డానని తెలిపారు. తాను, తన కుటుంబం ఇప్పటికీ ప్రజా జీవితంలోనే ఉన్నామని అన్నారు. ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశిస్తే ఈసారి ఎంపిటీసీ గా పోటీచేసి గెలిచి ఎంపీపీ గా ప్రజలకు సేవ చేస్తానని అన్నారు. తాను ప్రజా సేవలో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు.



# కల్వచర్లలో బతుకమ్మ మెగా లక్కీడ్రా విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం

◆ శ్రీ సాయి జ్యువెలెర్స్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విజయవంతం





**రామగిరి, అక్టోబర్ 03(ది క్రైమ్ న్యూస్):-** దసరా పర్వదినం సందర్భంగా కల్వచర్ల గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో, శ్రీ సాయి జ్యువెలెర్స్ గోదావరిఖని వారి సహకారంతో బతుకమ్మ మెగా లక్కీ డ్రా ఘనంగా నిర్వహించారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ లక్కీ డ్రాలో వెయ్యి మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.లక్కీ డ్రా లో బూరుగు సుమలత, చెలువూరి సరోజన, గుండా లవణ్య, రాపెల్లి రాధ, కేశెట్టి ఇందిరా, వుయ్యాల కనకమ్మ లు విజేతలుగా నిలిచారు. అనంతరం క్లబ్ ప్రెసిడెంట్ మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ బతుకమ్మ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక. గ్రామ మహిళలందరిని ఒకచోట చేర్చి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం క్లబ్ గర్వకారణం. సమాజంలో మహిళలకు ఉత్సాహం కలిగించే కార్యక్రమాలను లయన్స్ క్లబ్ తరచుగా కొనసాగిస్తూనే ఉంటుందని అన్నారు. మాజీ జడ్పీటీసీ గంట వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ గ్రామీణ సాంస్కృతిక వైభవానికి నిలువెత్తు నిదర్శనం. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఆడపడుచులకు గౌరవం, ఆనందం కలిగించడం ప్రశంసనీయమని అన్నారు.క్లబ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శరణ్య యాదవ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో ముందుంటుంది.




మహిళల ఐక్యత, ఆత్మవిశ్వాసం పెంచే విధంగా ఈ బతుకమ్మ ఉత్సవం నిలిచిపోతుందని తెలిపారు.ఈ సందర్భంగా శ్రీ సాయి జ్యువెలెర్స్ సహకారం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చివరగా గ్రామ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ పెద్దలు, లయన్స్ సభ్యులు, మహిళలు భారీగా పాల్గొని బహుమతి ప్రధానోత్సవం చేసిన తర్వాత అందరు కలిసి జమ్మి వద్దకు బయలుదేరి ఈ వేడుకను విజయవంతం చేశారు.

# యుగ పొలం కొయ్యాలే....మరి యేడ పొయ్యాలే?

- ప్రారంభం కానున్న వరి కోతలు
- ముస్తాబవుతున్న హార్వెస్టర్లు
- కొనుగోళ్ల జాడలేదు
- నమ్మకం లేని ఎన్నికల హడావిడి
- పట్టించుకునే నాధుడు లేడు?
- రైతు మళ్లీ నష్టపోవాల్సిందేనా?



కోతకు సిద్ధంగా ఉన్న వరి

**(ది క్రైమ్ న్యూస్) బ్యూరో:** పెద్దపల్లి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ముందుగ వేసిన వరి కోతకు సిద్ధమైనట్టే. అల్లుడు వచ్చేదాకా అమాస ఆగేలా లేదు.దసరా పండుగకు ముందే కోతలు మొదలవ్వాల్సి ఉన్నా.. పండగ పూట నిమ్మలం లేకుండా చుట్టాల ముందట ఆగమాగం అవుడెందుకని ఆగినం అంటున్నరు ఆసాములు. హార్వెస్టర్ యజమానులు కూడా చిన్నచిన్న రిపేర్లను చేసుకుని వరి కోతలకు సై అంటున్నారు. మరి కోసిన ధాన్యాన్ని పోసుడెక్కడ? అని రైతులు దిగులు పడుతున్నరు. ఎందుకంటే ఇంతవరకుప్రభుత్వ పెద్దలు గాని అధికారులు గానీ ధాన్యం కొనుగోలు సెంటర్ల మీద ప్రత్యేకించి దృష్టి పెట్టిన పాపాన పోలేదు. నమ్మకం లేని స్థానిక ఎన్నికల బిజీలో ఉన్న వీళ్లు రైతులను ఇప్పట్లో పట్టించుకునేలా లేరు. మరి కోసిన ధాన్యం సంగతేమిటి? అని రైతులు తమలో తాము చర్చించుకుంటున్నారు.

పచ్చిధాన్యాన్ని డైరెక్ట్ మిల్లుకు తరలిస్తే.. వ్యాపారులు ఆడింది ఆట పాడింది పాట అన్నట్టు చేయడం ఇంతకుముందు జరిగిన అనుభవమే. మరి ఎక్కడో ఒకచోట ఆరబోసుకుందామా? అంటే కొనుగోలు సెంటర్లు ప్రారంభమయ్యేదెప్పుడు? అప్పటిదాకా వర్షాలకు తడవకుండా కాపాడుకోగలిగాలి. అంతేకాకుండా పరదాల కిరాయి మరో సమస్య. అయ్యగారి సంపాదన అమ్మగారి పసుపు కుంకుమ కే అన్నట్టు పరదాల కిరాయి తడిసి మోపెడవుతున్నది. ఇలా నెల రోజులు గడిచినా కూడా ముందుగా కోసిన రైతుల ధాన్యం కాంటాలు అయ్యే అవకాశం కనబడడం లేదు. ఈ పరిస్థితుల్లో రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు.

కోతలు ప్రారంభం కాకముందే నాయకులు కొనుగోలు సెంటర్లను ప్రారంభిస్తే వీళ్ళ ముళ్ళె ఏమన్న పోతదా? అంటూ రైతులు తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వరి రకాలు 120 నుండి 150 రోజుల్లో కోతకు రావడం అందరికీ తెలిసిన విషయమే. ఇక్కడ ఈ నగ్నసత్యం తెలియంది కేవలం నాయకులకు అధికారులకు మాత్రమే. కానీ వాళ్ళ ప్రసంగాల్లో మాత్రం మేము రైతులమే అంటూ చెప్పడం గమనార్హం. మరి నిజంగా వీళ్లకు రైతుల పట్ల చిత్తశుద్ధి ఉన్నట్లయితే 120 రోజుల్లో కోతకు వస్తాయన్న సోయి వీళ్లకు ఎందుకు లేదు? అన్నదే ఇక్కడ వడ్ల గింజ అడుగుతున్న ప్రశ్న. ఊరూరా దుర్గా మాత మండపాల దగ్గర ఫోటోలకు ఫోజులు ఇవ్వడానికి వచ్చిన నాయకులు పనిలో పనిగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే మాకు ఎంతో మేలు జరిగేది కదా అంటున్నారు కొందరు రైతులు.

జూన్ నెలలో నాట్లు వేసిన సంగతి వీళ్లకు తెలియదా? జూలై ఆగస్టు సెప్టెంబర్ తో 120 రోజుల పంటకాలం పూర్తయినట్టే. ముందుగా నాట్లు వేసి, కోతలకు సిద్ధమవుతున్న రైతులు నష్టపోవాల్సిందేనా? అంటే కచ్చితంగా అవుననే సమాధానమే వస్తుంది.

మద్యం విషయంలో మాత్రం గడువుకు ముందే కళ్ళు తెరిచిన ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను చాలా పకడ్బందీగా అమలు చేసే ప్రయత్నంలో ఉన్నది.

ధాన్యం కొనుగోలు విషయంలో మాత్రం నిర్ణీత కాలంలోగా ప్రారంభించే ఏర్పాటు ఎందుకు చేయడం లేదన్న సంగతిని రైతులు అర్థం చేసుకోవడమే కాదు... ఘాటుగానే బాహాటంగా ప్రభుత్వ తీరును విమర్శిస్తున్నారు.



వరి కోతలకు సై అంటూ ముస్తాబవుతున్న హార్వెస్టర్లు

ఇన్ని నెలలుగా స్థానిక ఎన్నికలను పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు హడావిడిగా అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం.. ఈ సాకుతో కొనుగోళ్ల ప్రక్రియను మరికొంత కాలం సాగదీయడం కళ్ళకు కట్టినట్టు కనబడుతున్నది. సగం కోతలు పూర్తయితే తప్ప యంత్రాంగం కదలక పోవడం ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం. అప్పటిదాకా ముందుగా కోతలు ప్రారంభించిన రైతులు దళారుల చేతుల్లో మోసపోక తప్పేలా లేదు.

రైతు సంక్షేమ ప్రభుత్వంలో ఈ వానాకాలం ప్రారంభం నుండి అడుగడుగునా గండాలను దాటుకుంటూ చివరి మెట్టు మీద ఉన్న రైతును దళారుల చేతుల్లో మోసపోకుండా చూడాల్సిన బాధ్యత నాయకుల,అధికారులదే.

ఏది ఏమైనా జరుగుతుందో లేదో తెలియని ఎన్నికల సాకుతో కొనుగోలు సెంటర్లను ప్రారంభించడం ఆలస్యం చేయకూడదు అంటూ రైతులు కోరుతున్నారు.

## తల్లితండ్రుల అకాల మరణంతో అనాథ అయిన శ్రీ హాన్స్

- స్నేహితుడు మరణించిన అండగా మేమున్నాం
- తల్లిదండ్రులను కోల్పోయిన శ్రీ హర్షన్ భవితకు అండగా

### రూ.లక్షా 22 వేలు డిపాజిట్ చేసిన స్నేహితులు

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తల్లిదండ్రుల అకాల మరణంతో పసి వయసులోనే అనాధగా మారిన శ్రీ హర్షణకు అండగా మేమున్నామంటూ శ్రీహన్స్ తండ్రి చిన్ననాటి స్నేహితులు ఆపన్న హస్తం అందించి మానవత్వం చాటుకున్నారు. తమతో చదువుకున్న స్నేహితుడి అకాల మరణంతో అనాధగా మారిన చిన్నోడికి చిన్ననాటి మిత్రులు అండగా నిలిచారు. రూ.లక్షా22వేల అయిదు వందలను బ్యాంకులో స్నేహితుడి కుమారుడి పేరున పొదుపు చేసిన బాండ్ పత్రాలను శుక్రవారం శ్రీ హాన్స్ నానమ్మ - తాతయ్యలకు అందించారు. పెద్దపల్లి మండలంలోని రాంపల్లి గ్రామానికి చెందిన కనపర్తి సాగర్ రావు (37) ఇటీవల అనారోగ్యంతో మరణించినాడు. ఇదిలా ఉండగా ఏడునెలల క్రితం సాగర్ రావు సతీమణి సైతం ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు ఇరువురు మరణించడంతో వారి మూడేళ్ళ కుమారుడు శ్రీహన్ష్ అనాధగా మారాడు. స్నేహితుడి కుమారుడి గురించి తెలుసుకున్న 2004 పదవతరగతి ట్రినిటీ పాఠశాల బ్యాచ్ విద్యార్థులు చేతులు కలిపారు.



రూ.లక్షా22వేల అయిదు వందలను సమీకరించి బాలుడి నానమ్మ-తాతయ్యకు పొదుపు బాండు రూపంలో అందించి తమ హృదయాన్ని చాటుకున్నారు. బాబు చదువులకు అయ్యే ఖర్చులు భరించడానికి మరో స్నేహితుడు రమణారెడ్డి ముందుకు వచ్చాడు. స్నేహితుల ఔదర్యాన్ని చూసిన గ్రామస్తులు వారిని అభినందించారు.

## ఘనంగా రావణ దహనం.. కనువిందు చేసిన తారాజువ్వలు

- ఐఎన్టియుసి, ఎఐటియుసి యూనియన్స్ ఆధ్వర్యంలో ఘనంగా రామ్‌లీలా మహోత్సవం
- రాణి రుద్రమదేవి గ్రౌండ్‌లో భక్తుల ఉత్సాహంతో ఆధ్యాత్మిక సందడి

**రామగిరి,అక్టోబర్ 03(ది క్రైమ్ న్యూస్):-** దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. దసరా రోజు సాయంత్రం రావణ దహనం చేసే సంప్రదాయం ఉంది. రావణుడిని దహనం చేయడం వల్ల ప్రతికూల శక్తి తొలగిపోయి ఆనందం, శ్రేయస్సు లభిస్తుందని నమ్ముతారు. దసరా మహోత్సవ సందర్భంగా సెంటినరీ కాలనీ రాణి రుద్రమదేవి గ్రౌండ్‌లో సింగరేణి కంపెనీ సహకారం, ఐఎన్టియూసి, ఏఐటీయూసీ కార్మిక యూనియన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా రామ్‌లీలా మహోత్సవం జరిగింది. ఇట్టి కార్యక్రమన్నీ ఐఎన్టియూసి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి, కేంద్ర కార్యదర్శి ఎల్లంకి రామారావు, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ వై.వి. రావు, బ్రాంచ్ ఉపాధ్యక్షులు ఎమ్మార్సిరెడ్డి నేతృత్వంలో వివిధ కమిటీ నాయకులు సహకారంతో విజయవంతంగా నిర్వహించబడింది. ముఖ్య అతిథులుగా ఏరియా జిఎం సుధాకర్ రావు, ఏఎల్పీ జిఎం కొలిపాక నాగేశ్వరరావు హాజరయ్యారు. అనంతరం కార్మిక యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ సింగరేణి సహకారం, యూనియన్ల భాగస్వామ్యం వలన రామ్‌లీలా ఘనంగా సాగింది. కార్మికులు, కుటుంబాలు అందరూ ఈ ఉత్సవాన్ని ఆనందంగా చూసే అవకాశం పొందారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. భక్తుల ఉత్సాహం ఈ సంప్రదాయాన్ని కొనసాగించడానికి స్ఫూర్తిగా ఉందనీ తెలిపారు. ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. విజయ దశమి రోజు ప్రతి ప్రదేశంలో రావణాసురిడి దిష్టి బొమ్మను దహనం చేసే ఆనవాయితీ ఉంది. పురాణాల ప్రకారం శ్రీరాముడు రావణుడిపై విజయం సాధించాడు. అంటే చెడుపై మంచి గెలుపును సూచిస్తూ ఇలా జరుపుకుంటారు. ఇది మాత్రమే కాకుండా దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించింది. రాక్షస సంహారం చేయడంతో దేవతలందరూ ఆనందంగా పూజ చేస్తారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ఐ ఎన్ టి యు సి , ఏఐటీయూసీ వివిధ కమిటీల నాయకులు, కార్యకర్తలు , పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.





## గాంధేయ మార్గంలోనే కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు

**- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గ్రామస్వరాజ్యం రావాలన్న గాంధీ మహాత్ముని కలలకు నేటి పాలకులు తూట్లు పొడుస్తున్నారనీ, మహత్ముని అహింస మార్గంలో కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గురువారం గోదావరిఖని చౌరస్తాలోనీ గాంధీ మహాత్ముని విగ్రహానికి బి.ఆర్.ఎస్ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసా మార్గం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ మహాత్ముడు గ్రామ స్వరాజ్యం కావాలని కోరుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో నేడు గ్రామాల్లోని రైతులు యూరియా కోసం అల్లాడుతున్నారని అన్నారు. నేటి పాలకుల తీరుతో గాంధీ మహాత్ముని ఆత్మ గోశిస్తుందని అన్నారు. గాంధీ మహాత్ముని అహింసా మార్గం ద్వారా కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, కేసీఆర్ పాలనలో రాష్ట్రం బంగారు తెలంగాణ వైపు అడుగులు వేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, మారుతి, అచ్చే వేణు, నూతి తిరుపతి, మెతుకు దేవరాజు, సట్టు శ్రీనివాస్,కోడి రామకృష్ణ, ఇరుగురాళ్ల శ్రావన్ ముద్దసాని సంధ్యా రెడ్డి గుర్రం పద్మ యాసర్ల తిమ్మెతి తదితరులు పాల్గొన్నారు.

## వంశ వృక్ష ఆత్మీయ సమేళ్మనం




**ముత్తారం.అక్టోబర్.03.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండల కేంద్రంలోని వెంకటలక్ష్మి గార్డెన్ లో మండల కేంద్రానికి చెందిన నాలుగు తరాల కుటుంబ సభ్యులు ఒకే వేదికపై శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన పింగిలి క్రీ.శే.కాంతమ్మ-మల్లారెడ్డి దంపతులకు క్రీ.శే.రాజిరెడ్డి,నర్సింహా రెడ్డి,క్రీ.శే.మల్లక్క పాల్కల భారతి,కర్క వెంకటలక్ష్మి అనే ఇద్దరు కుమారులు,ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.కాంతమ్మ మల్లారెడ్డి దంపతులు వ్యవసాయం చేస్తూ పిల్లలందరికీ పెళ్లిళ్లు చేశారు.ఈ వేడుకలలో కుమారులు-కోడళ్లు, కుమార్తెలు-అల్లుళ్లు మనుమలు,మునిమనుమలు,మనవరాళ్లు ఇలా మొత్తం ఈ కుటుంబంలో 40 మంది ఉన్నారు. వీరిలో చాలామంది వ్యాపారం చేస్తుండగా, యువతరంలోని పలువురు ఉద్యోగాల రీత్యా విదేశాల్లో స్థిరపడ్డారు.ఏడేళ్ల క్రితం కాంతమ్మ మల్లారెడ్డి దంపతులు మృతిచెందగా, వారి జ్ఞాపకార్థం వంశ వృక్ష ఆత్మీయ వేడుక నిర్వహించారు.ఆ కుటుంబానికి చెందిన కట్ల మల్లక్క కుమారుడు జనార్ధన్ రెడ్డి మూడు నెలలుగా అందరికీ సమాచారం ఇస్తూ,ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు.ఈ సమ్మేళనంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి 150 మంది హాజరై ఆటపాటలతో పాటు నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వీకుల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కుటుంబ బంధుత్వాలతో పాటు వాటి విలువ గురించి వివరించారు.ఈ సమావేశానికి వచ్చిన వారు పరస్పరం ఆత్మీయంగా అనుభవాలను పంచుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, దేవేందర్రెడ్డి, పింగిలి సంజీవ రెడ్డి,క్రాంతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలే...

**- దుర్గామాతలను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**





**రామగిరి, అక్టోబర్ 03(ది క్రైమ్ న్యూస్):-** దుర్గామాత అమ్మవారి దీవెనలు, ఆశీస్సులు అందరిపై ఉండాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వేడుకున్నారు. దేవి శరన్నవరాత్రోత్సవాల్లో బాగంగా మంథని పట్టణంలో ముత్యాలమ్మ వాడ జై భీమ్ యూత్, గాంధీ చౌక్ బజరంగ్దళ్ యూత్, పోచమ్మ వాడ దుర్గా సంస్థాన్, మహాలక్ష్మి ఆలయం మహంకాళి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గామాతలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.నియోజకవర్గ ప్రజలు అమ్మవారి దీవెనలతో సంతోషంగా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌ను సన్మానించారు.

## శమీ పూజలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్- శైలజ దంపతులు





**రామగిరి,అక్టోబర్ 03(ది క్రైమ్ న్యూస్):-** విజయాలనిచ్చే విజయదశమి దసరా సందర్భంగా గురువారం సాయంత్రం వేదపండితులు నిర్వహించిన శమీ పూజలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్- శైలజ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాండవులకు ఆశ్రయం ఇవ్వడంతో పాటు శ్రీరాముడి విజయానికి జమ్మి చెట్టు ప్రతీకగా నిలుస్తుందని, ఈ క్రమంలో విజయదశమి రోజున జమ్మి చెట్టును పూజించడం ఆనవాయితీగా వస్తోందని ఆయన తెలిపారు. మంథని కోర్టు సమీపంలోని జమ్మి చెట్టును దర్శించుకున్న ఆయన పట్టణ ప్రజలకు దసరా శుబాకాంక్షలు తెలిపారు. ఈ విజయదశమి ప్రతి ఒక్కరికి విజయాన్ని చేకూర్చాలని వేడుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం పట్టణ ప్రజలు, అభిమానులు ఆయనకు శమీ ఆకులు అందించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో పిల్లి సాయి కిరణ్ స్మారకార్థం పండ్లు, చల్లని త్రాగునీరు పంపిణీ చేశారు....

## కొత్తపల్లిలో జమ్మి పూజ...





**జమ్మికుంట అక్టోబర్ 3 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలో కొత్తపల్లి ఏరియాలో మడిపల్లి క్రాస్ బ్రిడ్జి కింద సాయినాథ్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జమ్మి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ మాజీ వైస్ చైర్పర్సన్ దేశిని స్వప్నకోటి పాల్గొని జమ్మి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దేశిని స్వప్నకోటి మాట్లాడుతూ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి సాయినాథ్ యూత్ అసోసియేషన్ వారు పెద్ద ఎత్తున జమ్మి పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు ఈ ప్రాంత పుర ప్రముఖులను మహిళా సోదరీమణులను యువతను అన్ని వర్గాల ప్రజలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి అందర్నీ శాలువాలతో సత్కరించి దేవుని కంకణం కట్టి కొబ్బరికాయలు కొట్టించి గౌరవించుకుంటూ సంస్కృతి సాంప్రదాయాల పద్ధతిలో దసరా జమ్మి పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు గత 25 సంవత్సరాల నుండి పలు స్వచ్ఛంద కార్యక్రమాలు కూడా సాయినాథ్ యూత్ అసోసియేషన్ వారు నిర్వహిస్తారు వారి అధ్యక్షులకు వారి సభ్యులందరికీ కూడా పేరుపేరునా శుభాకాంక్షలు ధన్యవాదాలు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి మాజీ కౌన్సిలర్లు ఎలగందుల స్వరూప శ్రీహరి. పిట్టల శ్వేత రమేష్. దేశిని రాధా సదానందం. కొత్తపల్లి మాజీ సర్పంచులు పాతకాల రవికుమార్. పి. రామారావు సాయినాథ్ యూత్ సభ్యులు కందారపు రాజేష్ బలబత్తుల శ్రీకాంత్ గోపి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సభ్యుడిని బహిష్కరించిన మండల అధ్యక్షులు - ప్రభాకర్ రెడ్డి

**భూపాలపల్లి/కాటారం/అక్టోబర్ -3:(ది క్రైమ్ న్యూస్):** కాటారం మండలం దామెర కుంట గ్రామానికి చెందిన గురెడ్డి శివ సాయి కృష్ణ తండ్రి రాజిరెడ్డి అను వ్యక్తి కాంగ్రెస్ పార్టీ సభ్యునిగా కొనసాగు తున్నాడు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించే విధంగా గ్రూపులలో పోస్టులు పెడుతూ, పార్టీ అభివృద్ధికి నిరోధకముగా కాంగ్రెస్ పార్టీ అనుమతి లేకుండా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల పైన వారి ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వ్యవహరించినందుకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరించడమైనదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేమనూరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కావున కాటారం మండలంలో జరిగే వివిధ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు గురెడ్డి శివ సాయి కృష్ణను అనుమతించకుడదని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఆదేశాలు ఇచ్చామని తెలియజేశారు. పార్టీ నియమ నిబంధనలు పాటించనీ వారెవరైనా, ఎంతటి వారైనా వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు.



# వీణవంకలో ఘనంగా విజయదశమి వేడుకలు..

◆ పాడి ఉదయ్ నందన్ రెడ్డి నివాసంలో ప్రత్యేక పూజలు





**వీణవంక అక్టోబర్ 3 (ది క్రైమ్ న్యూస్):** హుజురాబాద్ నియోజకవర్గం లోని వీణవంక మండల కేంద్రంలో పాడి ఉదయ్ నందన్ రెడ్డి నివాసంలో ఘనంగా విజయదశమి వేడుకల ను నిర్వహించారు. వేద పండితులు సతీష్ అయ్యగారి ఆధ్వర్యంలో శమీ వృక్షాన్ని ప్రతిష్టిపించి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో పాడి ఉదయ్ నందన్ రెడ్డి, గ్రామ ప్రజలు వివిధ కులాల పెద్ద మనుషులు షమీ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. తదనంతరం గ్రామప్రజలు జమ్మిని తీసుకుని ఒకరి ఒకరు పరస్పరంగా అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పాడి ఉదయ్ నందన్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో మెరుగైన విద్య కోసం చిన్నారులు ఐఐటి డాక్టర్లు కలెక్టర్లు వివిధ రంగాల్లో ఉద్యోగాలు సాధించాలంటే విద్యార్థులకు చిన్నప్పటినుండి మెరుగైన విద్య అవసరం ఇందుకోసం గ్రామంలో త్వరలో ఉచితంగా విద్యార్థులకుఆన్లైన్ కోచింగ్ అందజే యనున్నట్లు ఎఫ్ టి వి సి ఓ పాడి ఉదయానంద్ రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి పనిలో విజయం సాధించాలని, ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీణవంక మాజీ జెడ్పిటిసి దసారపు ప్రభాకర్, వెన్నంపల్లి నారాయణ, ఆయిత బాబాన్న, అల్లంకి నాగన్న, ఎం. సమ్మిరెడ్డి, మంతెన శ్రీధర్, సమిండ్ల చిట్టి, అమృత ప్రభాకర్, వేణు సందీప్, కూచనపెల్లి సాంబయ్య, మోటం వెంకటేష్, విష్ణు, కుమార్, దాసారపు సమ్మయ్య, రాజు, అశోక్, రాజేష్, తాళ్ల పెల్లి నాగరాజ్, తాటికొండ శివకుమార్, నీల సుదర్శన్, రాజయ్య, తాళ్ల పెల్లి కుమారస్వామి, తోట్ల రాకేష్, సిరిగిరి శేఖర్, పస్తాం కుమార్, రెడ్డిరాజుల భాస్కర్, పోచయ్య, హుజురాబాద్ నియోజకవర్గం ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సివిల్స్ సాధించడమే లక్ష్యం... ప్రజలకు సేవ చేసే అవకాశం

## - గుడెల్లి సృజన

**రామగిరి, అక్టోబర్ 03(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పరీక్షలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి 505 మార్కులతో స్టేట్ 35వ ర్యాంకు సాధించి డి.ఎస్.పి పోస్టుకు ఎంపికైన కుమారి గుడెల్లి సృజన ను శుక్రవారం జిఎం కార్యాలయం నందు జరిగిన కార్యక్రమంలో రామగుండం-ది ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ఘనంగా సన్మానించారు. రామగుండం-త్రీ ఏరియా లోని ఓసిపి-వన్ ఉపరితల గని నందు జనరల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న గుడెల్లి రాజేశం, రాణి దంపతుల కుమార్తె సృజనను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ పోటీపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సృజనను స్ఫూర్తిగా తీసుకోవాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కుమారి సృజన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అవకాశం కేవలం గ్రూప్స్ పరీక్షల్లో విజయం సాధించడం ద్వారానే సాధ్యమవుతుందని, అందుకు తగిన ప్రణాళిక ప్రకారం చదివి ముందుకెళ్లాలని, ఒక లక్ష్యం ఉన్నప్పుడు దానికి తగిన విధంగా మన ప్రాధాన్యత ను నిర్ణయించుకోవాలని, అప్పుడే లక్ష్యసాధన సులభం అవుతుందని, భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడమే సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం నాయకులు ఎం.రామచంద్రరెడ్డి, ఏరియా సేవా సమితి సంయుక్త కార్యదర్శి బి.అరుణ తదితరులు ఉన్నారు.



# ధర్మపురిలో అంబరాన్ని అంటిన విజయదశమి సంబరాలు

## - శమీ పూజలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**ధర్మపురి, అక్టోబర్ 3, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి పట్టణంలో గురువారం విజయదశమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ధర్మపురి పట్టణంలోని శ్రీ అక్క పెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయ సమీపంలోని జంబి గద్దె వద్ద జరిగిన శమీ పూజలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ ఉగ్ర నరసింహ స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల ఉత్సాహమూర్తులను మంగళ వాయిద్యాలతో, మేళ తాళాలు, వేద పండితులు, అర్చకులు, వేద పఠనం తో ముందు నడవగా జమ్మి గద్దె మండపం వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. అటు పిమ్మట మండప స్థల దాత స్వర్గీయ శీలం పెద్ద గంగారం కుటుంబ సభ్యులు, శీలం రమేష్ దంపతులను మండపం వద్ద అర్చకులు, వేద పండితులు ఘనంగా ఆశీర్వదించి స్వామివారి వస్త్రాన్ని ఆలయ పక్షాన వారికి బహుకరించారు. జమ్మి వృక్షం వద్ద స్వామివారి కి వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విజయ సూచికంగా ధర్మపురి పోలీసులు సీఐ, ఎస్సై లు ఇరువురు తుపాకీతో గాలిలో కాల్పులు జరిపారు. అనంతరం జమ్మి వృక్షము చుట్టు ప్రదక్షిణలు కావించి స్వామివారి ఉత్సవ మూర్తులు ఊరేగింపుగా పట్టణంలో ని అంబేద్కర్ విగ్రహం, పుష్కర స్తూపం, బస్టాండ్, గాంధీ చౌక్, నుండి ఇసుకస్తంభం వద్దకు చేర్చారు. వేలాదిమంది భక్తజనం ఉత్సవమూర్తుల ఊరేగింపు వెంట గోవింద నామస్మరణలతో తరలి రాగ. మంత్రి లక్ష్మణ్ కుమార్, స్వామివారి సేవ పల్లకిని బోయిలతో కలిసి మోశారు. స్థానిక బస్టాండ్ వద్ద ఆలయ పక్షాన ఏర్పాటుచేసిన మహిషాసుర బొమ్మను నిర్వహణ అధికారి శ్రీనివాస్ బాణాసంచాతో కాల్చి దహనం చేశారు. వంశపార్యం పరంగా స్వామివారి సేవ పల్లకిని మోసే బోయులకు బెస్త వారికి మంత్రి లక్ష్మణ్ కుమార్ గత సంవత్సరం 20 వేలు అందించగా, ఈ సంవత్సరం 45 వేల నగదును వారికి అందించారు. ఇటీవల దేవాదాయ శాఖ నుండి వీరికి సేవ మోసేందుకు వేతనం పెంపుదలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి నియోజకవర్గ ప్రజానికానికి విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయ దశమి వేడుకల్లో పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## దుర్గాభవానిని దర్శించుకున్న మండల అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి



**ఎండపల్లి, అక్టోబర్03(ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి వద్ద శ్రీ దుర్గ భవాని సేవాసమితి వారి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గాభవానిని శుక్రవారం ఉమ్మడి వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీ దుర్గాభవాని ఆశీస్సులు మండల ప్రజలపై ఉండాలని అ దేవి ఆయురారోగ్యాలను, అష్టైశ్వర్యాలను ప్రజలకు ప్రసాదించాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రంగనాథ చార్యులు, సోమిశెట్టి రమేష్, బాలసాని మల్లేశం, గాజుల విజయ్, గెల్లు శ్రీను, చొప్పదండి దుర్గయ్య, సిద్ది లచ్చయ్య, వ్యాల్ల అనిల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న వెల్గటూర్ ఎస్సై ఉమాసాగర్





**ఎండపల్లి, అక్టోబర్03(ది క్రైమ్ న్యూస్):** పోలీస్ అంటే మండలంలో గస్తీ కాయడమే కాదు ప్రజల ప్రాణాలను కూడ కాపాడతారని జగిత్యాల జిల్లా వెల్గటూర్ ఎస్సై ఉమ సాగర్ నిరూపించారు. శబాష్ పోలీస్ అన్న అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. రోడ్డు ప్రమాదానికి గురైన ఓ వ్యక్తిని కాపాడేందుకు పోలీస్ వెహికల్ లో తీసుకెళ్లి ప్రాణాపాయ స్థితిలో వైద్యం అందేలా చేసి మానవత్వం చాటుకున్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో కరీంనగర్ మంచిర్యాల రహదారి పోలీస్ స్టేషన్ సమీపంలో రాత్రి ఓ బైక్ పై వెళ్తున్న వ్యక్తి అతివేగంగా వచ్చి రోడ్డు దాటుతున్న వెల్గటూర్ కి చెందిన మల్లేష్ అనే వ్యక్తిని ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన మల్లేష్ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. స్థానికులు వెంటనే అంబులెన్స్ కు ఫోన్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలికి చేరుకున్నారు. అప్పటికే అరగంట సమయం అవుతున్నా కూడా అంబులెన్స్ రాకపోవడంతో వెల్గటూర్ ఎస్సై ఉమ సాగర్ తన ఉదారత చాటుకున్నారు. తీవ్ర గాయాలైన మల్లేష్ ను స్వయంగా పోలీస్ వాహనంలో ఎక్కించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ఒక్క ప్రాణం కాపాడటానికి ఎస్సై ఉమ సాగర్ పడిన బాధని చూసి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి అధికారిని వెల్గటూర్ మండలానికి అందించిన ఉన్నత అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# భారీ ఆధిక్యం దిశగా భారత్

◆ రాహుల్, జురేల్, జడేజా సెంచరీలు ◆ విండీస్ పై పూర్తి ఆధిపత్యం ◆ 162 పరుగులకే విండీస్ ఆలౌట్ ◆ అహ్మదాబాద్‌లో వెస్టిండీస్‌తో తొలి టెస్ట్ ◆ వెస్టిండీస్‌పై నిప్పులు చెరిగిన సిరాజ్..



ఈ మ్యాచ్?లో జడ్డు సెంచరీతో అదరగొట్టాడు. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనలో అదరగొట్టిన జడ్డూ, మరోసారి తన ఫామ్ చాటుకున్నాడు. ఈ క్రమంలోనే అరుదైన ఘనత సాధించాడు. టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక సిక్స్?లు బాదిన భారత బ్యాటర్లలో రవీంద్ర జడేజా, ఎంఎస్ ధోనిని అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో కరేబియన్ బౌలర్ జోమెల్ వారికన్ వేసిన బంతి, జడేజా అద్భుతమైన సిక్స్?గా మలిచాడు. ఇది అతని టెస్ట్ కెరీర్‌లో 78వ సిక్స్. ఎంఎస్ ధోని కూడా టెస్టుల్లో 78 సిక్సర్లే సాధించాడు. ఆ తర్వత మరో సిక్స్?తో ధోనిని అధిగమించాడు. ప్రస్తుతం జడ్డూ 79 సిక్స్?లతో ఉన్నాడు. భారత బ్యాటర్లలో రోహిత్ శర్మ (88 సిక్స్?లు), రిషభ్ పంత్ (90 సిక్స్?లు), వీరేంద్ర సెహ్వాగ్ (91 సిక్స్?లు) మాత్రమే జడేజా కంటే ముందున్నారు. వీరిలో రిషభ్ పంత్ ఒక్కడే ఇప్పటికీ టెస్ట్ క్రికెట్ ఆడుతున్నాడు. అయితే, ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో గాయపడిన పంత్, ప్రస్తుత వెస్టిండీస్ సిరీస్‌లో ఆడటం లేదు. ఓపెనర్ కేఎల్ రాహుల్ అద్భుత శతకంతో సత్తా చాటాడు. మొదటి రోజు అర్ధశతకం పూర్తి చేసిన అతడు, రెండో రోజు లంచ్‌కు కొద్ది నిమిషాల ముందు 100 పరుగుల మార్క్ అందుకున్నాడు. 190 బంతుల్లో అతడు సెంచరీ సాధించాడు. ఈ ఇన్నింగ్స్?లో 12 ఫోర్లు ఉన్నాయి. టెస్టుల్లో అతడికిది 11వ సెంచరీ. కానీ స్వదేశంలో మాత్రం రెండో శతకమే. ఇంతకుముందు 2016లో చెన్నైలో ఇంగ్లాండ్‌పై సెంచరీ నమోదు చేశాడు. అయితే, లంచ్ తర్వాత బ్యాటింగ్‌కు తిరిగి వచ్చిన రాహుల్, ఒక్క పరుగు కూడా జోడించకుండా పెవిలియన్‌కు చేరాడు. అంతకుముందు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 100 బంతుల్లో 50 పరుగులు చేశాడు. అంతకుముందు టాస్ నెగ్గిన విండీస్ బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ భారత బౌల్లర్లు తొలి ఇన్నింగ్స్?లో విండీస్ బ్యాటర్లకు చుక్కలు చూపించారు. దీంతో విండీస్ 162 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జస్టిన్ గ్రేవ్స్ (32 పరుగులు) టాప్ స్కోరర్. ఓపెనర్లు జాన్ కాంమెల్ (8), చందర్?పాల్ (0) స్వల్ప స్కోర్లు చేశారు. అలిక్ (12), బ్రెండన్ కింగ్ (13), రోస్టన్ ఛేజ్ (24), షయ్ హోప్ (26), పెర్రి (11), వారికన్ (8), లేన్ (1) అందరూ స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. టీమ్ఇండియా బౌలర్లలో మహ్మద్ సిరాజ్ 4, జస్ప్రీత్ బుమ్రా 3, కుల్దీప్ 2, వాషింగ్టన్ సుందర్ 1 వికెట్లు దక్కించుకున్నారు. మిండియా స్టార్ పేసర్, హైదరాబాద్ డీఎస్పీ మహమ్మద్ సిరాజ్ నిప్పులు చెరిగాడు. టాస్ ఓడి బౌలింగ్‌కు దిగిన టీమిండియాకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. తన తొలి స్పెల్‌లోనే సిరాజ్ 3 వికెట్లు పడగొట్టి విండీస్ పతనాన్ని శాసించాడు. దాంతో సిరాజ్‌పై నెటిజన్లు ప్రశంసల జల్లు కురుస్తోంది. సిరాజ్ ధాటికి వెస్టిండీస్ 90 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. సిరాజ్‌తో పాటు కుల్దీప్ యాదవ్, బుమ్రా చెరో వికెట్ తీసారు. ఈ మ్యాచ్ ఆరంభంలోనే తేజ్‌నారాయణ్ చందర్‌పాల్(0)ను సిరాజ్ కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే జాన్ కాంప్‌బెల్(8)ను జస్‌ప్రీత్ బుమ్రా కీపర్ క్యాచ్‌గా ఔట్ చేశాడు. క్రీజులోకి వచ్చిన బ్రాండన్ కింగ్(13)ను స్టన్నింగ్ డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేసిన సిరాజ్.. ఆచితూచి ఆడిన అలిక్ అథనాసియస్(12)ను క్యాచ్ ఔట్‌గా వెనక్కిపంపాడు. అతను కొట్టిన షాట్ నేరుగా స్లిప్‌లో ఉన్న కేఎల్ రాహుల్ చేతిలో పడింది.దాంతో వెస్టిండీస్ 42 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రోస్టన్ ఛేజ్(22 బ్యాంటింగ్) షైహోప్(26) ఆచితూచి ఆడుతూ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. 48 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని విడదీసేందుకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పిన్నర్లను రంగంలోకి దించాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెట్టుకున్న కుల్దీప్ యాదవ్ తన రెండో ఓవర్‌లోనే షైహోప్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ వికెట్ అనంతరం అంపైర్లు లంచ్ బ్రేక్ ప్రకటించారు. ఇంగ్లండ్ పర్యటనలో అద్భుత ప్రదర్శన కనబర్చిన సిరాజ్.. అదే జోరును సొంతగడ్డపై కొనసాగిస్తున్నాడు. సొంతగడ్డపై సిరాజ్ రాణించలేడనే విమర్శలను తుడిచి పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా 2-2తో డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే. ఆఖరి టెస్ట్‌లో సిరాజ్ అద్భుత ప్రదర్శనతో టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్నందించాడు. ఈ పర్యటనలో అతను ఐదు టెస్ట్‌లు ఆడి 23 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో సిరాజ్5 వికెట్ల ఘనతను అందుకోవాలని ఫ్యాన్స్ ఆకాంక్షిస్తున్నారు. ప్రస్తుతం సిరాజ్ వికెట్లకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# కొత్త జెర్సీతో టీమ్ ఇండియా



భారత క్రికెట్‌లో కొత్త శకం మొదలైంది. అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో టీమ్ఇండియా ఆటగాళ్లు తొలిసారి తమ కొత్త స్పాన్సర్ అయిన అపోలో టైర్స్ లోగో డిజైన్?తో ఉన్న జెర్సీలను ధరించి బరిలోకి దిగారు. ఈ మార్పు క్రికెట్ ప్రియుల్లో ఆసక్తి రేకెత్తించింది. ఇప్పటివరకు టీమ్ఇండియా జెర్సీలపై కనిపించిన డ్రీమ్11 లోగో మాయమై, ఇప్పుడు అపోలో టైర్స్ లోగో కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ గేమింగ్ సంబంధిత అంశాలపై పార్లమెంటులో ఆమోదం పొందిన బిల్లుతో దేశంలో గేమింగ్ రంగంపై నియంత్రణలు బలపడాయి. ఈ నేపథ్యంలో డ్రీమ్11 సంస్థ బీసీసీఐతో రూ.358 కోట్ల ఒప్పందాన్ని మధ్యలోనే విరమించుకుంది. దీంతో బీసీసీఐ స్పాన్సర్ లేకుండా ఆసియా కప్‌లో జట్టు బరిలోకి దిగడం విశేషం. డ్రీమ్11 తొలుత 3 ఏళ్ల పాటు ఒక్కో మ్యాచ్‌కు రూ.4 కోట్లు చెల్లిస్తూ స్పాన్సర్‌గా వ్యవహరించింది.ఈ నేపథ్యంలో బీసీసీఐ తాత్కాలిక నిర్ణయం తీసుకొని కొత్త స్పాన్సర్ కోసం బిడ్లు ఆహ్వానించింది. ఈ బిడ్డింగ్ ప్రక్రియలో అపోలో టైర్స్ విజేతగా నిలిచి, భారత జట్టు అధికారిక స్పాన్సర్‌గా ఎంపికైంది. నూతన ఒప్పందం ప్రకారం, అపోలో టైర్స్ బీసీసీఐకి ప్రతి మ్యాచ్‌కు రూ.4.5 కోట్లు చెల్లించనుంది. మొత్తంగా ఈ ఒప్పంద విలువ రూ.579 కోట్లు కాగా, ఇది 2028 మార్చి వరకు అమలులో ఉండనుంది.ఈ కాలవ్యవధిలో భారత్ ఆడే 121 ద్వైపాక్షిక మ్యాచ్‌లు, 21 ఐసీసీ మ్యాచ్‌లలో అపోలో టైర్స్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తుంది. పురుషులూ, మహిళలూ %-% రెండు జట్ల జెర్సీలపై ఈ కంపెనీ లోగో స్పష్టంగా కనిపిస్తుంది. అయితే గువాహటి వేదికగా ఇటీవల జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లో టీమ్ఇండియా మహిళా జట్టు అపోలో టైర్స్ లోగో లేని జెర్సీలతో బరిలోకి దిగిన విషయం గమనార్హం. అధికారికంగా ఒప్పందం ఇంకా అమల్లోకి రాలేదన్న అనుమానాలు వెలువడ్డాయి.ఇక వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్ అనంతరం టీమ్ఇండియా అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఇందులో మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సిరీస్‌నుంచి అపోలో టైర్స్ పూర్తి స్థాయిలో తమ స్పాన్సర్‌షిప్‌ను కార్యరూపం దాల్చనుంది. ముమ్మందు జరగబోయే అన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లలో టీమ్ఇండియా అపోలో టైర్స్ బ్రాండ్ ప్రతినిధిగా కనిపించనుంది. కొత్త స్పాన్సర్‌తో భారత జట్టుకు కొత్త రూపం లభించింద నటంలో ఎలాంటి సందేహం లేదు. అపోలో టైర్స్‌తో బీసీసీఐ ఒప్పందం దేశీయ బ్రాండ్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు, జట్టుకు ఆర్థికంగా బలాన్ని కూడా అందించనుంది.కాగా, పది నెలల సుదీర్ఘ విరామం తర్వాత సొంతగడ్డపై టీమ్ఇండియా టెస్టు మ్యాచ్ ఆడుతోంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో తొలి టెస్టు నేటినుంచి ప్రారంభమైంది. వెస్టిండీస్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. దీంతో భారత్ మొదట బౌలింగ్ చేస్తోంది. ఇద్దరు ప్రధాన సీమర్లు జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్‌తో టీమ్ఇండియా బరిలో దిగింది.

## సచిన్, స్టీవ్ స్మిత్ సలహాలతోనే రాణిస్తున్నా: టీమిండియాటెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్



ఇంగ్లండ్ పర్యటనలో తాను మెరుగ్గా రాణించడానికి క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ సలహాలు ఉపయోగపడ్డాయని టీమిండియాటెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. ఇంగ్లండ్ పర్యటనకు ముందు ఈ ఇద్దరి నుంచి సలహాలు తీసుకున్నట్లు జియోహాట్‌స్టార్ ఇంటర్వ్యూలో శుభ్‌మన్ గిల్ వెల్లడించాడు. ఇంగ్లండ్ పర్యటనతోనే టీమిండియా టెస్ట్ సారథ్య బాధ్యతలు చేపట్టిన శుభ్‌మన్ గిల్.. అటు కెప్టెన్‌గా.. ఇటు బ్యాటర్‌గా దుమ్మురేపాడు.ఐదు టెస్ట్‌ల్లో 75.40 సగటుతో 754 పరుగులు సాధించాడు. ఇందులో నాలుగు శతకాలు ఉన్నాయి. విదేశీ పిచ్‌లపై గిల్ రాణించలేడనే విమర్శలకు తన బ్యాట్‌తోనే గిల్ సమాధానమిచ్చాడు. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ నేపథ్యంలో అధికారిక బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌తో మాట్లాడిన గిల్.. తన సక్సెస్ సీక్రెట్‌ను వెల్లడించాడు.'విదేశాల్లో రాణించలేదనే ఒత్తిడి నాపై ఉండేది. కానీ నా ప్రాక్టీస్, మనస్థత్వం, బ్యాటింగ్ చేస్తున్న స్థానాలపై నాకు చాలా నమ్మకం ఉంది. ఇంగ్లండ్ పర్యటనకు ముందు నేను సచిన్ సార్‌తో మాట్లాడాను. అలాగే ఐపీఎల్‌లో నాతో కలిసి ఆడిన మాథ్యూ వేడ్ ద్వారా స్టీవ్ స్మిత్ నెంబర్ తీసుకొని మాట్లాడాను. ఇద్దరూ ఒకే విషయం చెప్పారు. స్ట్రెయిట్‌గా డిఫెండ్ చేయాలి, స్క్వేర్ దిశగా పరుగులు చేయాలని సూచించారు.ముందుగా సచిన్‌తో మాట్లాడాలంటే చాలా ఆలోచించా. కానీ ఆయనతో సంభాషించాక అద్భుతమైన అనుభూతి కలిగింది. నా బ్యాటింగ్ విషయంలో ఆయన చాలా సూచనలు ఇచ్చాడు. మిడాఫ్ ఆడేటప్పుడు బంతిని స్టంప్స్ పైకి రానివ్వకుండా చూడాలన్నాడు. ఆ బంతులను స్క్వేర్ లెగ్ వైపు ఆడాలని సూచించాడు. నా బ్యాటింగ్ టెక్నిక్‌లోని లోపాలు చెప్పాడు. వాటిపై నెట్స్‌లో తీవ్రంగా ఫోకస్ పెట్టా. విపరీతంగా ప్రాక్టీస్ చేశా.మానసికంగా బలంగా ఉండాలని స్మిత్ సూచించాడు. ఇంగ్లండ్ పేసర్లను ఎదుర్కొనేటప్పుడు చాలా కీలకమని తెలిపాడు. టెస్ట్‌ల్లో చాలా ఓపికగా ఉండాలని, డ్రైవ్‌ల కోసం ప్రయత్నించకూడదని చెప్పాడు. తొలి గంటలో షాట్స్ జోలికి వెళ్లకుండా జాగ్రత్తగా ఆడాలని తెలిపాడు.'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు.

# బంగ్లా చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్



025 మహిళల వరల్డ్ కప్?లో భాగంగా పాకిస్థాన్?తో జరిగిన మ్యాచ్?లో బంగ్లాదేశ్ విజయం సాధించింది. ఈ మ్యాచ్?లో బంగ్లాదేశ్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. 130 పరుగుల ఛేదనను బంగ్లా జట్టు 31.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 38.3 ఓవర్లలో 129 పరుగులకు కుప్పకూలింది.టాస్ గెలిచిన బ్యాటింగ్‌కు దిగిన పాక్ మహిళా బ్యాటర్లకు బంగ్లా బౌలర్లు చుక్కలు చూపించారు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పాక్ మహిళల జట్టును 38.3 ఓవర్లలో 129 పరుగులకే ఆలౌట్ చేశారు. రమీన్ షమీమ్ (23), ఫాతిమా సనా (22), మునీబా అలీ (17), దయానా బేగ్ (16), సిద్రా నవాజ్(15) అలియా రియాజ్ (13) ఇలా ఏ ఒక్కరూ బ్యాటింగ్‌లో బంగ్లా మహిళా బౌలర్ల ధాటికి నిలవలేకపోయారు. షోర్నా అక్తర్ మూడు వికెట్లు తీయగా, మరూఫా అక్తర్, నహిదా అక్తర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. నిషితా అక్తర్, ఫాతిమా, రబేయా ఖాన్‌లు తలో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా మహిళల జట్టుకు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. ఫర్గానా (2), షర్మిన్ అక్తర్ (10) తక్కువ పరుగులకే ఔటయ్యారు. ఈ క్రమంలో రుబియా హైదర్ అర్ధశతకంతో (54బీ 77 బంతుల్లో 8ఐ4) రాణించడమే కాకుండా నాటౌట్‌గానూ నిలిచింది. నిగర్ సుల్తానా (23), శోభన మోస్తరీ (24) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. పాక్ బౌలర్లలో ఫాతిమా, దయానా బేగ్, రమీన్ షమీమ్ తలో వికెట్ తీశారు.

# క్రికెట్‌లో రాజకీయాలు వద్దు: ఏబీ డివిలియర్స్



ఆసియా కప్ 2025 టోర్నీలో విజేతగా నిలిచిన టీమిండియా టైటిల్ స్వీకరించకుండా తప్పు చేసిందని సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ అన్నాడు. ట్రోఫీ అందజేసేవారి విషయంలో టీమిండియా అసంతృప్తిగా ఉండటం తనకు నచ్చేదని చెప్పాడు. క్రీడల్లో రాజకీయాలను జోక్యం చేయకూడదని సూచించాడు.ఆసియా కప్ 2025 ఫైనల్లో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన భారత్.. ట్రోఫీ లేకుండానే స్వదేశానికి తిరిగొచ్చింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) అధ్యక్షుడిగా ఉన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్‌సిన్ నఖ్వీ.. పాకిస్థాన్ మంత్రిగా కూడా కొనసాగుతున్నాడని, ఆయన చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోలేమని టీమిండియా స్పష్టం చేసింది.మరోవైపు తన చేతుల మీదుగా ట్రోఫీ అందుకోవాలని, ఏసీసీ ప్రెసిడెంట్‌గా ట్రోఫీ ప్రదానం చేయడం తన హక్కు అని నఖ్వీ పట్టుబట్టాడు. చివరకు ట్రోఫీ అందుకోవడానికి భారత్ ముందుకు రాకపోవడంతో నఖ్వీ దాన్ని తీసుకోని వెళ్లిపోయాడు. భారత ఆటగాళ్లు ఊహాజనిత ట్రోఫీతో సంబరాలు చేసుకున్నారు. ట్రోఫీ పట్టుకెళ్లిన నఖ్వీ తీరుపై బీసీసీఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. ట్రోఫీ అతని సొత్తు కాదని మండిపడింది. ఐసీసీకి ఫిర్యాదు చేసేందుకు కూడా సిద్దమైంది.తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఈ వ్యవహారంపై స్పందించిన ఏబీ డివిలియర్స్.. భారత్ తీరును పరోక్షంగా తప్పుబట్టాడు. నేరుగా విమర్శించకుండా రాజకీయాలు చేయవద్దని సూచించాడు. 'ఆసియా కప్ ట్రోఫీ అందజేసేవారి విషయంలో టీమిండియా కొంత అసంతృప్తిగా ఉంది. అయితే క్రీడల్లో రాజకీయాలను జోక్యం చేయకూడదని నేను భావిస్తున్నా. క్రీడలకు ఎప్పుడూ రాజకీయాలు దూరంగా ఉండాలి. క్రీడ అనేది ఒక అంశం, అది ఎలా ఆడాలో అలానే ఆడాలి. భారత్ ట్రోఫీ అందుకోకపోవడం బాధగా అనిపించింది. కానీ భవిష్యత్తులో ఈ సమస్యలన్నీ పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నా.ఇలాంటి పరిస్థితులు ఆటను, ఆటగాళ్లను చాలా క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టేస్తాయి. ఇలాంటి పరిస్థితులు చూడటం నాకు ఏ మాత్రం ఇష్టం ఉండదు. ఆసియా కప్ ఫైనల్ తర్వాత చాలా ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. మనం అత్యంత ముఖ్యమైన క్రికెట్‌పైనే ఫోకస్ పెడదాం. భారత్ జట్టు చాలా బలంగా కనిపిస్తోంది. టీ20 ప్రపంచకప్ కోసం సన్నదమవుతుంది. ఈ టోర్నీ మరీ అంత దూరం లేదు. భారత జట్టులో చాలా ప్రతిభ కలిగిన ఆటగాళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. వారు క్లిష్టపరిస్థితుల్లో బాగా ఆడుతారు. కాబట్టి టీ20ల్లో టీమిండియాకు తిరుగులేదు.'అని ఏబీ డివిలియర్స్ చెప్పుకొచ్చాడు.

## ధోనీ సరసన జడేజా.. టెస్టుల్లో అరుదైన ఘనత



భారత సీనియర్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా అరుదైన ఘనతను దక్కించుకున్నాడు. టెస్టుల్లో లెజెండరీ వికెట్ కీపర్ ఎంఎస్ ధోనీ సరసన నిలిచాడు. ఈ ఫార్మాట్లో అత్యధిక సిక్సర్లు బాదిన క్రికెటర్లలో ధోనీ సరసన జడ్డూ చేరాడు. తాజాగా అహ్మదాబాద్ లో జరుగుతున్న తొలి టెస్టులో 5 సిక్సర్లు కొట్టిన జడేజా.. తన కెరీర్లో 78వ సిక్సర్ ను సాధించాడు. దీంతో ధోనీ సరసన నిలిచాడు. ఈ మ్యాచ్ లో జడేజా అజేయ సెంచరీ (176 బంతుల్లో 104 బ్యాటింగ్, 6 ఫోర్లు, 5 సిక్సర్లు)తో సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఇక క్లాసిక్ ఫార్మాట్ లో అత్యధిక సిక్సర్లు బాదిన రికార్డు వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్, మాజీ విధ్వంసక ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ పేరిట ఉంది. వీరిద్దరూ కెరీర్లో 90 సిక్సర్లు బాది అగ్రస్థానంలో నిలిచారు. వారి తర్వాత స్థానంలో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 88 సిక్సర్లతో నిలిచాడు. ఇక తొలి స్థానంలో ఉన్న పంత్ గురించి తెలిసిందే. పరిస్థితులు ఎలా ఉన్న తనదైన శైలిలో ధనాధన్ ఆటతీరుతో అభిమానులను అలరిస్తాడు. కేవలం 27వ పడిలోనే , ఆడిన 47 టెస్టుల్లోనే పంత్ ఈ ఘనత సాధించాడు. మరో మ్యాచ్ ఆడితే తనే అత్యధిక సిక్సర్లు బాదిన ఇండియన్ క్రికెటర్ గా రికార్డు సాధించడంతోపాటు వంద సిక్సర్ల మార్కును కూడా అతి త్వరలో చేరుకుంటాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక ఫార్మాట్ ఏదైనా కానీ, సిక్సర్లను మంచి నీళ్లు తాగినట్లుగా బాదడం సెహ్వాగ్ శైలి.. సెంచరీ, డబుల్ సెంచరీ, ట్రిపుల్ సెంచరీ ఇలా మైలురాయిని సమీపించినప్పుడు కూడా సిక్సర్లు బాది, ఆ మార్కును చేరుకున్న అరుదైన ఆటగాడు సెహ్వాగ్.

# నిమిషాల్లో రూ. 1లక్ష విత్ డ్రా..
# పీఎఫ్ ఖాతాదారులు చేయాల్సిందిదే..

ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) ఖాతా ప్రతి ఉద్యోగికి ఉంటుంది. ఇది పదవీవిరమణ తర్వాత జీవితానికి ఉపయోగపడేలా రూపొందించిన స్కీమ్. దీనిని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) నిర్వహిస్తుంది. ప్రతి నెలా ఉద్యోగి నుంచి అలాగే తను పనిచేసే కంపెనీ నుంచి కొంత భాగం దానిలో జమవుతుంది. సాధారణంగా దీనిలో మొత్తాన్ని పదవీవిరమణ తర్వాత తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఎంప్లాయీ కంట్రిబ్యూషన్ నుంచి కొంత మొత్తాన్ని తీసుకునే వీలుంటుంది. వైద్య చికిత్స, వివాహాలు, విద్య, గృహ రుణాలు, గృహ నిర్మాణ ఖర్చులు వంటి నిర్దిష్ట ఆర్థిక అవసరాలకు దీని నుంచి నగదును ముందస్తుగా ఉపసంహరించుకునే వీలుంటుంది. అయితే ఎక్కువ శాతం మెడికల్ ఎమర్జెన్సీ వచ్చిన సమయంలోనే దీని నగదు విత్ డ్రా చేసేందుకు ఖాతాదారులు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో అత్యవసర చికిత్సల వేళ పీఎఫ్ నుంచి నగదు ఎలా విత్ డ్రా చేసుకోవచ్చు? తెలియాలంటే ఈ కథనం .. మెడికల్ ఎమర్జెన్సీ వేళ పీఎఫ్ ఉపసంహరణ.. వైద్యపరమైన అత్యవసర పరిస్థితులు లేదా ప్రాణాంతక పరిస్థితుల కారణంగా ఆస్పత్రిలో చేరిన సందర్భంలో,




ఈపీఎఫ్ఓ ??సభ్యులు రూ. 1 లక్ష వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు. గతంలో ఈ అడ్వాన్స్ తీసుకోవాలంటే ఆస్పత్రి నుంచి ఎస్టిమేషన్ సమర్పించాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు ఎటువంటి డాక్యుమెంటేషన్ అవసరం లేకుండానే రూ. లక్ష ఏక మొత్తంలో మెడికల్ అడ్వాన్స్ మంజూరు చేస్తున్నారు. ఎందుకంటే ప్రాణాంతకమైన అనారోగ్యాల విషయంలో, రోగిని అతని/ఆమె ప్రాణాలను కాపాడేందుకు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఆసుపత్రిలో చేర్చడం తప్పనిసరి అని, అటువంటి తీవ్రమైన పరిస్థితుల్లో ఆసుపత్రి నుంచి అంచనాను పొందడం సాధ్యం కాదని ఈపీఎఫ్ఓఈ నిర్ణయం తీసుకుంది. కొన్ని షరతులు ఉన్నాయి.. అయితే ఏక మొత్తంలో రూ. లక్ష విత్ డ్రా చేసే సమయంలో వ్యాధి చికిత్సకు సంబంధించి ఈఎస్ఐసీ లేదా సీజీహెచ్ఎస్ ఎంప్యానెల్డ్ హాస్పిటల్ వంటి ప్రభుత్వ లేదా ప్రభుత్వ రంగ విభాగంలో చేరిన వారు ఉపసంహరణలు చేయవచ్చు. ప్రైవేట్ ఆసుపత్రి విషయంలో మాత్రం ఈపీఎఫ్ఓ ప్రాథమికంగా కొన్ని అంశాలు తనిఖీ చేసి అడ్వాన్స్ ఇవ్వవచ్చా లేదా అనేది నిర్ణయిస్తారు. ఈపీఎఫ్ అడ్వాన్స్ క్లెయిమ్ ఇలా.. ఈపీఎఫ్ఓ పోర్టల్‌కి వెళ్లండి. మీ యూనివర్సల్ అకౌంట్ నంబర్ పాస్‌వర్డ్‌ని నమోదు చేయండి. లాగిన్ చేయడానికి క్యాప్చా కోడ్‌ను టైప్ చేయండి. మీకు ఓపెన్ అయిన పేజీలో మీ బ్యాంక్ ఖాతా సమాచారాన్ని నమోదు చేసి, కొనసాగించడానికి "వ్యాలిడేట్" ఎంచుకోండి. ఈ సమాచారం మీ పీఎఫ్ ఖాతాకు లింక్ అవుతుంది. ఇప్పుడు, నిబంధనలు, షరతులను అంగీకరించడానికి "ఎస్"పై క్లిక్ చేయండి. ఆ తర్వాత "ఆన్‌లైన్ సర్వీసెస్" లింక్‌ని క్లిక్ చేసి, అనారోగ్యం కోసం క్లెయిమ్ ఫారమ్-31ని ఎంచుకోండి దీని తర్వాత, 'ప్రొసీడ్ ఫర్ ఆన్‌లైన్ క్లెయిమ్'పై క్లిక్ చేయండి. రోగి ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయినట్లయితే, పీఎఫ్ ఉపసంహరణ సౌకర్యాన్ని పొందేందుకు ఒక ఉద్యోగి తప్పనిసరిగా 45 రోజులలోపు మెడికల్ బిల్లులను ఈపీఎఫ్ఓకి సమర్పించాలి. ప్రాసెస్ చేసిన తర్వాత, క్లెయిమ్ ఆమోదం కోసం యజమానికి ఇది వెళ్తుంది. సబ్‌స్క్రైబర్‌లు 'ఆన్‌లైన్ సర్వీస్' విభాగంలో 'క్లెయిమ్ స్టేటస్' ఎంపికను ఎంచుకోవడం ద్వారా మీ క్లెయిమ్ స్థితిని పర్యవేక్షించవచ్చు.

## ఏజెంట్లతో జాగ్రత్త సుమా? పెట్టుబడి పెట్టేముందు ఈ విషయాలు తెలుసుకోకపోతే నష్టపోతారు..

పెట్టుబడి పథకాలు మార్కెట్లో చాలానే ఉంటాయి. వాటిల్లో బెస్ట్ ఎంపిక చేసుకోవడం, దానిలో పెట్టుబడి పెట్టడం అనుకున్నంత సులభం కాదు. జాతీయ స్థాయిలో చాలా పథకాలు మనకు అందుబాటులో ఉంటాయి. వాటిని నేషనల్ సేవింగ్స్ స్కీమ్స్(ఎన్ఎస్ఎస్) అని పిలుస్తారు. వీటిల్లో పెట్టుబడి పెట్టేందుకు కొంత మంది ఏజెంట్ల ఆశ్రయిస్తారు. వారి ద్వారా తమ పెట్టుబడులను డైవర్సిఫై చేస్తుంటారు. అయితే మీ ఆర్థిక లక్ష్యాలను చేరుకోడానికి మీరు చేసే ఈ ప్రయత్నంలో మీరు విజయం సాధించాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.. ముఖ్యంగా ఏజెంట్ ద్వారా పెట్టుబడులు పెట్టే వారు ఈ విషయాన్ని తప్పక తెలుసుకోవాలి. అందుకే నేషనల్ సేవింగ్స్ ఇన్‌స్టిట్యూట్ వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్న టాప్ సేవింగ్స్ స్కీమ్స్, ఏజెంట్ ద్వారా వాటిల్లో పెట్టుబడులు పెట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. నేషనల్ సేవింగ్స్ స్కీమ్స్ రకాలు ఇవి.. నేషనల్ సేవింగ్స్ ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, నేషనల్ సేవింగ్స్ స్కీమ్‌లలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న పథకాలు ఇవి.. పోస్ట్ ఆఫీస్ సేవింగ్ అకౌంట్ నేషనల్ సేవింగ్ రికరింగ్ డిపాజిట్ అకౌంట్ నేషనల్ సేవింగ్ టైమ్ డిపాజిట్ అకౌంట్ జాతీయ పొదుపు నెలవారీ ఆదాయ ఖాతా సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ కిసాన్ వికాస్ పత్ర పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ సుకన్య సమృద్ధి ఖాతా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ 2023 వీటిల్లో పెట్టుబడులు పెట్టేందుకు మీకు అధీకృత ఏజెంట్లు మీకు సహాయం చేస్తారు. అయితే వారిపై పూర్తిగా ఆధారపడటం మంచిది కాదు. ఏదైనా నిర్ణయాలు తీసుకునే ముందు మీ పరిశోధన చేయండి లేదా ఆర్థిక సలహాదారుని సంప్రదించండి నేషనల్ స్మాల్ సేవింగ్స్ స్కీమ్స్ లో ఏదైనా ఖాతా ను మీరు వ్యక్తిగతంగా పోస్టాఫీసు/బ్యాంక్ బ్రాంచ్‌ను సందర్శించడం ద్వారా డబ్బును స్వయంగా జమ చేయవచ్చు. కిసాన్ వికాస్ పత్ర, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సుకన్య సమృద్ధి ఖాతా వంటి నిర్దిష్ట పథకాలకు ఆన్‌లైన్ డిపాజిట్లు చేసే సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఇప్పుడు ఏజెంట్ల ద్వారా పెట్టుబడి పెట్టే ముందు చేయాల్సిన, చేయకూడని అంశాలను పరిశీలిద్దాం. మొదటిగా ఏజెంట్ల సర్టిఫికెట్ ఆఫ్ అథారిటీ, ఏజెన్సీ చెల్లుబాటు తేదీని తనిఖీ చేయడం ద్వారా అధీకృత ఏజెంట్ల గుర్తింపును తెలుసుకోండి. దరఖాస్తు ఫారమ్‌ను మీరే పూరించండి. అయితే, ఏజెంట్ సహాయం/మార్గనిర్దేశం పొందవచ్చు. ఖాతా తెరవడం లేదా డిపాజిట్ చేయడం కోసం ఏజెంట్‌కు డబ్బు/పరికరాలు, పత్రాలను అందజేసేటప్పుడు ఏజెంట్ పూర్తి చేసిన అధీకృత రసీదులను అడగండి. ఈ రసీదు పుస్తకాలను ప్రభుత్వం ఏజెంట్లకు సరఫరా చేస్తుంది. ఖాతా మెచ్యూరిటీ అయ్యే వరకు కౌంటర్‌ఫాయిల్‌లను భద్రపరచండి. రసీదు ఇవ్వడానికి ఏజెంట్ తిరస్కరిస్తే ఆ విషయాన్ని పోస్టల్/జిల్లా అధికారులకు నివేదించండి. పెట్టుబడి పెట్టిన తేదీ నుంచి 10 రోజులలోపు ఏజెంట్ నుంచి పాస్‌బుక్ అందినట్లు నిర్ధారించుకోండి. పెట్టుబడి పెట్టిన తేదీ నుంచి 10 రోజులలోపు ఏజెంట్ నుంచి పాస్‌బుక్ అందని పక్షంలో, అపాయింటింగ్ అథారిటీకి ఫిర్యాదు చేయండిబీ ప్రాంతీయ డైరెక్టర్, నేషనల్ సేవింగ్స్ ఇన్స్టిట్యూట్‌బీ పోస్ట్‌మాస్టర్ కు ఫిర్యాదు చేయొచ్చు. పాస్‌బుక్‌లో పేర్కొన్న మొత్తం, తేదీ, స్టాంపు, సంతకం మొదలైన వాటి కచ్చితత్వాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత పోస్టాఫీసు నుంచి ధ్రువీకరించుకోండి. అనధికార వ్యక్తికి నగదును అందజేయవద్దు లేదా ఏజెంట్‌కు అనుకూలంగా చెక్కును జారీ చేయవద్దు. రూ. 10,000, అంతకంటే ఎక్కువ పెట్టుబడులకుబీ సంబంధిత పోస్ట్‌మాస్టర్‌కు అనుకూలంగా మాత్రమే చెక్కును జారీ చేయండి. మెచ్యూరిటీకి ముందు ఉపసంహరణ ఫారమ్‌ను పూరించవద్దు/సంతకం చేయవద్దు.



## ఇకపై జొమాటోలో ఆ సేవలు కూడా.. పేటీఎంతో రూ. 2వేల కోట్ల ఢీల్..

ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో తన సేవలను విస్తరిస్తోంది. కేవలం ఫుడ్ డెలివరీకి మాత్రమే పరిమితం కాకుండా ఇతర సేవలను సైతం యూజర్లకు అందిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే జొమాటో యూపీఐ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. జొమాటో నుంచి ఫుడ్ ఆర్డర్ చేసుకొని పేమెంట్ కోసం ఇతర పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకునే పనిలేకుండా నేరుగా జొమాటోలోనే పేమెంట్ చేసేందుకు గాను ఈ సేవలను తీసుకొచ్చినట్లు కంపెనీ ప్రకటించింది. ఇదిలా ఉంటే తాజాగా మరో కొత్త సర్వీస్‌ను జొమాటో పరిచయం చేసింది. జొమాటోలో ఇకపై టికెట్లు, ఈవెంట్ టికెట్లు బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా పేటీఎంతో జొమాటో ఢీల్ చేసుకుంది. పేటీఎంకు చెందిన మూవీ, ఈవెంట్స్ టికెటింగ్ వ్యాపారాలను కొనుగోలు చేయనున్నట్టు జొమాటో ఓ ప్రకటన విడుదల చేసింది. ఎంటర్‌టైన్‌మెంట్ సెగ్మెంట్‌లోనూ సత్తా చాటేందుకు జొమాటో ఈ నిర్ణయం తీసుకుంది. మూవీ, ఈవెంట్స్ టికెటింగ్ వ్యాపారాలను 244.2 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేయనున్నట్లు జొమాటో ప్రకటించింది. మన కరెన్సీలో చెప్పాలంటే సుమారు రూ. 2వేల కోట్లకు పైమాటే. కాగా ప్రస్తుతం ఈ రంగంలో బుక్‌మై షో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. అయితే లు, లైవ్ ఈవెంట్ల కోసం భారతదేశ ఆన్‌లైన్ టికెటింగ్ మార్కెట్‌లో పోటీనిచ్చేందుకే జొమాటో ఈ నిర్ణయం తీసుకుంది. టికెట్లను విక్రయించే 'టికెట్ న్యూ' ప్లాట్‌ఫామ్‌తో పాటు లైవ్ ఈవెంట్లకు టికెట్లను నిర్వహించే 'ఇన్‌సైడర్' ప్లాట్‌ఫామ్‌ని విక్రయించడం ద్వారా తన మార్కెట్ వాటాను పేటీఎం జొమాటోకు అప్పగించనుంది. ఈ కొనుగోలుతో వచ్చే రెండేళ్లలో నాన్ కోర్ వ్యాపారాల్లో ఆదాయం మూడు రెట్లు పెరుగుతుందని తమ షేర్ హోల్డర్స్‌కి లెటర్‌లో పేర్కొంది.




## ఉచితంగా నెట్‌ఫ్లిక్స్ సేవలు పొందే అవకాశం.. స్పెషల్ రీఛార్జ్ ప్లాన్స్

టెలికం కంపెనీల మధ్య నెలకొన్న పోటీ నేపథ్యంలో యూజర్లను ఆకర్షిస్తున్నాయి. ఇటీవల టెలికం కంపెనీలు రీఛార్జ్ ధరలను పెంచిన తర్వాత యూజర్లను అట్రాక్ట్ చేసే పనిలో పడ్డాయి. ఇందులో భాగంగానే రకరకాల ఆఫర్లను అందిస్తున్నాయి. ముఖ్యంగా ఓటీటీ ప్లాట్‌ఫామల వినియోగం పెరిగిన తర్వాత వారిని టార్గెట్ చేసుకొని రీఛార్జ్ ప్లాన్స్‌ను తీసుకొస్తున్నారు. ఇందులో భాగంగానే పలు టెలికం సంస్థలు నెట్‌ఫ్లిక్స్‌ను ఉచితంగా అందించే ప్లాన్స్‌ను అందిస్తున్నాయి. జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో నెట్‌ఫ్లిక్స్ ఉచితంగా లభిస్తున్న కొన్ని బెస్ట్ రీఛార్జ్ ప్లాన్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. నెట్‌ఫ్లిక్స్ ఉచితంగా లభిస్తున్న రీఛార్జ్ ప్లాన్స్‌లో రూ. 1299 ఒకటి. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే నెట్‌ఫ్లిక్స్‌ను ఉచింగా యాక్సెక్ చేసుకోవచ్చు. 84 రోజుల వ్యాలిడిటీ లభించే ఈ ప్లాన్ ద్వారా అన్‌లిమిటెడ్ కాల్స్ పొందొచ్చు. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పొందొచ్చు. మొత్తం 168 జీబీ డేటా పొందొచ్చు. రోజుకు 2 జీబీ డేటా పొందొచ్చు. ఇక జియో అందిస్తోన్న మరో బెస్ట్ రీఛార్జ్ ప్లాన్స్‌లో రూ. 1799 ఒకటి. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 84 రోజులు వ్యాలిడిటీ లభిస్తుంది. రోజూ 3 జీబీ డేటా పొందొచ్చు. అలాగే అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లతో పాటు నెట్‌ఫ్లిక్స్ ఉచితంగా యాక్సెస్ చేసుకోవచ్చు. నెట్ ఫ్లిక్స్ ఉచితంగా పొందేలా వొడాఫోన్ ఐడియా రూ. 1198 రీఛార్జ్ ప్లాన్‌ను అందిస్తోంది. ఈ ప్లాన్ మొత్తం 70 రోజుల పాటు 2 జీబీ డేటా పొందొచ్చు. మొత్తం 140 జీబీ పొందొచ్చు. అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పొందొచ్చు. వొడాఫోన్ ఐడియా అందిస్తోన్న మరో బెస్ట్ ప్లాన్ రూ. 1599. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 84 రోజులపాటు వ్యాలిడిటీ లభిస్తోంది. ప్రతీ రోజూ 2.5 జీబీ డేటా పొందొచ్చు. మొత్తం 210 జీబీ డేటా లభిస్తుంది. ఇక ఉచిత నెట్‌ఫ్లిక్స్‌తో పాటు.. అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు పొందొచ్చు. ఇక ఎయిర్ కూడా ఇలాంటి ఒక ప్లాన్‌ను అందిస్తోంది.ఎయిర్‌టెల్ తీసుకొచ్చిన రూ.1798 ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 84 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. ప్రతీ రోజూ 3 బీబీ డేటా చొప్పున మొత్తం 252 జీబీ డేటా పొందొచ్చు. అన్‌లిమిటెడ్ కాల్స్‌తో పాటు, రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లుపొందొచ్చు. అన్‌లిమిటెడ్ 5జీ డేటా లభిస్తుంది.



# వ్యాపారం

## పర్యాటకులకు శుభవార్త.. ఈ దేశం భారత్ సహా 35 దేశాలకు వీసా రహిత యాక్సెస్




ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్లాలంటే వీసా తప్పనిసరి కావాల్సిందే. అయితే ఇటీవల కాలం నుంచి కొన్ని దేశాలు ఎలాంటి వీసా లేకుండా అనుమతి ఇస్తున్నాయి. భారత్‌తో పాటు ఇతర దేశాలకు కొన్ని దేశాలు వీసా రహిత సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్‌లకు పొరుగు దేశం శ్రీలంక శుభవార్త అందించింది. పొరుగు దేశం భారతదేశంతో సహా అనేక దేశాల నివాసితులకు వీసా రహిత ప్రాప్యతను ప్రకటించింది. ప్రకటన ప్రకారం, భారతీయ ప్రయాణికులు త్వరలో శ్రీలంకకు వీసా రహిత సదుపాయం పొందవచ్చు. 35 దేశాలు 6 నెలల పాటు ప్రయోజనం వార్తా సంస్థ పీటీఐ నివేదిక ప్రకారం, శ్రీలంక 35 దేశాలకు వీసా-రహిత యాక్సెస్ సౌకర్యాన్ని ప్రకటించింది. వాటిలో భారతదేశం, అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు ఉన్నాయి. అక్టోబరు 1 నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. 6 నెలల పాటు దీన్ని అమలు చేస్తున్నారు. ఈ మార్పును శ్రీలంక ప్రభుత్వ క్యాబినెట్ ఆమోదించింది. భారత్‌తో పాటు ఈ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు ప్రయోజనం శ్రీలంక పర్యాటక మంత్రి హరీన్ ఫెర్నాండోను ఉటంకిస్తూ నివేదిక పేర్కొంది. అక్టోబర్ 1 నుండి 35 దేశాల నుండి వచ్చే ప్రయాణికులకు శ్రీలంకకు వెళ్లడానికి వీసా అవసరం లేదు. ఈ పాలసీ ఆరు నెలలపాటు ఉంటుంది. చైనా, జర్మనీ, నెదర్లాండ్స్, బెల్జియం, స్పెయిన్, ఆస్ట్రేలియా, డెన్మార్క్, పోలాండ్, కజకిస్తాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, నేపాల్, ఇండోనేషియా, రష్యా, థాయిలాండ్‌తోపాటు భారతదేశం, అమెరికా, బ్రిటన్‌లు ఈ సదుపాయాన్ని పొందబోతున్నాయి. ఈ దేశాల పాస్‌పోర్ట్ హోల్డర్‌లకు కూడా సౌకర్యం.. మలేషియా, జపాన్, ఫ్రాన్స్, కెనడా, చెక్ రిపబ్లిక్, ఇటలీ, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, ఇజ్రాయెల్, బెలారస్, ఇరాన్, స్వీడన్, దక్షిణ కొరియా, ఖతార్, ఒమన్, బహ్రెయిన్, న్యూజిలాండ్ వంటి దేశాల పాస్‌పోర్ట్ హోల్డర్లు కూడా వీసా రహిత యాక్సెస్‌ను పొందబోతున్నారు. భారతీయులు వీసా ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు శ్రీలంక ఆర్థిక వ్యవస్థకు పర్యాటకం చాలా ముఖ్యమైనది. ప్రతి సంవత్సరం వివిధ దేశాల నుంచి లక్షలాది మంది పర్యాటకులు శ్రీలంకను సందర్శించేందుకు వస్తుంటారు. కొద్ది రోజుల క్రితమే శ్రీలంకలో వీసా ఆన్ అరైవల్ ఫీజును పెంచి వివాదం సృష్టించారు. శ్రీలంకలో వీసా ఆన్ అరైవల్ సౌకర్యాన్ని ఒక విదేశీ కంపెనీ నిర్వహిస్తోంది. భారతదేశం, చైనా, జపాన్, రష్యా, మలేషియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా నుండి ప్రజలు ఎటువంటి రుసుము లేకుండా శ్రీలంకలో పర్యాటక వీసాలు పొందుతారు.

## దేశంలోని 540 నగరాల్లో టాటా ఛార్జింగ్ స్టేషన్లు.. ఈ కంపెనీలతో ఒప్పందం



టాటా మోటార్స్ తన ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ సదుపాయాలను మరింత మెరుగుపరచడానికి డెల్టా ఎలక్ట్రానిక్స్ ఇండియా, థండర్‌ప్లస్ సొల్యూషన్స్ అనే రెండు ప్రముఖ కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలను మరింత సౌకర్యవంతంగా, అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యం పెట్టుకుంది టాటా. భారతదేశంలోని ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలలో ఒకటైన టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో కూడా వేగంగా అభివృద్ధి చెందుతోంది. సంస్థ ఈ భాగస్వామ్యంలో 540 కొత్త ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లు స్థానించింది. తద్వారా ఎలక్ట్రిక్ వాహనాల యజమానులు ఛార్జింగ్ కోసం ఆప్షన్లను పొందవచ్చు. అలాగే వారు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎక్కువ దూరం ప్రయాణించవచ్చు. 50కి పైగా నగరాల్లో ఛార్జింగ్ స్టేషన్లు: టాటా మోటార్స్ ఈ ఛార్జింగ్ పాయింట్ 50 కంటే ఎక్కువ నగరాల్లో ఇన్‌స్టాల్ కానున్నాయి. ఈ నగరాల్లో 540కి పైగా ఛార్జింగ్ స్టేషన్లు నిర్మించనున్నారు. టాటా మోటార్స్ ప్రకారం, ఈ ఛార్జింగ్ స్టేషన్ ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, పూణె, కొచ్చి వంటి నగరాల్లో ఏర్పాటు కానున్నాయి. అలాగే, ఎక్కువగా ఉపయోగించే రూట్లలో ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించనున్నట్లు టాటా మోటార్స్ తన ప్రకటనలో తెలిపింది. తద్వారా కస్టమర్లు మరింత సౌలభ్యాన్ని పొందుతారు. ఈవీ వాహనాలకు మరింత ప్రోత్సాహాన్ని పొందుతారు. మీరు ఈ విధంగా ప్రయోజనం పొందుతారు. ఛార్జింగ్ సౌకర్యాలు సులభంగా అందుబాటులో ఉంటే, ఎక్కువ మంది ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను అవలంబిస్తారు. ఇది కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా దేశ ఇంధన భద్రతను కూడా పెంచుతుంది. అదనంగా, టాటా మోటార్స్ రాబోయే సంవత్సరాల్లో కొత్త ఈవీ మోడళ్లను విడుదల చేయడానికి తన ఈవీ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరింపజేస్తుందని, ఇది భారతీయ కస్టమర్ల అవసరాలు, ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడుతుందని స్పష్టం చేసింది. ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను ప్రోత్సహించడానికి ప్రాధాన్యత ఈ భాగస్వామ్యం ద్వారా టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను ప్రోత్సహించడమే కాకుండా, స్థిరమైన, పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దశ భారతదేశ ఈవీ పరిశ్రమ అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, దేశం క్లీన్, గ్రీన్ ఎనర్జీ వైపు పయనించడంలో సహాయపడుతుందని కంపెనీ విశ్వసిస్తోంది.

# ఎండు కొబ్బరి ముక్క తింటే ఎన్ని లాభాలో తెలుసా..?



## నరాల సమస్యతో బాధపడే వారికి వరంలాంటిది..!

మన దేశంలో ఎండు కొబ్బరిని అందరి ఇళ్లలో వాడుతుంటారు. పూజ నుండి వంట వరకు అన్నింటిలో కొబ్బరిని ఉపయోగిస్తుంటారు. ఎండు కొబ్బరిని అనేక వంటకాల తయారీలో కూడా వాడుతుంటారు. ఇది తినడానికి చాలా రుచిగా కూడా ఉంటాయి. ఎండు కొబ్బరిని ఉపయోగించడం వల్ల ఆహారం రుచి పెరగడమే కాకుండా, దాని వినియోగం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం అంటున్నారు నిపుణులు. ఎండుకొబ్బరిలో ప్రొటీన్లు, విటమిన్లు, ఐరన్, కాల్షియం, మాంగనీస్, సెలీనియం, కాపర్, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం వంటి మూలకాలు ఉంటాయి. అంతే కాకుండా ఎండు కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కూడా ఉన్నాయి. అయితే ఎండు కొబ్బరి తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. కాబట్టి ఎండు కొబ్బరి వల్ల కలిగే లాభనష్టాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. రుచి కోసం ఎండు కొబ్బరి తినడం వల్ల మనకు అనేక ప్రయోజనాలు లభిస్తుండగా, ఏదైనా తీపి లేదా కూరగాయలలో ఎండు కొబ్బరిని కలుపుకుంటే, దాని రుచి మరింత పెరుగుతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది. అనేక ఇతర వ్యాధులు కూడా నయమవుతాయి. ఇందులో ఉండే గుణాలు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా శరీరంలోని కొలెస్ట్రాల్ ను కూడా సులభంగా తగ్గిస్తాయి. కాబట్టి తరచుగా అనారోగ్య సమస్యలతో బాధపడేవారు తప్పకుండా ఎండుకొబ్బరిని ఆహారంలో తీసుకోవాలి. ఎండు కొబ్బరి తినడం వల్ల మన మెదడుకు పదును పెట్టడంతోపాటు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అదే సమయంలో మన హృదయాన్ని బలపరుస్తుంది. కొబ్బరిని పొడి లేదా తడి రూపంలో తినడం వల్ల మన జుట్టుకు చాలా మేలు జరుగుతుంది. ఎండు కొబ్బరిని తినడం వల్ల మన జుట్టు రాలడం ఆగిపోతుంది. క్రమంగా కొత్త జుట్టు పెరిగేలా చేస్తుంది. పైగా మీ కేశాలు నల్లటి రంగులో నిగనిగలాడుతుంది. అంతేకాదు.. ఎముకలకు కూడా మేలు చేస్తుంది. ఎండు కొబ్బరి తినడం వల్ల మన ఎముకలకు బలం చేకూరడంతో పాటు వాటిలోని పగుళ్ల శబ్దం కూడా ఆగుతుంది. ఎండు కొబ్బరి తినడం తలనొప్పితో బాధపడేవారికి చాలా మేలు చేస్తుంది. ఎండు కొబ్బరి తింటే మన శరీరానికి బలం చేకూరుతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. అందువల్ల, మీరు ఎండు కొబ్బరిని తీసుకుంటే, అది శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది. దీని వల్ల రక్తం లేకపోవడం పోతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. అందువల్ల, మీరు ఎండు కొబ్బరిని తీసుకుంటే, అది మీ రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. దీని వల్ల మీరు ఎలాంటి వైరల్ ఇన్ఫెక్షన్‌ను చాలా వరకు నివారించవచ్చు. ఎండిన కొబ్బరిని తీసుకోవడం గుండెకు చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎండు కొబ్బరిని రోజూ తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే, ఎండు కొబ్బరి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగ్గా ఉంచడంలో సహాయపడుతుంది. ఎందుకంటే ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఎండు కొబ్బరిని ఎక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల బరువు పెరుగుతారు. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారు కొబ్బరిని ఎక్కువ మోతాదులో తినకూడదు. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో చాలా పోషకాలు ఉంటాయి. అందువల్ల, మీరు దీనిని తీసుకుంటే, ఇది రొమ్ము క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్ కణాలు ఏర్పడకుండా నిరోధించవచ్చు. ఎండు కొబ్బరిని ఎక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వస్తాయి. మీరు దానిని ఎక్కువగా తీసుకుంటే, వాంతులు, కడుపు నొప్పికి కారణం కావచ్చు. ఎండిన కొబ్బరిని అధికంగా తీసుకోవడం మధుమేహ రోగులకు మంచికాదంటున్నారు. ఎందుకంటే కొబ్బరిలో చాలా చక్కెర ఉంటుంది. కాబట్టి దీన్ని తీసుకోవడం వల్ల షుగర్ లెవల్స్ పెరుగుతాయి.



## కొవ్వే కదా అని లైట్ తీసుకోకండి.. తేడా కొడితే మీ పని అంతేనట.. బీకేర్‌ఫుల్..



కొలెస్ట్రాల్ సమస్య ఇప్పుడు ప్రతీ ఇంట్లో కూడా పట్టిపీడిస్తోంది. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఈ సమస్యకు ప్రధాన కారణం.. బయటి ఆహారం ఎంత ఎక్కువగా తీసుకుంటే అంత చెడ్డ కొలెస్ట్రాల్ ఉంటుంది. ప్రతీరోజూ వ్యాయామం చేయకపోతే ప్రమాదం ఎక్కువ అవుతుంది. అయితే, మీ జీవక్రియ బాగా ఉంటే, కొలెస్ట్రాల్ స్థాయిల గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కానీ చెడు కొలెస్ట్రాల్ లెవెల్స్ ఒక్కసారిగా పెరిగితే ప్రమాదం కొనితెచ్చున్నట్లే.. చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, అది రక్తనాళాల్లో పేరుకుపోతుంది. దీని వల్ల రక్తనాళాలు ఇరుకుగా మారి రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. ఇది రక్తపోటు, గుండె జబ్బులు ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక కొలెస్ట్రాల్ గుండె జబ్బుల ప్రమాదాన్ని రెట్టింపు చేస్తుంది. చెడు కొలెస్ట్రాల్ అధిక స్థాయిలు ఏ సమయంలోనైనా గుండె సమస్యలకు దారితీస్తుంది. కానీ చాలా తక్కువ మందికి అధిక కొలెస్ట్రాల్, దాని ప్రభావాల గురించి తెలుసు.. అందుకే గుండెపోటు, పక్షవాతం లాంటి ప్రమాదకర వ్యాధులకు దూరంగా ఉండాలంటే.. కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించుకోవాలి. అధిక కొలెస్ట్రాల్ లక్షణాలు: కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, హృదయ స్పందన రేటు పెరుగుతుంది. కొంచెం గట్టిగా నడిచినా, మెట్లు ఎక్కినా ఊపిరి పీల్చుకునేందుకు ఆయాసంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో చాలా మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది. కళ్ల కింద ఉబ్బడం కొలెస్ట్రాల్ లక్షణం. కొన్నిసార్లు పసుపు రంగు మచ్చల్లాంటివి కళ్ళపై కనిపిస్తాయి. ఇది హై కొలెస్ట్రాల్ లక్షణం కూడా కొలెస్ట్రాల్ స్థాయి పెరిగితే శరీరంలో రక్త ప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. ఒక్కసారిగా నరాలు మొద్దుబారిపోతాయి. ఆ సమయంలో కాళ్లకు చలనం కూడా అనిపించదు.. ఛాతీ నొప్పి, ఛాతీలో ఒత్తిడి, అసౌకర్యం కొలెస్ట్రాల్ పెరిగిన లక్షణాలు. ధమనులలో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల అడ్డంకులు ఏర్పడతాయి. దీనివల్ల గుండె జబ్బులు పెరుగుతాయి. కొలెస్ట్రాల్ వల్ల కూడా అధిక రక్తపోటు రావచ్చు. అధిక రక్త కొలెస్ట్రాల్ స్థాయిలు ధమనులపై ఒత్తిడిని కలిగిస్తాయి. దీని కారణంగా, రక్త ప్రసరణ చెదిరిపోతుంది.. రక్తపోటు పెరుగుతుంది. కొలెస్ట్రాల్ వల్ల దృష్టి మసకబారుతుంది. కళ్లు దెబ్బతింటాయి. అందుకే.. ఇలాంటి పరిస్థితిని తెచ్చుకోవద్దంటున్నారు ఆరోగ్య నిపుణులు.. కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకునే మార్గాలు.. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి తినడం, మద్యం త్రాగటం నియంత్రించాలి. వీధి ఆహారాన్ని తరచుగా తినవద్దు. నూనె, కొవ్వు రహిత ఆహారానికి దూరంగా ఉండాలి. కూరగాయలు, ధాన్యాలు, గింజలు, పండ్లు, చేపలు మొదలైన వాటిని ఎక్కువగా తినండి. తినడం, త్రాగడంతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. తగినంత నిద్ర పొందండి, ఒత్తిడిని తగ్గించుకోండి. ప్రతి 3 నెలలకు రక్త పరీక్ష చేయడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలను తనిఖీ చేయండి. ఇవన్నీ కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతాయి..

## ఇంత చిన్న వెల్లుల్లి ఏం చేస్తుందనుకుంటే పొరపాటే..! ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఇలా తింటే..

## ఎన్నో రోగాలకు దివ్యౌషధం..!!

అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగించే ఆహార పదార్థాలలో వెల్లుల్లి ఒకటి. వెల్లుల్లిలో విటమిన్లు సి, కె, ఫోలేట్, మాంగనీస్, సెలీనియం, ఫైబర్, ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, కాపర్, పొటాషియం వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లి రసాన్ని ఉదయాన్నే పరగడుపున తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి రసం తాగితే ఎన్నో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చునని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. జీర్ణ సమస్యలు రాకుండా ఉండాలంటే వెల్లుల్లిని ఆహారంలో చేర్చుకోవడం మంచిది. వెల్లుల్లి రసం తాగడం వల్ల పొట్టలోని ఇన్ఫెక్షన్లు, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు రాకుండా కాపాడుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలకు చెక్ పెడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి రసం తాగడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ కూడా అదుపులో ఉంటుంది. వెల్లుల్లిలోని అల్లిసిన్ దీనికి సహాయపడుతుంది. అధిక కొలెస్ట్రాల్ తో బాధపడేవారు ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ సమయంలో వెల్లుల్లి రసం తాగాలి. ఇది చెడు కొలెస్ట్రాల్‌తో పోరాడి టాక్సిన్స్ ను బయటకు పంపిస్తుంది. వెల్లుల్లి రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యానికి మంచిది. రోజూ వెల్లుల్లి రసం తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె సంబంధిత వ్యాధులు దూరం అవుతాయి. ఇవి రక్తపోటును తగ్గించడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. వెల్లుల్లి శ్వాసకోశసమస్యలనుండికూడాఉపశమనంకలిగిస్తుంది.వెల్లుల్లిలోఉండే యాంటీబ్యాక్టీరియల్ భాగాలు దీనికి సహాయపడతాయి. ఉదయాన్నే వెల్లుల్లి రసాన్ని తాగడం వల్ల ఇన్ఫెక్షన్లు, వ్యాధులు దూరం అవుతాయి. ఇమ్యూనిటీ పెరుగుతుంది. వెల్లుల్లి కాలేయ ఆరోగ్యానికి కూడా మంచిది. కాలేయం, మూత్రపిండాలు, రక్తప్రవాహానికి అద్భుతమై డిటాక్స్ ఫైయర్ గా పనిచేస్తుంది. మెదడు పనితీరును రక్షిస్తుంది. జ్ఞాపకశక్తి, దృష్టి మెరుగుపరుస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లిని తినడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌ల రిస్క్ తగ్గుతుంది. బరువు తగ్గడానికి వెల్లుల్లి రసాన్ని కూడా ఆహారంలో చేర్చుకోవచ్చు. శరీరంలోని అనవసరమైన క్యాలరీలను కరిగించడంలో ఇవి మేలు చేస్తాయి. వెల్లుల్లి రసం బరువును తగ్గించడంలో సహాయపడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు ఉండే వెల్లుల్లి రసం తాగడం వల్ల మెదడు ఆరోగ్యానికి కూడా మంచిది. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లి రసం తాగడం వల్ల చర్మ ఆరోగ్యానికి కూడా మంచిది. చర్మ ఆరోగ్యానికి కూడా వెల్లుల్లి తోడ్పడుతుంది. మొటిమలను, మంటను తగ్గిస్తుంది.



## ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారాన్ని ఎన్ని గంటల తర్వాత తినకూడదు?



బిజీగా ఉన్న నగర జీవితంలో ఆకలితో ఉన్నప్పుడు తాజా ఆహారాన్ని తయారు చేయడం సాధ్యం కాదు. అయితే ఆహారం త్వరగా చెడిపోకుండా ఉండేందుకు, ఎక్కువ సేపు పాడైపోకుండా ఉండేందుకు ఆహారాన్ని తయారు చేసి ఫ్రిజ్‌లో పెట్టే వారు చాలా మందే ఉన్నారు. సమయాన్ని ఆదా చేయడానికి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేస్తారు. రిఫ్రిజిరేటర్‌లో మిగిలిపోయిన వాటిని నిల్వ చేయడం ఉద్దేశ్యం ఆహారం వృధా కాకుండా నిరోధించడం లేదా సమయాన్ని ఆదా చేయడం. ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారం పాడైపోకుండా కాపాడుతుంది. గడ్డకట్టడం ఉద్దేశ్యం ఏమిటంటే, కూరగాయలు, పండ్లు పాడవకుండా నిరోధించడం ద్వారా ఎక్కువ కాలం తాజాగా ఉంచడం. కానీ అన్ని ఆహారాలు ఎక్కువ కాలం ఉండవు. అందుకే రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన ఆహారం, పండ్లు, కూరగాయలు ఎంత సమయం తర్వాత తినకూడదో తెలుసుకుందాం. రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన వండిన అన్నం 1 రోజులోపు తినాలి. మీరు వండిన ఆహారాన్ని రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే అది తక్కువ సమయంలో దాని పోషక విలువలను కోల్పోతుంది. అయితే ఆయుర్వేదం ప్రకారం, అన్ని వండిన ఆహారం కేవలం 6 గంటల పాటు పోషకాహారాన్ని అందిస్తుంది. ఆ తర్వాత దానిలోని పోషకాలు కోల్పోతాయి. మీరు గోధుమ రోటీని రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే, అది రోటీని తయారు చేసిన 12 నుండి 14 గంటలలోపు తినాలి. అలా చేయకపోతే, అందులో ఉన్న పోషకాలు పోతాయి. ఎక్కువసేపు ఫ్రిజ్‌లో ఉంచిన బ్రెడ్‌ను తిన్నట్లయితే మీకు కడుపు నొప్పిని కూడా వస్తుంది మీరు మీ భోజనంలో మిగిలిపోయిన పప్పును చెడిపోకుండా ఉండటానికి మీరు ఫ్రిజ్‌లో ఉంచినట్లయితే, దానిని 2 రోజులలోపు తినండి. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉంచిన పప్పును 2 రోజుల తర్వాత తింటే, కడుపులో గ్యాస్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. చాలా సార్లు మనం ఫ్రిజ్‌లో ఒక వారం పాటు పండ్లు, కూరగాయలను నిల్వ చేస్తాము. అయితే ఎక్కువ కాలం పాటు ఫ్రిజ్‌లో ఉంచిన కూరగాయలు, పండ్లు వాటి పోషక విలువలను కోల్పోతాయి. వాటిని తినడం వల్ల మీకు మంచి కంటే హాని ఎక్కువ. కూరగాయలు, పండ్లు కోయకుండా 3 నుండి 4 రోజులు ఉంచవచ్చు. అంతకంటే ఎక్కువ రోజులు ఉంచకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మీరు తరిగిన పండ్లను శీతలీకరించినట్లయితే, అది 6 గంటలలోపు తినాలి. లేకుంటే అది మీ అనారోగ్యానికి కారణమవుతుంది. బియ్యం, పప్పు, రోటీ లేదా రోటీ పిండి వంటి ఏదైనా రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన తర్వాత అన్ని వస్తువులను పూర్తిగా పాత్రతో కప్పి, వండిన ఆహారాన్ని 24 గంటల్లోపు తినాలి.

## ఈ గింజాలు ఆరోగ్యానికి వరం కంటే ఎక్కువ..! రోజూ తింటే రోగాలు మాయం.. మెరిసే, అందమైన చర్మం మీ సొంతం..!!



జాక్‌ఫ్రూట్ లాగానే జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. జాక్‌ఫ్రూట్ గింజల్లో ఐరన్, కాల్షియం, కాపర్, పొటాషియం వంటి అంశాలు ఉంటాయి. ఇవి అనేక వ్యాధులను నయం చేయడంలో సహాయపడతాయి. జాక్‌ఫ్రూట్ గింజలలో రిబోఫ్లావిన్, థయామిన్ కూడా ఉన్నాయి. ఇవి కళ్ళు, చర్మం, జుట్టుకు మేలు చేస్తాయి. అనేక పోషకాలు పుష్కలంగా ఉన్న పనస గింజలు జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడతాయి. రక్తహీనతను అధిగమించడంలో జాక్‌ఫ్రూట్ గింజలు కూడా ప్రయోజనకరంగా పరిగణించబడతాయి. కావున, జాక్‌ఫ్రూట్ విత్తనాలను ఖచ్చితంగా తినండి. రక్తహీనతను అధిగమించడానికి జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజలు ఇనుముకు మంచి మూలం. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం వల్ల శరీరంలో ఐరన్ పరిమాణం పెరుగుతుంది. ఇది రక్తహీనతను దూరం చేస్తుంది. జాక్‌ఫ్రూట్ గింజల్లో మంచి మొత్తంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం కళ్ళకు చాలా ప్రయోజనకరం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజల్లో విటమిన్ ఎ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అందువల్ల, కంటి చూపును మెరుగుపరచడానికి, మీరు తప్పనిసరిగా జాక్‌ఫ్రూట్ గింజలను తినాలి. రోగ నిరోధక శక్తిని పెంచడంలో జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ సీడ్స్‌లో యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసే విటమిన్ సి గుణాలు ఉంటాయి. దీని కారణంగా రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. బూస్ట్ జాక్‌ఫ్రూట్ గింజల్లో కార్బోహైడ్రేట్లు మరియు విటమిన్ బి కాంప్లెక్స్ ఉంటాయి. ఇవి మీ ఆహారాన్ని శక్తిగా మార్చడంలో మరియు ఆరోగ్యకరమైన జీవక్రియను పెంచడంలో సహాయపడతాయి. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం ద్వారా మలబద్ధకం, కడుపు సంబంధిత సమస్యలు నయమవుతాయి.

## మధుమేహుల ఆరోగ్యంపై సబ్జా గింజల మ్యాజిక్..లాభాలు మామూలుగా లేవుగా!!

జీవనశైలి సరిగ్గా లేకపోతే, శరీరంలో అనేక వ్యాధులు రావడం ప్రారంభమవుతాయి. అలసట, అనారోగ్యం ఒక వ్యక్తిని ఒత్తిడికి గురి చేస్తుంది. చెడు ఆహారపు అలవాట్లు, అస్తవ్యస్థమైన జీవనశైలి కారణంగా అనేక రోగాలు ప్రజలను వెంటాడుతున్నాయి. ప్రస్తుతం చాలా మంది ప్రజలు మధుమేహం, మలబద్ధకం వంటి ఆరోగ్య సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. మధుమేహం రావడం సర్వసాధారణం. నీరు, ఫైబర్ లేకపోవడం వల్ల మలబద్ధకం సమస్య ఏర్పడుతుంది. ఇటువంటి సమస్యలను తగ్గించడానికి లేదా ఉపశమనం పొందడానికి ఇంటి నివారణలు చక్కటి ఫలితాలను ఇస్తాయి. ఆయుర్వేదంలో చాలా ప్రయోజనకరంగా భావించే సబ్జా గింజలతో మధుమేహం, మలబద్ధకాన్ని ఎలా నివారించవచ్చో తెలుసుకుందాం.. మధుమేహం నయం కాదు. అయితే, కొన్ని ఇంటి చిట్కాలు, ఆయుర్వేద ఔషధాలు తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. సబ్జా విత్తనాల్లో ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉన్నాయి. మీరు తరచుగా మలబద్ధకంతో బాధపడుతుంటే, ప్రతిరోజూ సబ్జా గింజలను తినండి. ఇందులో పీచు పుష్కలంగా ఉండి మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. మధుమేహంతో బాధపడేవారు సబ్జా గింజలను తీసుకోవచ్చు. వీటిని మీరు తాగే నీళ్లలో నానబెట్టుకుని తాగటం ఉత్తమం. ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగటం వల్ల ఫలితం ఉంటుంది. శరీరంలోని బ్లడ్ షుగర్ లెవెల్‌ను కంట్రోల్‌లో ఉంచడంలో సహాయపడుతుంది. తక్కువ నీరు త్రాగడం, సరైన జీవనశైలి కారణంగా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వస్తుంది. సబ్జా గింజలు వీలైనంత ఎక్కువ నీరు త్రాగడమే కాకుండా మూత్రనాళ ఇన్ఫెక్షన్లను కూడా నయం చేస్తాయి.

# ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మీరాబాయి అద్భుతం

వెయిట్ లిఫ్టింగ్ ప్రపంచ ఛాంపియన్ షిప్?లో భారత స్టార్ మహిళా వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను అద్భుత ప్రదర్శన చేసింది. 48 కిలోల విభాగంలో మీరాబాయి చాను రజత పతకాన్ని గెలుచుకుంది. నార్వేలో జరిగిన ప్రతిష్టాత్మక పోటీలో మీరాబాయి చాను మొత్తం 199 కిలోల( స్నాచ్ లో 84 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 115 కిలోలు) బరువు ఎత్తింది. గతంలో రెండు సార్లు మెడల్ సాధించిన ఈ టోర్నమెంట్?లో ఇప్పుడు మరోసారి అదరగొట్టింది. మహిళల 48 కిలోల విభాగంలో స్వర్ణాన్ని కోల్పోయి, వెండి పథకంతో ముగించింది. మీరాబాయి స్నాచ్‌లో తన మొదటి ప్రయత్నంలోనే 84 కిలోలు ఎత్తింది. అయితే, తర్వాత రెండు లిఫ్ట్‌లను 87 కిలోల వద్ద తడబడింది. దీంతో ఆమె పోడియం ఫినిషింగ్ కోసం పోటీలో ఉండటానికి క్లీన్ అండ్ జెర్క్‌లో 110 కిలోలకు పైగా వెయిట్? చేయాల్సి వచ్చింది. అయితే మీరాబాయి క్లీన్ అండ్ జెర్క్‌లో రాణించింది. 109 కిలోల బరువుతో ప్రారంభించి, 112 కిలోలకు మెరుగుపడి, 115 కిలోల లిఫ్ట్‌తో ముగించింది. ఈవిధంగా ఆమె మొత్తం 199 కిలోల బరువు ఎత్తి సిల్వర్? సొంతం చేసుకుంది. ఉత్తర కొరియాకు చెందిన రి సాంగ్-గమ్ 213 కిలోలు ఎత్తి వరల్డ్ రికార్డు సాధించి, గోల్డ్? మెడల్?ను గెలుచుకుంది. మీరాబాయికి 2022 ఎడిషన్‌లో విజయం తర్వాత ప్రస్తుతమిది రెండో సిల్వర్? మెడల్?. మొత్తం మీద, ఈ ఈవెంట్‌లో ఇది మీరాబాయ్?కు మూడో పతకం. 2017లో జరిగిన ఈ ఈవెంట్‌లో ఆమె బంగారు పతకాన్ని సాధించింది. ఓవరాల్‌గా ఆమెకు ఇది 14వ ఇంటర్?నెష్నల్? మెడల్?. తన ఖాతాలో 2021 టోక్యో ఒలింపిక్స్‌లో రజతం, కామన్వెల్త్ క్రీడల్లో మూడు పతకాలు (2018, 2022లో స్వర్ణం, 2014లో రజతం), కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లలో అయిదు (నాలుగు స్వర్ణాలు, ఒక రజతం), 2020 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఒక బ్రాంజ్? పతకం, 2016 దక్షిణాసియా క్రీడల్లో ఒక గోల్డ్? ఉన్నాయి. లవ్‌ప్రీత్ సింగ్, గతంలో కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత వెయిట్‌లిఫ్టర్‌గా, ఇప్పుడు పురుషుల బృందానికి నాయకత్వం వహిస్తున్నాడు. అజిత్ నారాయణ, అజయ్ బాబు వల్లూరి ఇద్దరూ కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణాలు గెలిచిన విజయవంతమైన క్రీడాకారులు. భారత బృందం (2025 వరల్డ్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్): మహిళలు:

మీరాబాయి చాను (48 కిలోలు)
కోయెల్ బార్ (53 కిలోలు)
బింద్యారాణి దేవి సోరోఖైబం (58 కిలోలు)
నిరుపమా దేవి సేరామ్ (63 కిలోలు)
హర్జిందర్ కౌర్ (69 కిలోలు)
వన్షిత వర్మ (86 కిలోలు)
మెహక్ శర్మ (86 కిలోలు పైన)

పురుషులు: రిషికాంత్ సింగ్ చనంబం (60 కిలోలు) ముత్తుపాండి రాజా (65 కిలోలు)
అజిత్ నారాయణ (71 కిలోలు)
అజయ్ బాబు వల్లూరి (79 కిలోలు)
అభిషేక్ నిపానే (88 కిలోలు)
దిల్బాగ్ సింగ్ (94 కిలోలు)
లవ్‌ప్రీత్ సింగ్ (110 కిలోలు పైన)



# కేఎల్ రాహుల్ కొత్త మైలురాయి



భారత టెస్ట్ జట్టు ఓపెనర్ కేఎల్ రాహుల్ తన అద్భుతమైన ఫామ్‌ను మరోసారి నిరూపించుకున్నాడు. అహ్మదాబాద్‌లో వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో నిలకడగా రాణించడం ద్వారా 2025లో టెస్ట్ క్రికెట్లో ఓపెనర్‌గా అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కొత్త మైలురాయిని చేరుకున్నాడు. ఈ సెంచరీతో కేఎల్ రాహుల్ ఇంగ్లాండ్‌కు చెందిన బెన్ డకెట్‌ను వెనక్కి నెట్టేశాడు. ఈ ఏడాది టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లాండ్ ఓపెనర్ బెన్ డకెట్, కేఎల్ రాహుల్ ఇద్దరూ పరుగుల వేటలో పోటీ పడ్డారు. అహ్మదాబాద్ టెస్ట్ ప్రారంభానికి ముందు 2025లో అత్యధిక పరుగులు చేసిన ఓపెనర్ల జాబితాలో డకెట్ 602 రన్స్‌తో మొదటి స్థానంలో ఉన్నాడు. అయితే వెస్టిండీస్‌పై రాహుల్ అద్భుతమైన సెంచరీ సాధించడంతో, అతను మొత్తం 649 పరుగులతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈప్రదర్శనతోరాహుల్ఈఏడాది అత్యుత్తమటెస్ట్ ఓపెనర్ అనిపించుకున్నాడు. అహ్మదాబాద్ టెస్ట్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి కేఎల్ రాహుల్ 114 బంతుల్లో 6 బౌండరీలతో 53 పరుగులతో క్రీజులో ఉన్నాడు. రెండో రోజు ఆటలోనూ అద్భుతంగా ఆడిన కేఎల్ రాహుల్, తన కెరీర్‌లో 11వ టెస్ట్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. కేఎల్ రాహుల్, యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌తో కలిసి తొలి వికెట్‌కు 68 పరుగులు జోడించి భారత్‌కు శుభారంభం అందించాడు. జైస్వాల్ 54 బంతుల్లో 7 బౌండరీలతో 36 పరుగులు చేసి ఔటయ్యాడు. ఓపెనర్‌గానేకాకుండా2025 సంవత్సరంలో టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో కూడా కేఎల్ రాహుల్ మూడో స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, జింబాబ్వేకు చెందిన సీన్ విలియమ్స్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు. ఈ ఏడాది ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో లీడ్స్‌లో 137 పరుగులు, లార్డ్స్‌లో సెంచరీ సాధించిన కేఎల్ రాహుల్.. తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించడం భారత టెస్ట్ జట్టుకు గొప్ప బలంగా మారింది.

# తొలి టెస్ట్‌కు కరువైన ప్రేక్షకాదరణ

భారత్ వర్సెస్ వెస్టిండీస్ మధ్య అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌కు ప్రేక్షకాదరణ కరువైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా స్టేడియం మొత్తం ఖాళీగా కనిపిస్తోంది. దాంతో భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)పై ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రేక్షకాదరణ లభించే స్టేడియాల్లో టెస్ట్ మ్యాచ్‌లు నిర్వహించాలని మండిపడుతున్నారు. గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 44.1 ఓవర్లలో 162 పరుగులకు కుప్పకూలింది. వెస్టిండీస్ బ్యాటర్లలో జస్టిన్ గ్రీవ్స్(48 బంతుల్లో 4 ఫోర్లతో 32), షైహోప్(36 బంతుల్లో 3 ఫోర్లతో 26), రోస్టన్ ఛేజ్(43 బంతుల్లో 4 ఫోర్లతో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్ నాలుగు వికెట్లు తీయగా.. జస్‌ప్రీత్ బుమ్రా మూడు వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్‌కు ఒక వికెట్ దక్కింది. భారత బౌలర్ల ధాటికి వెస్టిండీస్ ఇన్నింగ్స్ రెండు సెషన్లలోనే ముగిసింది. అయితే ఈ మ్యాచ్‌కు ప్రేక్షకులు హాజరు కాకపోవడంతో వేదికల ఎంపికపై సోషల్ మీడియా వేదికగా కొత్త చర్చకు దారి తీసింది. 'ఒక దిగువ స్థాయి జట్టుతో ఆడాల్సి వచ్చినప్పుడు టెస్ట్ క్రికెట్‌ను చూడటానికి ఇష్టపడే స్టేడియాన్ని వేదికగా ఎంచుకోవాలి. నిర్దిష్ట టెస్ట్ వేదికలు ఉండాలనే విరాట్ కోహ్లీ సూచనను పరిగణలోకి తీసుకోవాలి. అహ్మదాబాద్ మైదానం దేశంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం. అంత పెద్ద మైదానంలో దిగువ స్థాయి జట్టుకు ఆతిథ్యం ఇవ్వడం వల్ల ఖాళీగా కనిపిస్తుంది. అహ్మదాబాద్ టీ20 మార్క్యూ మ్యాచ్‌లకు మంచి వేదిక. టెస్ట్‌లకు ఏ మాత్రం కాదు. ప్రధాన జట్టుతో ఇక్కడ టెస్ట్ మ్యాచ్ ఆడినా.. స్టేడియం ఖాళీగానే కనిపిస్తోంది. టూరిజం, కనెక్టివిటీ ఉన్న నగరాలను టెస్ట్ వేదికలుగా ఎంచుకోవాలి. చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, ముంబై, పూణే, నాగ్‌పూర్, ఢిల్లీ, ధర్మశాల, వైజాగ్ వంటి స్టేడియాలను టెస్ట్ మ్యాచ్‌లకు పరిగణలోకి తీసుకోవాలి.'అని ఓ అభిమాని సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశాడు. ఈ పోస్ట్‌కు మెజార్టీ అభిమానులు మద్దతు తెలుపుతున్నారు. బీసీసీఐ రొటేషన్ పాలసీలను 18 వేదికలను టెస్ట్‌ల కోసం ఉపయోగిస్తుంది. అయితే సుదీర్ఘ ఫార్మాట్ కొన్ని నగరాలకు మాత్రమే పరిమితం చేయాలనే వాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2019లో విరాట్ కోహ్లీ టెస్ట్‌లను కొన్ని వేదికలకు మాత్రమే పరిమితం చేయాలని చెప్పాడు. రొటేషన్ పాలసీ టీ20, వన్డే ఫార్మాట్‌లకు బాగుటుందని, టెస్ట్ మ్యాచ్‌లను ఐదు వేదికలకే పరిమితం చేయాలని సూచించాడు. దసరా పండుగ రోజున మ్యాచ్‌ను షెడ్యూల్ చేయడం కూడా తెలివి తక్కువ పనని, మ్యాచ్‌కు ప్రేక్షకులు హాజరు కాకపోవడానికి ఇది ఒక కారణమని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. బ్రాడ్ కాస్టర్స్ ఒత్తిడితో పండుగ రోజు ఈ మ్యాచ్ షెడ్యూల్ చేసినట్లు అర్థమవుతుంది.



# బిడ్డ బాగున్నావా ... అమ్మల ఆప్యాయతల నడుమ

## - పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ యాదవ్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గ్రామాలలో ఒకానొకప్పుడు పోలీసులు వస్తున్నారంటే భయంతో ఆ మడ దూరం పరిగెత్తే ప్రజలు ఇప్పుడు ప్రేమ, అభిమానాలు, ఆప్యాయతతో స్వాగతిస్తూ తమ సమస్యలను చెప్పుకుంటున్నారు. మారుమూల పల్లెల్లో సైతం భయాన్ని మరచి పోలీసులపై ఆప్యాయత ఆదరాభిమానాలు కురిపిస్తున్నారు. దసరా ఉత్సవాలలో భాగంగా కాల్వ శ్రీరాంపూర్ కు వచ్చిన పెద్దపల్లి ఏసీపి గజ్జి కృష్ణ యాదవ్ ను బాగున్నావా బిడ్డా అంటూ ఆప్యాయంగా పలకరించిన వృద్ధులే నిదర్శనం...

# చరిత్ర సృష్టించిన జస్‌ప్రీత్ బుమ్రా..



టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించాడు. టెస్ట్‌ల్లో సొంతగడ్డపై అత్యంత వేగంగా 50 వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా జవగళ్ శ్రీనాథ్‌తో సమంగా బుమ్రా నిలిచాడు. ఈ క్రమంలో అతను కపిల్ దేవ్ రికార్డ్‌ను అధిగమించాడు. వెస్టిండీస్‌తో అహ్మదాబాద్ వేదికగా గురువారం ప్రారంభమైన తొలి టెస్ట్‌లో మూడు వికెట్లు తీయడం ద్వారా బుమ్రా ఈ ఫీట్ సాధించాడు. బుమ్రా, జవగళ్ శ్రీనాథ్ 24 ఇన్నింగ్స్‌ల్లో సొంతగడ్డపై 50 టెస్ట్ వికెట్లు సాధించారు. కపిల్ దేవ్ 25 ఇన్నింగ్స్‌లో ఈ ఘనతను అందుకున్నాడు. అయితే సొంతగడ్డపై బుమ్రాదే అత్యుత్తమ యావరేజ్ కావడం విశేషం. 17 యావరేజ్‌తో బుమ్రా 50 వికెట్లు పడగొట్టగా.. రిచీ బెనాడ్ 18.38 యావరేజ్‌తో బుమ్రా తర్వాతి స్థానంలో ఉన్నాడు. డబ్ల్యూటీసీ చరిత్రలో 200 వికెట్ల మైలురాయి అందుకునేందుకు బుమ్రా దూసుకెళ్తున్నాడు. ప్రస్తుతం అతను 173 వికెట్లతో నిలిచాడు. డబ్ల్యూటీసీ 2027 ఎడిషన్‌లో అతను ఈ మైలురాయి అందుకునే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 44.1 ఓవర్లలో 162 పరుగులకు కుప్పకూలింది. వెస్టిండీస్ బ్యాటర్లలో జస్టిన్ గ్రీవ్స్(48 బంతుల్లో 4 ఫోర్లతో 32), షైహోప్(36 బంతుల్లో 3 ఫోర్లతో 26), రోస్టన్ ఛేజ్(43 బంతుల్లో 4 ఫోర్లతో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్ నాలుగు వికెట్లు తీయగా.. జస్‌ప్రీత్ బుమ్రా మూడు వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్‌కు ఒక వికెట్ దక్కింది. భారత బౌలర్ల ధాటికి వెస్టిండీస్ ఇన్నింగ్స్ రెండు సెషన్లలోనే ముగిసింది.

# చరిత్ర సృష్టించిన సిరాజ్

భారత్- వెస్టిండీస్ మధ్య అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో టీమ్‌ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ చరిత్ర సృష్టించాడు. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండిస్?ను భారత్ బౌలర్లు తీవ్రంగా దెబ్బకొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో సిరాజ్ నాలుగు కీలక వికెట్లు పడగొట్టి, కరేబియన్ జట్టు టాప్ ఆర్డర్‌ను చాప చుట్టేశాడు. ఈ అద్భుత ప్రదర్శనతో 2025 క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక వికెట్లు (31 వికెట్లు) సాధించిన బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. ఆస్ట్రేలియా బౌలర్లు మిచెల్ స్టార్క్ (29 వికెట్లు), నాథన్ లైయన్ (24 వికెట్లు), వెస్టిండీస్ పేసర్ షామర్ జోసెఫ్ (22 వికెట్లు)లను వెనక్కి నెట్టాడు. సిరాజ్ ఇటీవలి కాలంలో టీమ్‌ఇండియా బౌలింగ్ దళంలో కీలక ఆటగాడిగా మారాడు. కొత్త బంతితో ప్రత్యర్థి బ్యాటర్లను ఆటలోకి రానీయకుండా చేయడంలోనూ, క్రీజులో స్థిరపడిన ఆటగాళ్లను తన వేగవంతమైన బౌ లింగ్‌తో పెవిలియన్‌కు చేర్చడంలోనూ సిద్ధహస్తుడిగా నిరూపించుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా గైర్హాజరీలో బౌలింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో సిరాజ్ అసాధారణ ప్రదర్శన కనబరిచాడు. ముఖ్యంగా ఐదో టెస్టులో జట్టు విజయం సాధించి సిరీస్‌ను సమం చేయడంలో అతడి పాత్ర కీలకంగా నిలిచింది. ప్రస్తుత వెస్టిండీస్ సిరీస్‌లోనూ తన నాలుగు వికెట్లతో మ్యాచ్‌ను భారత్ వశం చేసుకునేలా చేశాడు. రెడ్ బాల్ క్రికెట్‌లో సిరాజ్ తన స్థాయిని మరోసారి చాటాడు. టీమ్ ఇండియాకు టెస్టు ఫార్మాట్‌లో విజయాలను అందిస్తూ బౌలింగ్ రీతిలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాడు.



# యంగ్ ఇండియా స్కూల్‌లో అడ్మిషన్లు

## 1నుంచి 6 వతరగతి వరకు ప్రారంభం

**హైదరాబాద్, అక్టోబర్3:** నగరంలోని ప్రముఖ విద్యాసంస్థలలో ఒకటైన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రస్తుతం 1వ తరగతి నుండి 6వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభించినట్టు ప్రకటించింది. మంచిరేవులలో ఇటీవలే సిఎం రేవంత్ దీనిని ప్రారంభించారు. విద్యార్థుల భవిష్యత్తును బహుముఖంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ స్కూల్ విద్యా ప్రణాళికను రూపొందించింది. ఇక్కడ చదువుతో పాటు క్రీడలు, విలువలతో కూడిన బోధన, నైపుణ్యాల అభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ విద్యాసంస్థలో విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, క్రీడలు, కో-కరిక్యులర్ కార్యకలాపాలలో కూడా ప్రతిభ చూపే అవకాశాన్ని పొందుతారు. పిల్లలలో సృజనాత్మకతను వెలికితీయడం, క్రమశిక్షణను అలవరచడం, సమాజంపై బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడం స్కూల్ ప్రధాన లక్ష్యం. అదేవిధంగా, నాయకత్వ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేలా బోధన వ్యవస్థను అమలు చేస్తున్నారు. ఈ స్కూల్‌లో అకడమిక్ ప్రోగ్రాంలతో పాటు స్పోర్ట్స్ మరియు ఇతర కార్యకలాపాలను సమన్వయంతో నిర్వహిస్తున్నారు. ఆధునిక బోధన పద్ధతులు, విలువల ఆధారిత విద్యా విధానంతో విద్యార్థులు సమగ్ర అభివృద్ధి చెందేలా స్కూల్ ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. తమ పిల్లలకు మంచి విద్యా వాతావరణం కల్పించాలని కోరుకునే తల్లిదండ్రులు అడ్మిషన్ల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా 9059196161 నంబర్‌ను సంప్రదించవచ్చు. మొత్తం మీద, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ విద్యార్థుల చదువుతో పాటు వారి నైపుణ్యాలు, వ్యక్తిత్వం, విలువలను అభివృద్ధి చేస్తూ భవిష్యత్తులో సమాజానికి ఆదర్శవంతమైన పౌరులుగా తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగుతోంది.

# కాంతారా చాప్టర్-1 కు అభినందనల వెల్లువ

## వీర లెవల్లో ఉందంటూ నటుల కితాబు




దసరా పండుగ కానుకగా అక్టోబర్ 2న గ్రాండ్‌గా విడుదలైన 'కాంతార: ఛాప్టర్ 1' సినిమా ప్రేక్షకుల నుంచి విశేష స్పందన పొందుతోంది. రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పాన్-ఇండియా ఫాంటసీ డ్రామా మరోసారి దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. భక్తి, మానవత్వం, పరబ్రహ్మ భావనల మేళవింపుతో వచ్చిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు మాత్రమే కాకుండా ఇండస్ట్రీ ప్రముఖులు కూడా అభినందిస్తున్నారు. ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్ సినిమా బాగుందని ట్వీట్ చేయగా, తాజాగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మరియు అర్జున్ రెడ్డి ఫేమ్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా సినిమా గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్ఆడుతూ...కాంతార: ఛాప్టర్ 1 నిజమైన మాస్టర్ పీస్ అంటూ సినిమా గురించి ప్రశంసలు కురిపించారు. ఇండియన్ సినిమా చరిత్రలో ఇలాంటి సినిమాను ఎప్పుడూ చూడలేదు. ఇది ఓ సినిమాటిక్ ప్రభంజనం. భక్తి ఎలా ఉంటుందో రిషబ్ అద్భుతంగా చూపించారు. ఇది ఆయన ఒంటి చేత్తో తీసిన సినిమానే కాదు, ఒక ఆధ్యాత్మిక ప్రయాణం. సినిమా బీజీఎమ్‌ను ఎంతగా పొగడినా తక్కువే, అంటూ పేర్కొన్నారు. అలాగే, ప్రభాస్ తన సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ.. కాంతార: ఛాప్టర్ 1 అనేది ఒక బ్రిలియంట్ మూవీ. ఇది ఈ ఏడాది బి÷-గగెస్ట్ హిట్ గా నిలుస్తుంది. ఈ సినిమాకు అసలు శక్తి అంటే రిషబ్ శెట్టి నటన. ఆయన నటనలో కనిపించిన భక్తి, శక్తి అసాధారణం. అలాగే నిర్మాత విజయ్ కిరగందూర్ అద్భుతంగా సినిమాను రూపొందించారు. చిత్ర యూనిట్‌కు నా హృదయ పూర్వక అభినందనలు అని పేర్కొన్నారు. సినిమా విడుదలైన రోజే జూనియర్ ఎన్టీఆర్ సినిమా చూసి స్పందించగా, ఇది కచ్చితంగా మరో స్థాయిలో తీసుకెళ్లే సినిమా. రిషబ్ శెట్టికి ప్రత్యేక శుభాకాంక్షలు, అంటూ ట్వీట్ చేశారు. కేవలం ప్రేక్షకుల నుంచి మాత్రమే కాకుండా విమర్శకుల నుంచి కూడా ఈ చిత్రానికి హై రేటింగ్స్ వస్తున్నాయి. డివోషనల్ సబ్జెక్ట్‌ను కళాత్మకంగా, కమర్షియల్ గా చూపించి ప్రేక్షకులను ఆలోచింపజేసేలా తీర్చిదిద్దిన విధానం ప్రశంసలందుకుంటోంది. రిషబ్ శెట్టి మరోసారి తన కంటెంట్ ఎంపికలో ఎంత విలక్షణంగా ఆలోచిస్తాడో నిరూపించుకున్నాడు. 'కాంతార: ఛాప్టర్ 1'కు మద్దతుగా స్టార్ హీరోలు స్పందించడం, సినిమా విజయం పట్ల గర్వంగా ఫీలవడం ఫ్యాన్స్‌కు సైతం ఆనందాన్ని కలిగిస్తోంది.

## జాతీయ అవార్డులపై విమర్శలు సరికాదు: రాణిముఖర్జీ

ఇటీవల మొదటిసారి నేషనల్ అవార్డును అందుకున్న బాలీవుడ్ నటి రాణీ ముఖర్జీ ,జాతీయ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. ఆ పురస్కారాలు ప్రకటించినప్పుడు కొన్నిసార్లు వచ్చే విమర్శలపై స్పందించారు. అవార్డులు ప్రకటించినప్పుడు ఎవరైనా ప్రశ్నిస్తే వాటి విలువ తగ్గిపోతుందన్నారు. 'దేశవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది. మనకు నేషనల్ అవార్డు ప్రకటించినప్పుడు ప్రేక్షకులు కూడా మనం దానికి అర్హులమని భావిస్తే వచ్చే సంతోషం మాటల్లో చెప్పలేం. అలా కాకుండా 'ఆమె నటనకు పురస్కారం వచ్చిందా?. ఆమె కంటే గొప్పవారు చాలామంది ఉన్నారు' అని కామెంట్స్ వినిపించాయంటే దాన్ని అందుకున్నప్పటికీ విలువ ఉండదు. తాజాగా నాకు జాతీయ పురస్కారం వచ్చినప్పుడు అందరూ అంగీకరించారు. వారి అంగీకారం నాకు అవార్డు కంటే గొప్పగా అనిపించింది. నటీనటులకు చిన్న పురస్కారం కూడా ముఖ్యమే. ప్రేక్షకులను అలరించడమే మా ప్రధాన ఉద్దేశం. మాకు గౌరవం, గుర్తింపు వచ్చాయంటే అభిమానులు కూడా ఆనందిస్తారు' అని రాణి చెప్పారు. 2023లో విడుదలైన 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' సినిమాకు గాను రాణీ ముఖర్జీ ఉత్తమ నటిగా జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు.



## ఆనాడు ఒక్క షో ప్రదర్శన కోసం కష్టపడ్డా

### కాంతారా విజయం మర్చిపోలేనిదన్న రిషబ్ శెట్టి

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార చాప్టర్ 1' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఆయన గత రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 2016లో తన సినిమాను ఒక్క షో ప్రదర్శించడం కోసం ఎంతో కష్టపడినట్లు చెప్పారు. ఈరోజు తనకు దక్కుతున్న గౌరవం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. 2016లో నా చిత్రం సాయంకాలం షో ప్రదర్శించడం కోసం పడిన కష్టం నుంచి 2025లో 5000కు పైగా థియేటర్స్‌లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించే వరకూ ఇదీ.. దర్శకుడిగా నా జర్నీ. ఈ సినీ ప్రయాణం దేవుడి దయతో పాటు మీ ప్రేమాభిమానాలను ఎప్పటికీ మర్చిపోలేను. మీ ఆదరణతోనే ఈ విజయం సాధ్యమైంది. నన్ను ఆదరించిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతల అంటూ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 2012లో 'తుగ్లక్' అనే సినిమాతో తన కెరీర్ ప్రారంభించిన రిషబ్ శెట్టి నటుడిగా, దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. మొదటిసారి 2016లో 'రిక్కీ' అనే సినిమాకు దర్శకత్వం వహించారు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఆ సినిమా పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. 2022లో ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార'కు జాతీయస్థాయిలో గొప్ప గుర్తింపు వచ్చింది. చిన్న సినిమాగా విడుదలై బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకొని అవార్డులు తెచ్చింది. ఇప్పుడు దీని ప్రీక్వెల్‌గా వచ్చిన 'కాంతార చాప్టర్ 1'కూడా అదేస్థాయిలో ఆదరణ సొంతం చేసుకుంటోన్న విషయం తెలిసిందే.






## మన శంకర వరప్రసాద్‌గారులో ఉదిత్ నారాయణ్ పాట

కమర్షియల్ హంగులతో చక్కటి వినోదాన్ని పంచే దర్శకుడు అనిల్ రావిపూడి కొత్త పంథాను అనుసరిస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' తీసి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్నారు. ఇక ఇందులోని 'గోదారి గట్టుమీద' పాటను రమణ గోగులతో పాడించి నేటి యువతరాన్ని సైతం కట్టిపడేశారు. ఇప్పుడు అలనాటి క్రేజీ గాయకుడు ఉదిత్ నారాయణ్‌తో మేజిక్ క్రియేట్ చేసేందుకు అనిల్ రావిపూడి సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. నయనతార కథానాయిక. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా సినిమాను తీసుకొచ్చేందుకు ముస్తాబు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఉదిత్ నారాయణ్‌తో ఓ పాట పాడిస్తున్నారు. 90 దశకం చివరిలో 2000 సంవత్సరం తర్వాత వచ్చిన తెలుగు సహా ఇతర భాషల్లో ఉదిత్ నారాయణ్ స్వరం శ్రోతలను ఓ ఊపు ఊపేసింది. మరీ ముఖ్యంగా తెలుగులో ఆయన పాటలకు విశేషమైన క్రేజ్ ఉండేది. చిరంజీవి నటించిన చిత్రాల్లోని 'రామ్మా చిలకమ్మా..', 'కైకలూరి కన్నె పిల్ల..', 'వానా వానా వెన్నెల వానా...' వంటి పాటలను ఉదిత్ నారాయణ్ ఆలపించారు. అవి ఎవర్‌గ్రీన్‌గా నిలిచాయి. ఇప్పుడు మరోసారి 'మీసాల పిల్ల' అంటూ తన స్వరంతో అలరించబోతున్నారు. దీనికి చిరంజీవి డ్యాన్స్, గ్రేస్ తోడైతే వెండితెరపైన నిజంగా సంక్రాంతి సందడే.

## రాజుగారి గది 4: శ్రీచక్రం

### ఆరేళ్ల గ్యాప్ తరవాత ఓంకార్ ప్రకటన

తెలుగు ప్రేక్షకుల్ని భయపెట్టిన హారర్ ఫ్రాంచైజీ 'రాజు గారి గది' ఇప్పుడు మళ్లీ మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతోంది. యాంకర్-డైరెక్టర్ ఓంకార్ ఆరేళ్ల గ్యాప్ తర్వాత ఈ సిరీస్‌లో నాలుగో భాగాన్ని ప్రకటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రం పేరు రాజు గారి గది 4: శ్రీచక్రం. తాజాగా విడుదలైన ఫస్ట్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో కాళికా మాత ఉగ్రరూపంలో దర్శనం ఇవ్వగా, ఎర్రచీరలో ఉన్న ఓ మహిళ దేవీ వైపు నడుచుకుంటూ వెళ్తుండటం హారర్, మిస్టికల్ ఎలిమెంట్స్‌ను సూచిస్తోంది. పోస్టర్‌కు జత చేసిన ట్యాగ్ లైన్ ఆసక్తి రేపుతుంది. ఈసారి కథా నేపథ్యం పూర్తిగా భక్తి, భయాల మిశ్రమంగా ఉండనుంది. 'కాళికాపురం' అనే ఊరిలోని కాళికా మాత ఆలయం, శ్రీచక్రం మహిమ, భక్తి వల్ల మేల్కొనే అమ్మవారు వంటి అంశాలతో హారర్, థ్రిల్లర్, కామెడీని మిక్స్ చేస్తూ ఓ కొత్త డైవైన్ యూనివర్స్‌ను నిర్మించనున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. రాజు గారి గది హిట్ కావడంతో దానికి సీక్వెల్స్ చేస్తూ వస్తున్నారు ఓంకార్. ఇప్పటికే రాజు గారి గది2, రాజు గారి గది3 చిత్రాలు హిట్ కావడంతో రాజు గారి గది4 కు శ్రీకారం చుట్టారు. 'రాజు గారి గది 4: శ్రీచక్రం' సినిమా 2026 దసరా సందర్భంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రారంభ దశలో ఉన్న స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన తర్వాత షూటింగ్ మొదలవుతుంది. 2015లో వచ్చిన 'రాజు గారి గది' బాక్సాఫీస్ దగ్గర విజయాన్ని నమోదు చేయగా, 2017లో 'రాజు గారి గది 2', 2019లో 'రాజు గారి గది 3' ప్రేక్షకులను అంతగా అలరించకలేక పోయాయి. అందుకే ఓంకార్ గ్యాప్ తీసుకుని మళ్లీ ఈ కొత్త కాన్సెప్ట్‌తో తిరిగి వస్తున్నారు. భక్తి, హారర్, థ్రిల్లర్ మేళవింపుతో 'శ్రీచక్రం' కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది. క్యాస్టింగ్‌కి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.




## నానితో సినిమాకు క్లాప్ కొట్టిన ఓజి దర్శకుడు సుజిత్



ఓజి విడుదల కాక ముందే నాని హీరోగా దర్శకుడు సుజీత్ ఓ సినిమా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఏడాది దాటినా మరో అప్‌డేట్ లేకపోవడంతో ఈ చిత్రం క్యాన్సిల్ అయిందనే రూమర్స్ ఇటీవల వచ్చాయి. 'ఓజీ' ప్రమోషన్స్‌లోనే సుజీత్ వాటికి చెక్ పెట్టారు. నానితో సినిమా ఉంటుందని స్పష్టం చేశారు. తాజాగా ఈ చిత్రాన్ని ప్రారంభించారు. దసరాని పురస్కరించుకుని ఈ సినిమాని లాంఛనంగా హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ వేడుకకు హీరో వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సంబంధిత ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. సినిమాలోనూ కలిసి నటిస్తున్నారా? అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుందని, మరిన్ని అప్‌డేట్స్ రాబోతున్నాయని నిర్మాత వెంకట్ బోయనపల్లి తెలిపారు. సుజీత్ 'ఓజీ' విజయాన్ని ఆస్వాదిస్తుండగా.. నాని 'ది ప్యారడైజ్'లో నటిస్తున్నారు. 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రమిది. నానితో చేయబోయే సినిమా 'ఓజీ' యూనివర్స్‌లోకి వస్తుందా? అన్న ప్రశ్నకు ఇటీవల సుజీత్ సమాధానమిచ్చారు. తన తొలి సినిమా 'రన్ రాజా రన్' స్టైల్‌లో ఉంటుందని, 'ఓజీ' యూనివర్స్‌లో భాగం కాదని తెలిపారు. ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. కానీ, అధికారిక ప్రకటన లేదు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 9014159785, Mail:thecrimenews123@gmail.com